
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

8-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 247 పేజీలు: 10+4 వెల: 6.50


## ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

క్వాంటం ప్రపంచాన్ని కళ్లకు కట్టిన శాస్త్రవేత్తలు

## నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!

5లో

## ప్రజాజీవితంలో పాతికేళ్లు!

### ప్రభుత్వాధినేతగా 25 యేళ్లుగా సేవలు




ప్రజల జీవితాలను బలోపేతం కోసం

5లో

దేశ ఉజ్వల ప్రగతి కోసం తపన

ప్రధాని మోడీ ఎక్స్‌లో ఆసక్తికర పోస్ట్

గుజరాత్ సిఎంగా, ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవ ఫొటోలు జోడింపు



# డబుల్ సంక్షేమం

- పింఛన్ల నుంచి ఆటో డ్రైవర్ల సేవ వరకు పథకాలు విజయవంతంగా అమలు చేశాం
- ఆరోగ్యాంధ్రప్రదేశ్ అనేది మా విధానం
- పెట్టుబడులొస్తున్నాయ్... ఉద్యోగాలు కల్పిస్తున్నాం
- డిఎస్సీ నోటిఫికేషన్‌తో టీచర్లను నియమించాం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం
- సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి
- మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నాం
- అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా అడుగులు
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందుతోందని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. ఈ ఉదయం సిఎం చంద్రబాబు తన మజిలీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం అమలు విజయవంతమైంది. అలాగే ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 'పేదల సేవలో' కార్యక్రమంలో 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటివద్దే పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థాన్ని ఇచ్చాం. తన బిడ్డ చదువుకోవాలని కలలుకనే పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు 'తల్లికి వందనం' పథకాన్ని తీసుకువచ్చాం. రూ.10 వేల కోట్లతో పథకాన్ని అమలు చేశాం. అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశాం. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించాం. దీపం పథకంకింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఏటా రూ.2,684 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటికి 2 కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చాం. స్వాతంత్ర్య దినోత్సవంసందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత ప్రయాణాన్ని కానుకగా ఇచ్చాం. 16,347 పోస్టులతో మెగా డిఎస్సీ నిర్వహించి నియామకాలు చేసాం. ప్రజలకు నాడు కునుకు లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం.

పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు తిరిగి తీసుకువచ్చాం. 204 అన్నా క్యాంటిన్లలో 5.16 కోట్ల మందికి రూ.5లకే కడుపునింపామన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు పెంచాం. దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో చోటు కల్పించాం. 40 వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. మేనిఫెస్టోలో చెప్పినట్లు కల్లు గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించాం. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఇస్తున్నాం. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించాం. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఎస్సీ సామాజిక వర్గాల్లో అంతరాలు తగ్గించేలా.. ఏ వర్గాన్ని నొప్పించకుండా, ఏ ఒక్కరూ నష్టపోకుండా ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్ష నెర >>2

## ప్రజారోగ్యంపై స్పెషల్ ఫోకస్

కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు

2లో

## నారావారిపల్లెలో బాబు ఫ్యామిలీ

రామ్మూర్తినాయుడు సంవత్సరిక కార్యక్రమానికి హాజరు

### తిరుపతి టూ ఢిల్లీ

# ఎర్ర చందనం



ఎర్రచందనం పట్టివేత గురించి మీడియాకు వివరిస్తున్న పోలీసు అధికారులు

- ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు, ఎర్రచందనం సీజ్
- ఢిల్లీ తుగ్లకాబాద్‌లో గోదాముల్లో సోదాలు
- రెడ్ శాండిల్స్ విలువ రూ. 11 కోట్లు పైమాటే
- ఎపి డిజిపి కార్యాలయం ప్రకటన విడుదల

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో భారీగా ఎర్రచందనం నిల్వలను పట్టుకున్నామని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ కథనాన్ని నిర్ధారిస్తూ ఎపి డిజిపి హరిష్‌కుమార్ గుప్తా కార్యాలయంనుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. దిల్లీలో తుగ్లకాబాద్‌లోని గోదాములపై నిర్వహించిన దాడుల్లో సుమారు 10 టన్నుల దుంగలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పట్టుకున్న ఏ గ్రేడ్ చందనం విలువ సుమారు రూ. 11 కోట్ల విలువ ఉంటుందని ఈ సందర్భంగా పోలీసు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, ముంబైకి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశామనీ, హరియాణాకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని వివరించారు. ఎర్రచందనం తిరుపతి నుంచి ఢిల్లీకి అక్రమంగా తరలించినట్టు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం భారీగా ఎర్రచందనం నిల్వలను స్వాధీనం చేసుకుంది. ఎపి నుంచి దిల్లీకి తరలించిన సుమారు 10 టన్నుల ఎర్రచందనాన్ని సంబంధిత సమాచారంతో పట్టుకున్నారు.

ఢిల్లీలోని తుగ్లకాబాద్‌లో ఎర్రచందనం బయటపడింది. అంతేకాకుండా ఢిల్లీ, ఎపి పోలీసులు హైదరాబాద్, ముంబయికి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు ఇర్ఫాన్, అమిత్‌పవార్ ఉన్నారు. అయితే హరియాణాకు చెందిన మరో ఎర్రచందనం స్మగ్లర్ పరారీలో ఉన్నాడు. ఎర్రచందనం దుంగలను తిరుపతి నుంచి ఢిల్లీకి తరలించినట్లు సమాచారం.



మంగళవారం వెంకటాచలంలో మీడియాతో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

### పార్టీ ఫిరాయింపుల చట్టానికి

## సవరణలు అవసరం

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**వెంకటాచలం (నెల్లూరు), అక్టోబర్ 7, ప్రభాత వార్త :** సిజెఐపై జరిగిన దాడిని న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా తాను భావిస్తున్నట్లు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. వెంకటాచలం స్వర్ణభారతి ట్రస్ట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తి పై జరిగిన దాడి శోచనీయమని దాన్ని తాను గర్హిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇది ఎంత మాత్రం సమర్ధనీయం కాదని >>2

### పుర'పాలన'

# భేషుగ్గా ఉండాలి

- మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాలి
- తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై స్పెషల్ ఫోకస్
- అర్హులందరికీ టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి
- మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాప్‌లో మంత్రి నారాయణ



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా మున్సిపల్ కమిషనర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో మూడు రోజుల పాటు వర్క్ షాప్ జరుగుతుంది. ఈ వర్క్ షాప్‌నకు మంత్రి నారాయణ హాజరయ్యారు. రాష్ట్రంలోని 77 మున్సిపాల్టీల కమిషనర్లు, ఇంజినీర్లతో మూడు రోజుల పాటు వేర్వేరుగా వర్క్ షాప్ జరగనుంది. మొదటి రోజు వర్క్ షాప్‌నకు 29 మున్సిపాల్టీల నుంచి అధికారులు హాజరయ్యారు. పట్టణాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈవర్క్ షాప్‌లో ప్రధానంగా చర్చిం >>2

### సోదరిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని

## యువకుడి హత్య



మృతుడు గణేష్ (ఫైల్)


### గుంటూరులో ఘటన

**గుంటూరు, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి :** సోదరిని ప్రేమించి వివాహం చేసుకున్నాడని కుర్రా గణేష్ అనే యువకుడిని యువతి సోదరుడు దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుంటూరు పొన్నూరు రోడ్డులో ఈ దారుణం జరిగింది. ఈ ఘటనలో యువతి సోదరుడుతో పాటు మరో ఇద్దరు యువకులు ఉన్నట్టు సమాచారం. తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన అంజలిదేవిని విద్యుత్ శాఖలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్న గణేష్ ప్రేమించి 12 రోజుల క్రితం పెళ్లిచేసుకున్నాడు. రక్షణ కావాలంటూ నల్లపాడు పోలీసులను ఆశ్రయించాడు. అప్పట్లో ఇద్దరి కుటుంబాలను పిలిచి మాట్లాడారు. అంతా సద్దుమణిగిందని భావించిన తరుణంలోనే తమకుమారుడిని దారుణంగా హతమార్చారని గణేష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. నాగ గణేష్‌ను పోలీస్ స్టేషన్లోనే చంపేస్తా అంటూ యువతి సోదరుడు దుర్గారావు హెచ్చరించాడని తెలిసింది. ఈ క్రమంలోనే గణేష్‌పై దుర్గారావు దాడి చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించారు.

# 10 నుంచి రచ్చబండ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్సీ పోరు ఉధృతం
- ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ
- పార్టీ నేతలతో మాజీ సిఎం జగన్ సమావేశంలో కీలక నిర్ణయం
- 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించనున్న జగన్

**విజయవాడ,అక్టోబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరిస్తామని వైఎస్సార్సీ అగ్రనేత, మాజీ సిఎం జగన్ వెల్లడించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కనీసం ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాలు సేకరిస్తామన్నారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. అక్టోబరు 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని వైఎస్సార్సీ అధినేత జగన్ సందర్శించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు జగన్ చెప్పారు. అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారికి డిమాండ్ పత్రాలను సమర్పించాలి. జిల్లా కేంద్రాల్లో నవంబరు 12న ర్యాలీలు జరుగుతాయి.



ఒక జిల్లాలో నేను కూడా పాల్గొంటాను. నవంబరు 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి సేకరించిన సంతకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటాయి. నవంబరు 24న సేకరించిన సంతకాలతో కూడిన వాహనాలను జిల్లా కేంద్రంలో జెండా ఊపి విజయవాడకు తరలిస్తారు. సేకరించిన ఈ సంతకాలు గవర్నర్‌కు అప్పగించే కార్యక్రమం >>2

## ఈసారి ట్రక్కులపై టారిఫ్

25శాతం సుంకాలు విధింపు

నవంబర్ 1 నుంచి అమలు

డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

5లో

## 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

# ఐటి సోదాల కలకలం

- తెలుగు రాష్ట్రాల్లో 25 చోట్ల అధికారుల తనిఖీలు
- రూ.300 కోట్ల దాల్ ట్రేడ్ స్కాంపై ఆరా
- కొనుగోళ్లు చేయకుండానే నివేదికలు... గుర్తింపు
- కీలక పత్రాలు స్వాధీనం.. కొనసాగుతున్న దాడులు

**సచివాలయం,అక్టోబర్ 7,ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా మరోపెద్ద పప్పుల దందా వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.300కోట్ల విలువైన పప్పుల వ్యాపారంలో బారీ అవకతవకలు అక్రమ నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన ఆదాయపు పన్ను మంగళవారం తెల్లవారు జామునే సోదాలు ప్రారంభించింది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, హైదరాబాద్ నగరాల్లో ఒకేసారి సోదాలు జరిగాయి. పప్పుల సరఫరా పేరుతో ప్రభుత్వ నిధులను మలచినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఐటి శాఖాధికారులు రాష్ట్రంలోని 25ప్రదేశాల్లో సోదాలు జరిపారు. విశాఖలో హిందూస్తాన్ ట్రేడర్స్, కర్నూల్లో వికేర్ గ్రూప్, గుంటూరులో మరికొన్ని ప్రముఖ పప్పు ట్రేడింగ్ కంపెనీలు దర్యాప్తు కిందకొచ్చాయి. ఒకేసారి పలు బృందాలు పనిచేయడంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం నెలకొంది.

గత ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లయిస్ శాఖ నుంచి టెండర్లు పొంది పెద్దమొత్తంలో పప్పులు సరఫరా చేశామని చూపించి వందల కోట్లు బిల్లు వేసుకున్నట్లు తెలిసింది. చెల్లింపులు అయిన తర్వాత సరఫరా చేయకపోవడం, తక్కువ నాణ్యత గల పప్పులు అందించడం కొన్ని చోట్ల సరఫరానే నిలిపి వేయడం వంటి అంశాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

**ఎన్నికల సమయంలో భారీ క్యాష్ ఉపసంహరణలు**

దర్యాప్తులో ఐటి అధికారులు 2024ఎన్నికల ముందు పెద్దమొత్తం నగదు ఉపసంహరణలు జరిగినట్లు గుర్తించారు. ఈ లావాదేవీల వెనుక రాజకీయ సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో కూడా ఐటి వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఐటి దాడుల తర్వాత సివిల్ సప్లైస్ శాఖలోనూ చురుగ్గా కదలికలు ప్రారంభమయ్యాయి. ఏఏ టెండర్లు ఎవరికిచ్చారు? చెల్లింపులు ఎప్పుడు జరిగాయి.? అనే వివరాలను అధికారులు తేలుస్తున్నారు.

**రాజకీయ వర్గాల్లో చర్చ**

ఈ దాడులతో రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఎవరి అనుమతితో ఈ టెండర్లు కుదిరాయి? ఎవరి మార్గదర్శకత్వంలో చెల్లింపులు జరిగాయి అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. పలు కంపెనీలు పన్ను ఎగవేత, బోగస్ సరఫరా, హవాలా లావాదే వీల్లో నిమగ్నమైనట్లు ఆధారాలు లభించాయి. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం అని ఐటి అధికారులు స్పష్టం చేశారు.



మంగళవారం ఆది కవి వాల్మీకికి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

## ఆదికవి వాల్మీకికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** మహర్షి,ఆది కవి వాల్మీకి జ్ఞానం సముపార్జనకు పరిమితి లేదని నిరూపించిన మహనీయుడని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.తన వ్యక్తిగత కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి సిఎం చంద్రబాబు ఘన నివాళిని అర్పించారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సిఎం స్పందిస్తూ.. సృష్టి ఉన్నంత కాలం వాల్మీకి జీవితం స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుంది. జ్ఞానం సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని సిఎం చంద్రబాబు కొనియాడారు.సంస్కృతంలో ఆదికవి, పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత, మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సకల జనులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. జ్ఞాన సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి. పరిస్థితుల ప్రభావం కారణంగా కిరాతకుడిగా వ్యవహరించినా తపస్సుతో మహనీయుడుగా మారి ప్రపంచానికే జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి ఆయన. మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆచంద్రతారార్కం నిలబడిపోయే మహర్షి వాల్మీకి కీర్తిప్రతిష్ఠల్ని ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతం. వాల్మీకి మహాకవి విరచిత రామాయణ ఇతిహాసం.. సదా అనుసరణీయం.. ఆదర్శప్రాయమన్నారు. అఖండ భారతావనికి ఆదర్శప్రాయమైన నిలిచిన.. లోకభిరాముని దివ్యచరితను లోకోత్తరం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అని తెలిపారు. కృషి ఉంటే మనుషులు.. రుషులవుతారు.. మహాపురుషులవుతారన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఆ మహనీయునికి ఘన నివాళిగా రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.

## సవీందర్ రెడ్డిపై తదుపరి చర్యలొద్దు

### - సిబిఐకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డి వ్యవహారంలో సిబిఐ తదుపరి కార్యాచరణ చేపట్టొద్దని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సవీందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై దాఖలైన 'హెబియస్ కార్పస్'పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం విచారణ చేపట్టారు. సామాజిక మధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీంద్రరెడ్డి భార్య లక్ష్మీ ప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీంద్రరెడ్డిని అరెస్టు చేసింది.. గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం, దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక రాజకీయ పార్టీ వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని అరెస్టు చేసి.. తర్వాత గంజాయి కేసులో ఇరికించారని సవీంద్రరెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తర్వాతే సిబిఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ ఫైల్ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీంద్రరెడ్డి న్యాయవాది వివరించారు.గంజాయి కేసులో అరెస్టు చేస్తే... దానికి రాజకీయ కారణాలు అన్వయిస్తున్నారని ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా న్యాయస్థానానికి తెలిపారు. ఇరుపక్ష వాదనలు పరిగణనలోకి తీసుకుని జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు... సిబిఐ తదుపరి కార్యచరణ చేపట్టవద్దని ఆదేశించింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, డిజిపి, సిబిఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు... మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఎపి ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది ధర్మాసనం. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ త్వరలోనే చేపడతామని సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# పుర'పాలన' భేషుగ్గా ఉండాలి

>> చారు. 2029 లోగా పూర్తి చేయాల్సిన అభివృద్ధి ప్రాజెక్ట్‌లపై అధికారులకు పలు సూచనలు చేసారు. ఆ తర్వాత పట్టణాభివృద్ధిపై అధికారులకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేసారు.మున్సిపాల్టీల్లో ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ,డ్రైనేజి,రోడ్లు,వీధిదీపాల నిర్వహణ పక్కాగాచేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్ 85 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే తొలగించగా.. మరో 20 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను డిసెంబరు నెలాఖరుకు తొలగిస్తామన్నారు. జనవరి నుంచి ఘన వ్యర్థాలు పూర్తిగా ప్రాసెస్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలకు అదనంగా కొత్తగా మరో 6 ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నామని. ఇవన్నీ పూర్తయితే రాష్ట్రంలోని మున్సిపాల్టీలు డంపింగ్ యార్డ్ రహితంగా మారతాయన్నారు.

**ద్రవ వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకం: మంత్రి నారాయణ**

ప్రతిరోజూ ఇళ్లలో ఉపయోగించిన నీటితో పాటు వర్షపు నీరు కోసం కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అమృత్ పథకం 2 ద్వారా మున్సిపాల్టీల్లో రాబోయే రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు అందించేలా ముందుకెళ్తున్నామన్నారు..ఇక డ్రైనేజిలు,రోడ్లు,వీధి దీపాల కోసం వివిధ పథకాల నిధులతో పాటు మున్సిపాల్టీల నిధులు వినియోగించాల్సి ఉందన్నారు.ప్రాధాన్యతా క్రమంలో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి..అమృత్,ఆసియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ ,అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ నిధుల ద్వారా డ్రింకింగ్ వాటర్,డ్రైనేజి నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. మరోవైపు మున్సిపాల్టీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం,ప్రస్తుత పరిస్థితిపైనా అధికారులకు పలు సూచనలు చేసారు. నిర్మాణాలు పూర్తవుతున్న ఇళ్లను ప్రతి శనివారం లబ్దిదారులకు కేటాయించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. బుధవారం,గురువారం మరికొన్ని మున్సిపాల్టీల అధికారులతో జరిగే వర్క్ షాప్‌లోనూ మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్,టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి,ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర రావు పాల్గొన్నారు.

# సవరణలు అవసరం

>> ఆయన అన్నారు. దేశంలో పార్టీ ఫిరాయింపులు పెరిగాయని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు అని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ సమస్య ఈనాటిది కాదని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఉందని ఆయన అన్నారు. పార్టీ ఫిరాయించిన వారు తాము గెలిచిన పార్టీకి పదవికి రాజీనామా చేయాలన్నారు. లేదంటే వారిని పదవికి అనర్హులుగా ప్రకటించేలా 10 వ షెడ్యూల్ ను సవరించాలని ఆయన సూచించారు. లేదంటే ప్రభుత్వాలు కూలిపోయి రాష్ట్రాల్లో అస్థిరత నెలకొంటుందని తద్వారా ఆర్థిక భారం కూడా పెరుగుతుందని నాయుడు చెప్పారు. ఇది దేశ రాజకీయాల్లో ఆందోళన కలిగించే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఉచిత పథకాలు అభివృద్ధి నిరోధకాలని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు తమ ఉనికి కోసం పోటీపడి ఉచిత పథకాలను ప్రకటించడమే కాకుండా అమలు చేస్తున్నాయని వెంకయ్య నాయుడు అన్నారు. ప్రజలకు భారమైన విద్య, వైద్యం ఉచితంగా అందించగలిగినప్పుడే సమాజంలో అసమానతలు రూపు మాపవచ్చన్నారు. కోర్టులు కేసుల విషయంలో వాయిదాలు ఎక్కువగా వేసి తీర్పులు జాప్యం జరిగే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేసుల విచారణలో జాప్యం జరగకుండా ఉండాలంటే మరిన్ని అదనపు కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు.

## 'సిజెఐ గవాయ్‌పై దాడిని ఖండించాలి'

**విజయవాడ, అక్టోబరు 7, ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై అగ్రవర్ణాల వారు చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రిపబ్లిక్ అని పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృ తం కాకుండా తీవ్రంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో నీటి అవసరత దృష్ట్యా చెక్ డ్యాముల నిర్మాణం అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు ఇంకెప్పుడు జరగకుండా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇది న్యాయ వ్యవస్థకే సిగ్గుచేటన్నారు.

సుప్రీం కోర్టు జడ్జికే రక్షణ కరువైందని ప్రజలు వారి మనోవేదనకు గురయ్యారన్నారు. గత 180 ఏళ్ల చరిత్రలో వరుసుగా 3 లేదా 4 సంవత్సరాలు వర్షాలు పడకపోవడం వల్ల కరువు తాండవించిన ఘటనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రాజధాని అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నీటి అవసరం పెరిగిందన్నారు. లక్షల క్యూసెక్కుల నీరు వర్షాకాలంలో సముద్రం పాలవుతుందన్నారు. బిజెపి ఆధ్వర్యంలో నదులు అనుసంధానం జరుగుతుందన్నారు. కానీ రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అశ్రద్ధ వహిస్తుందన్నారు. జగ్గయ్యపేట నుండి కృష్ణానదిపై చెక్ డ్యాముల నిర్మాణం ద్వారా నీటి లభ్యత పెంచుకోవచ్చు అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టుల నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే రిపబ్లిక్ అన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.



మంగళవారం నారావారిపల్లెలో రామ్మోహన్‌నాయుడు సమాధివద్ద చంద్రబాబు కుటుంబసభ్యుల నివాళి

# నారావారిపల్లెలో బాబు ఫ్యామిలీ

## రామ్మూర్తినాయుడు సంవత్సిరక కార్యక్రమానికి హాజరు

**చంద్రగిరి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** దివంగత మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరిక (11వ నెల విస్తరి) కార్యక్రమం (మొదటి వర్ధంతి)బ్రాహ్మణులు హైందవ సంప్రదాయ పద్ధతిన జరిపించారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నారావారిపల్లిలోని తమ నివాసంలో మంగళవారం జరిగిన సంవత్సరిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరీ, నారా లోకేష్ హాజరై ఆద్యంతం కార్యక్రమాన్ని తిలకించి, నివాళులర్పించారు. సినీ హీరో, రామ్మూర్తి నాయుడు తనయుడు నారా రోహిత్, నారా గిరీష్‌లు సంయుక్తంగా తండ్రి సంవత్సరిక కార్యక్రమంలో సంతర్పణలు సమర్పించారు. అనంతరం స్మృతివనం వద్దకు చేరుకున్న చంద్రబాబు, భువనేశ్వరీ, లోకేష్, రోహిత్, గిరీష్, కుటుంబ సభ్యులు దివంగత నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కర్పూరహారతులిచ్చి, నివాళులర్పించారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున నారావారి బంధుమిత్రులు హాజరై దివంగత నారా రామ్మూర్తి నాయుడుకు నివాళులర్పించారు.

## చార్జిషీట్ వేయడానికి ఇంకెన్నాళ్లు కావాలి?

### నల్లపాడు పోలీసుల తీరుపై హైకోర్టు అసంతృప్తి

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులపై ఎపి హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.ఓ యువతి అనుమానాస్పద మృతి కేసులో దర్యాప్తు పూర్తి చేసినప్పటికీ అభియోగపత్రం/తుది నివేదికను సంబంధిత కోర్టులో దాఖలు చేయకపోవడంపై నల్లపాడు పోలీసుల వ్యవహార సరళి సరిగ్గా లేదని వ్యాఖ్యానించింది. భవనంపై నుండి పడిపోయినట్లు అనుమానాస్పద పరిస్థితులలో చనిపోయిన మృతురాలే వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు కొత్త కథ అల్లారని పేర్కొంది. ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికి ఆ యువతి మృతి చెందితే ఆమె మరణ వాంగ్మూలాన్ని ఎవరు ఎలా నమోదు చేశారని పోలీసులను ప్రశ్నించింది. కోర్టులన్నా, కోర్టు ఉత్తర్వులన్నా,సిబ్బందన్నా పోలీసులకు గౌరవం లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించి వాదనలు వినిపించేందుకు పిటిషనర్ తరపు న్యాయవాదికి సమయం ఇస్తూ విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. గుంటూరు జిల్లా బుడంపాడు సెయింట్ మేరీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న గర్నెపూడి శ్రావణసంధ్య (17) కళాశాల వసతి గృహం లోని 4వ అంతస్థు నుంచి పడిపోయారని వార్డెన్ నుండి తల్లిదండ్రులకు 2017 ఫిబ్రవరి 28న ఫోన్‌కాల్ అందింది. ఈ వ్యవహారంపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు దర్యాప్తు సక్రమంగా చేయడం లేదని సిబీఐ లేదా సిఐడికి కేసు ఇవ్వాలని మృతురాలి తల్లి జయలక్ష్మి 2017 జులైఉలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు...దర్యాప్తును సీబీఐకి ఇవ్వడానికి ఇది సముచితమైన కేసు అని అభిప్రాయపడింది. సోమవారం జరిగిన విచారణలో పోలీసుల తరపున హోం శాఖ జీపీ జయంతి వాదనలు వినిపిస్తూ కేసు దర్యాప్తు పూర్తి చేశామని తెలిపారు. అలా అయితే ఛార్జిషీట్ ఎందుకు వేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. హైకోర్టులో వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్న కారణంగా దాఖలు చేయలేదని జిపి బదులివ్వగా అభియోగపత్రం దాఖలు చేయకూడదంటూ కోర్టు నుంచి నిషేధ ఉత్తర్వులు ఏమీ లేవు కదా అని పోలీసులను న్యాయమూర్తి ప్రశ్నించారు.

## సిజెఐపై దాడిని ఖండించిన సిఎం, డి.సిఎం

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ పై కోర్టులో జరిగిన దాడిని సిఎం, డి.సిఎంలు ఖండించారు. చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై కోర్టులో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తునట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో చేసిన పోస్టులో ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని, నాగరిక, ప్రజాస్వామ్య సమాజంలో వాటికి స్థానం లేదని పేర్కొన్నారు. మన న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడం ప్రజాస్వామ్యంలో ప్రథమ కర్తవ్యమన్నారు.

**దాడికి యత్నించడాన్ని ఖండిస్తున్నాం: డి.సిఎం పవన్**

సుప్రీంకోర్టు సిజెఐపై కోర్టు లోపల దాడికి జరిగిన ప్రయత్నాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సనాతన జ్ఞానం వ్యవహార (చట్టానికి కట్టుబడి ఉండటం), రాజ్యాంగబద్ధమైన చట్టానికి లోబడి ఉండాలని కోరుతుందన్నారు.

**దాడి సిగ్గుచేటు : లోకేష్**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం సిగ్గుచేటని విద్యాశాఖ మంత్రి లోకేష్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను బెదిరించే ఇటువంటి ప్రయత్నాలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, వాటిని కఠినంగా ఎదుర్కోవాలని ఆయన పేర్కొన్నారు.

**అత్యున్నత న్యాయ సంస్థకు అవమానం: జగన్**

ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, అత్యున్నత న్యాయ సంస్థకు జరిగిన అవమానమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

**సనాతనం పేరుతో దాడి : ఆలిండియా లాయర్స్ యూనియన్ ఖండన**

సుప్రీం కోర్టు సిజెఐ గవాయ్ పై కోర్టులో దాడికి యత్నించడాన్ని న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావించాల్సి ఉంటుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర అధ్యక్ష, జనరల్ సెక్రటరీలు కె కుమార్, ఎన్ మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## మోహిత్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు.. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టుకొట్టివేసింది. మద్యం కుంభకోణంకేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తుడా ఛైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# ప్రజారోగ్యంపై స్పెషల్ ఫోకస్

## నేటినుంచి 45 రోజుల పాటు శిబిరాలు

**కుప్పం, అక్టోబరు 7 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న విషయం విదితమే. ఇప్పటికే కుప్పం ప్రజల సౌకర్యార్థం రాష్ట్రంలోనే తొలిసారిగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డిఎన్‌సి)ను ప్రారంభించారు. ఇప్పుడు మరో మారు కుప్పంలో సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు పేరిట మరో కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. బుధవారం నుంచి కుప్పం నియోజకవర్గంలో 45 రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.కుప్పం నియోజక వర్గ ంలోని తొమ్మిది పిహెచ్‌సి కేంద్రాలు, కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఈ శిబిరాలు నిర్వహిస్తారు. ప్రజలకు బిపి, చక్కెర వా్యధి, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, కాలేయం పరీక్షలు,సిబిసి పరీక్షలతో పాటు రక్తాన్నిసేకరించి 47 రకాల రక్త, ఇతర వైద్య పరీక్షలు చేయనున్నారు. తద్వారా ఎవరెవరికి ఏయే వ్యాధులు ఉన్నాయో గుర్తించి తదనంతరం వారికి అవసరమైన వైద్య చికిత్సలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలకు హాజరయ్యే ప్రజల ఆరోగ్య వివరాలన్నీ డిజిటలైజ్ చేయనున్నారు. వీటిని కేంద్ర ప్రభుత్వం యొక్క అభా కార్డుతో అనుసంధానం చేస్తారు. సుమారు తొంభై వేలమందికి వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. కాగా కుప్పం ప్రాంతంలోని ప్రజల సౌకర్యార్థం ఇదివరకే సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో బసవతారకం ఇండో - అమెరికన్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో గత నెలలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు సైతం ంచేపట్టిన విషయం విదితమే. ఏది ఏమైనా కుప్పం ప్రజల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డబుల్ సంక్షేమం

>> వేర్చాం. 'అడవితల్లి బాటలో' కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టాం. మారుమూల గిరిజన ప్రాంతాలను ప్రధాన రహదారులతో కనెక్ట్ చేస్తున్నాం. ఇమామ్‌లకు రూ.10,000, మోజన్లకు రూ.5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తున్నాం అని వివరించారు.భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నాం. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నాం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. కేంద్ర ప్రభుత్వం రూ.12,157 కోట్ల నిధులు విడుదల చేసి సకాలంలో పనులు జరిగేందుకు సహకరించింది. ప్రకాశం జిల్లాను కరువు నుంచి బయటపడేసే వెలుగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. వచ్చే ఏడాది జులై కల్లా సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టు పనులు చేస్తున్నాం. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి వృధా జలాలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని నిర్ణయించాం. సముద్రంలోకి వృధాగా పోయే నీటినే వినియోగిస్తాం. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర నీటి ప్రయోజనాలకు నష్టం వాటిల్లదు. ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. వరదలు వచ్చినప్పుడు ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేస్తే దిగువ రాష్ట్రంగా ఆ నష్టాలను, కష్టాలను భరిస్తున్నాం. దిగువ రాష్ట్రంగా అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకు? వరదను భరించాలి కానీ, వరద నీటితో ప్రయోజనం పొందకూడదంటే ఎలా కుదురుతుంది? గ్రామీణ ప్రాంతాల్లో 4,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 250 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించాం. 2028 నాటికి 'జల జీవన్ మిషన్' కింద ప్రతి పల్లెకు, ప్రతి గడపకు సురక్షిత మంచినీరు అందిస్తాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ అనేది మా విధానం. ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్, రియల్ టైమ్ మానిటరింగ్ విధానాలతో ప్రజారోగ్యానికి సంజీవనిగా వైద్యశాఖను తీర్చిదిద్దాం. మానవత్వంతో స్పందించి సీఎం సహాయ నిధి నుంచి ఇప్పటివరకూ రూ.552 కోట్లు అందించాం.

రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్లుగా నగరాలు, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేశాం. 100 గజాల్లోపు స్థలాల్లో ఎటువంటి బిల్డింగ్ ప్లాన్ లేకుండానే ఇంటిని నిర్మించుకునే అవకాశాన్ని కల్పించాం. ఎపి బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయం. పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించి తిరిగి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు 9 స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించాం.113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయి. దేవాలయాలు సంస్కృతికి చిహ్నాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు.. 6 వేలకు పైగా ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నాం. అర్చకుల వేతనాల్ని రూ.15 వేలకు పెంచాం. ఆలయాల్లో అన్యమతస్తులు లేకుండా చూస్తున్నాం. ఉచిత ఇసుకు విధానం అమలు చేసి.. భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ఇప్పటివరకు 1.5 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అందించాం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే మద్యం పాలసీని రూపొందించాం. నాణ్యమైన, బ్రాండెడ్ మద్యం విక్రయాలు జరిగేలా చూస్తున్నాం.నవ్యాంధ్రకు దిగ్గజ ఐటీ కంపెనీలైన గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ప్రజాపాలనలో సాంకేతికతను విస్తృతం చేశాం. వాట్సప్ గవర్నెన్స్-మన మిత్ర ద్వారా పరిపాలనలో కొత్తదనాన్ని తీసుకువచ్చాం. 700 పౌర సేవలు వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయన నారా వారి పల్లె గ్రామానికి తన తమ్ముని సంవత్సరీకాల్లో పాల్గొనేందుకు వెళ్లారు.

# 10 నుంచి రచ్చబండ

>> తదుపరి జరుగుతుంది అని వైఎస్ జగన్ తెలిపారు. వైఎస్సార్సీ హయాంలో విద్యార్థుల డ్రాపౌట్లు లేవు. కూటమి పాలనలో ప్రభుత్వ స్కూళ్లలో ఐదు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కుతున్నారు. ఎరువుల పంపిణీలో కూడా స్కాంలు జరుగుతున్నాయి. దళారీలతో చేతులు కలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పేదలను ఇంకా అన్యాయం చేస్తున్నారు. వారిని మరింత పేదరికంలోని నెడుతున్నారు అని జగన్ మండిపడ్డారు.

భవిష్యత్తులో కూడా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందనీయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ప్రతి జిల్లాల్లో గవర్నమెంటు కాలేజీ ఉండాలన్న సంకల్పంతో వైఎస్సార్సీ హయాంలో 17 మెడికల్ కాలేజీలు పెట్టాం. ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు ఎందుకు నడుపుతుంది? అలా చేయకపోతే ప్రైవేటు వాళ్లు ప్రజలను దోచుకుంటారు. ఇవి నడపకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయాన్ని ప్రజలకు బాగా అర్థమయ్యేలా చెప్పాలి అని జగన్ సూచించారు. అమరావతికి 50వేల ఎకరాలు సరిపోవని, మరో 50వేల ఎకరాలు సిఎం చంద్రబాబు సేకరిస్తున్నారు. మొదటి 50 వేల ఎకరాలకే మౌలిక సదుపాయాల కోసం రూ.1లక్ష కోట్లు ఖర్చు అవుతుందని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు కేవలం మౌలిక సదుపాయాలకే రూ. 2 లక్షల కోట్లు అవుతుందని చెప్తున్నారు. అలాంటి లక్షల మందికి, కోట్ల మందికి వైద్యం అందించి, చిరస్థాయిగా నిలబడే ఆస్తులైన మెడికల్ కాలేజీలను అప్పనంగా అమ్మేస్తున్నారు? ఐదేళ్లలో రూ.5వేల కోట్లు పెట్టలేరా? ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి, ప్రజల్లో చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది అని నేతలను ఉద్దేశించి జగన్ అన్నారు.

**వైయస్ జగన్‌ను కలిసిన కాకినాడ మత్స్యకారులు**

బోటు కొనుక్కోవడానికి కన్యాకుమారి వెళ్లి, బోటుతో సహా తిరిగి వస్తుండగా, తమ జలాల్లోకి ప్రవేశించారంటూ కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులను శ్రీలంక కోస్టుగార్డు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో బోటులో చేపలు కూడా లేనప్పటికీ, వారిని శ్రీలంక కోర్టులో ప్రవేశపెట్టడంతో జైలుకు పంపారు. విషయాన్ని ఇక్కడ తమ వారికి తెలియజేయడంతో, వైయస్సార్ నాయకుడు, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. ఇక్కడి అధికారులకు పూర్తి వివరాలు చెప్పి, శ్రీలంక అధికారులకు సమాచారం పంపించారు. దీంతో 54 రోజుల తర్వాత కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు శ్రీలంక జైలు నుంచి విడుదలయ్యారు.

శ్రీలంక జైలు నుంచి తమ విడుదలకు చొరవ చూపించిన ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసిన వారు, మంగళవారం వైయస్సార్సీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రులు కురసాల కన్న బాబు, దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో వైయస్ జగన్‌ను కలిసిన మత్స్యకారులు పంతాడ బ్రహ్మానందం, పి. శ్రీను.. తాము శ్రీలంక చెర నుంచి వైయస్సార్సీ చొరవ వల్లే బయటపడినట్లు చెప్పారు. వైయస్సార్సీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చక్రవర్తి, కృష్ణా జిల్లా మత్స్యకార సంఘం నాయకుడు కోలా హారికృష్ణ తదితరులు వైయస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## వారం - వర్జ్యం

08-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
విదియ రా.2.23
అశ్విని రా.10.44
వర్జ్యం : ఉ.7.16-8.41
దు.ఉ.11.32-12.20
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**వృషభం:** ఆరాధనలు, యాత్రలు సంభవము. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయము.

**మిథునం:** విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కర్కాటకం :** దూర ప్రాంతాల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**సింహం:** భూములు, స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు. సోదరుల కలయిక.

**కన్య :** కోర్టుకేసుల నుండి బయటపడుతారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**వృశ్చికం:** శత్రువులు సైతం, మిత్రులుగా మారతారు. ప్రయాణాలు.

**ధనుస్సు:** మాటలచాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు.

**మకరం:** వృత్తి, ఉద్యోగాలలో మీ బుద్ధికుశలత బాగా లాభిస్తుంది.

**కుంభం:** బంధు మిత్రుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మీనం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# స్వచ్ఛతకు పురస్కారాల పట్టం

## - ఎన్‌టిఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు

## - సిఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఎన్టీఆర్ జిల్లా విజేతలు..



సిఎం చంద్రబాబు చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు2025లో ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపులో ఉన్న ఎన్‌టీఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర పురస్కారాలను విజేతలకు అందజేశారు. మొత్తం 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్‌టీఆర్ జిల్లాకు లభించాయి. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ్ సర్వేక్షణ్)లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, స్వచ్ఛ అంగన్వాడీలు విభాగంలో కేదారేశ్వరపేట 3 అంగన్వాడీ కేంద్రం, స్వచ్ఛ బస్ స్టేషన్ల విభాగంలో విజయవాడ బస్ స్టేషన్, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణలంకలోని వీఎంఆర్ఆర్ (జి) మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ అవార్డులు సాధించగా ఆయా సంస్థలు, పాలనా యూనిట్ల ప్రతినిధులు గౌరవ ముఖ్యమంత్రి చేతులుమీదుగా అవార్డులతో పాటు అభినందనలు అందుకున్నారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ముందడుగు వేస్తూ స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్‌టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలిపినందుకు అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారాలు స్ఫూర్తిగా జిల్లాను మరింత స్వచ్ఛత దిశగా నడిపించాలని ఆయన పేర్కొన్నారు. పారిశుద్ధం, పరిశుభ్రతలో చేసిన విశేష కృషిని గుర్తించేందుకు, స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగస్వామ్య పక్షాలను కీలకపాత్ర పోషించేలా ప్రోత్సహించేందుకు, సంస్థలు, పాలనా యూనిట్ల మధ్య ఆరోగ్యకర పోటీని ప్రోత్సహించేందుకు, పారిశుద్ధం, పరిశుభ్రతలో అత్యుత్తమ విధానాలు, ఆవిష్కరణల ప్రదర్శనకు, స్వచ్ఛాంధ్రలో ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు దోహదం చేస్తాయన్నారు.

## ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణను ఎపిపిటిడి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సత్కారం



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ళ. నారాయణ పదవి బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను ఏపీ పిటిడి (ఆర్టీసీ) బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీ. శేషగిరిరావు ఆధ్వర్యంలో తెలిపారు. ఈ సంవత్సరంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలతో అన్ని వర్గాల మహిళలకు ప్రయోజనం చేకూర్చే ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకం శ్రీశక్తి పథకం చైర్మన్ కొనకల్ల నారాయణ ఆధ్వర్యంలో అమలు జరిగి విశేష ప్రజాదరణ పొందుతూ కోట్లాదిమంది మహిళలకు లబ్ధి చేకూరుతున్న సందర్భంగా వారికి అభినందనలు తెలియజేసారు. ఆయనను ఘనంగా సత్కరించారు.. కార్యక్రమంలో ఏపీపీటీడీ (ఆర్టీసీ) విజిలెన్స్ సెక్యూరిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుడి.అంకినీడు, పి.వెంకటేశ్వరరావులు శుభాకాంక్షలు తెలిపారు.

## 9న పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**విజయనగరం, అక్టోబర్ 7 (ప్రభాతవార్త ప్రతినిధి);** ఈ నెల 9వ తేదీన శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. గోవా గవర్నర్, మాన్సాస్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతులమీదుగా ఈ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా, అమ్మవారికి ప్రభుత్వం తరపున మంత్రి ఆనం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆయనకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచనాలు పలికి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ విజయనగరంలోని మూడు లాంతర్ల కూడలిలో వెలసిన ఈ అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగి ఉందని, ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పుగా, పూసపాటి రాజవంశీయుల ఇష్టదైవంగా అమ్మవారు ఆరాధింపబడుతున్నారు అంటే అమ్మవారి గొప్పతనం ఏంటో అర్థం అవుతుందని పేర్కొన్నారు. 1758లో ప్రారంభమైన సిరిమానోత్సవం, నేటికీ అదే ఉత్సాహంతో, అదే విశ్వాసంతో సాగుతోందని, ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ కోరికలు నెరవేరేలా ప్రార్థనలు చేస్తారని, ఈ ఉత్సవం కేవలం భక్తి పండుగ మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక వేడుకగా కూడా నిలిచింది అని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. ఈ ఏడాది అమ్మవారి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవం గా ప్రారంభం అయ్యాయని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి దేవాదాయ శాఖ మంత్రి హోదాలో పట్టు వస్త్రాలు సమర్పించడానికి తనను పంపిందని, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం రావడం అనేది తన పూర్వజన సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. మంత్రి వెంట జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసన సభ్యురాలు అదితి గజపతి రాజు, జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో ఘనంగా పైడితల్లి ఉత్సవం

### హాజరైన లక్షలాది మంది భక్తులు - వర్షం కురిసినా చెక్కు చెదరని భక్తజనం

### కోట బురుజు పైనుంచి సిరిమానును తిలకించిన గవర్నర్ అశోక్ గజపతి రాజు, మంత్రులు

**విజయనగరం,అక్టోబరు 7 ( ప్రభాతవార్త ప్రతినిధి) :** విజయనగరం ఇలవేల్పు,ఉత్తరాంధ్రా కల్పవల్లి శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా,కన్నుల పండువగా జరిగింది. విజయదశమి తర్వాత వచ్చే మంగళవారం సాంప్రదాయంగా ఏటా జరుగుతున్న సిరిమానోత్సవ సంబరం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భక్తుల కేరింతలు,కోలాహలం నడుమ ప్రశాంతంగా, ఉత్సాహంగా ముగిసింది.ఎప్పటిలాగానే పైడితల్లమ్మ ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానుకు చివరి ఏర్పాటుచేసిన ఆసనాన్ని అధిరోహించిన తర్వాత మంగళవారం సాయంత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పూజలు చేసిన తర్వాత సాయంత్రం 4.23 గంటలకు సిరిమాను యాత్ర ప్రారంభమయింది.సిరిమానుకు ముందు తెల్ల ఏనుగు, బెస్తవారివల, అంజలి రథం కిట కిట లాడిన బక్తులతో కదలగా వాటిని అనుసరించి సిరిమాను కదిలింది.ఆలయ పూజారి వెంకటరావు అధిరోహించిన తర్వాత సిరిమాను పైడితల్లిమ్మ దేవాలయం వద్ద ప్రారంభమై కోట ముఖ ద్వారం వద్దకు వెళ్లి తిరిగి వెనక్కు తిరిగింది. సాయంత్రం 5.40 గంటల సమయంలో మూడో సారి సిరిమాను ఊరేగింపు తర్వాత యాత్ర ముగిసింది. గట్టిపోలీస్ బందోబస్తు మధ్య ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవం విజయవంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ప్రతి ఏటా లాగానే ఈ ఏడాది కూడా సిరిమానోత్సవానికి వచ్చిన భక్తుల సంఖ్య అధికంగా కనిపించింది.



సిరిమానోత్సవం ప్రారంభానికి ముందు , మూడో సారి సిరిమాను తిరిగిన తర్వాత వర్షం కురిసినప్పటికి భక్తులు మాత్రం కదలకుండా సిరిమానును తిలకించడం గొప్ప విషయం. విధుల్లో ఉన్న పోలీసులు, మీడియా ప్రతినిధులు, ఇతర శాఖల ఉద్యోగులు తడిసి ముద్దయ్యారు. పైడితల్లమ్మ దేవస్థానం అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు తన కుటుంబీకులతో కలిసి కోట బురుజు పై నుంచి సిరిమానోత్సవాన్ని తిలకించారు. పూసపాటి వంశీయులు ఏటా కోట బురుజుపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి ఉత్సవాన్ని తిలకించడం ఆనవాయితీగా వస్తున్నది.

### వేడుకగా ఇంద్రకీలాద్రి

## గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 7, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో మంగళవారం నాడు ఉదయం పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ వైభవంగా జరిగింది. శ్రీ స్వామి అమ్మవార్లు ప్రత్యేక రథం పై ఆసీనులై భక్తులను అనుగ్రహించారు. ఇఓ వికె శీనా నాయక్ తో పాటు వేదపండితులు, అర్చకస్వాములు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం 5.55లకు శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ప్రారంభమై విద్యాధరపురం, కుమ్మరిపాలెం, నాలుగు స్థంబాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరీ, కెబిఎన్‌కాలేజ్, బ్రాహ్మణవీధి ల గుండా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు విరివిగా పాల్గొన్నారు. దుర్గమ్మవారికి భక్తులు దసరా ఉత్సవాల్లో హుండీల ద్వారా సమర్పించిన కానుకలను రెండవరోజు మంగళవారం లెక్కించగా రు.6,73,02,813 ల నగదు, 387 గ్రాముల బంగారం, 9కెజిల 450గ్రాముల వెండి, లభించాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

# 'తులాభారం' కానుకల స్కామ్ పురోగతి ఏదీ?

**- ఐదునెలలుగా ఉలుకూపలుకూలేని విచారణ !**


**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ కోరికలు తీరినవెంటనే చెల్లించుకునే తులాభారం కానుకలు స్కామ్ జరిగిందనే ఆరోపణలపై పురోగతి ఏమైందనేది పెద్దసంఖ్యలో శ్రీవారి భక్తుల్లో చర్చమొదలైంది. అసలు ఈ స్కామ్ దర్యాప్తు ఉలుకూపలుకూలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆపదమొక్కులవాడు... ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు చెల్లించే తులాభారం కానుకలు గత ఐదేళ్ళ వైసిపి పాలనలో పక్కదారిపట్టాయంటూ ఏకంగా తాజా బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి చేసిన ఆరోపణలు టిటిడిలో గతమేనెలలో సంచలనం కలిగించింది. దేశవిదేశాల్లో ఉన్న వెంకన్న భక్తులు తమ కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం త్రాసులో ఓ వైపు భక్తుడు, మరోవైపు నాణేలు, చక్కెర, బెల్లం, కలకండ,డ్రైఫ్రూట్స్,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు మొక్కుబడులుగా వేస్తారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు. ఇక్కడ రెండు, ఐదురూపాయలు నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కులు తీర్చుకోవడం పరిపాటి. ఈ చెల్లించిన నగదు గత ఐదేళ్లలో సగంవరకు వెంకన్న ఖజానాకు చేరలేదనేది బహిరంగమైన ఆరోపణలు. ఇలా రోజుకు ఐదులక్షల నుండి 10లక్షల రూపాయల వరకు తులాభారంకానుకలు అందుతాయనేది టిటిడి సమాచారం. ఈ మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. అయితే గత ఐదేళ్లలో సగం ఆదాయం టిటిడికి జమకాలేదనేది ఇప్పటికే సంచలనంగా మారినా దానిపై విచారణ ఎంతవరకు వచ్చిందనేది భక్తుల్లోనూ ఆసక్తికరమైన అంశంగా మారింది. టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి తులాభారం కానుకలు స్వాహా చేశారంటూ ఆధారాలతో సహా ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంకు గత మేనెలలోనే ఫిర్యాదు చేయడం హాట్‌టాఫిక్ అయ్యింది. శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా సమర్పించుకునే కానుకల్లో నిలువుదోపిడీ మొక్కులు, తలనీలాలు, కాలినడక,తులాభారం అంటే ఎంతో ప్రియం. భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడానికి రోజువారీగా లక్షమంది వరకు తిరుమలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగానేగాక విదేశాల్లో ఉన్న భక్తులు ,ప్రముఖులు కూడా తమకు ఏదేనికష్టం వస్తే ముడుపుకట్టి తిరుమలేశునికి మొక్కుకుంటారు. కష్టాల నుండి బయటపడగానే కొండకు చేరుకుని మొక్కుతీర్చుకుంటున్నారు. ఇలా రోజువారీగా హుండీకి సుమారుగా 4కోట్ల రూపాయలు కానుకలు చేకూరుతుంటాయి. ఇక తులాభారం మొక్కుల్లో 10లక్షల వరకు ఆదాయం వస్తుందని టిటిడి వర్గాలు చెబుతున్న లెక్కలు. ఆలయంలోపల మహాద్వారం దాటగానే ధ్వజస్తంభానికి పక్కన తులాభారం ఉంటుంది. కోరికలు నెరవేరిన భక్తులు పిల్లలకేగాకుండా పెద్దలకు కూడా తులాభారం వేస్తారు. గత ఐదేళ్లలో తులాభారం కానుకలు సగానికిపైగా గత టిటిడి పాలకమండలి పెద్దల జేబుల్లోకి వెళ్ళిందని భానుప్రకాశ్‌రెడ్డి ప్రధాన ఆరోపణ. వందమంది వరకు భక్తులు ప్రతిరోజూ తులాభారం మొక్కులు తీర్చుకోవచ్చని అంచనా. గతంలో తులాభారం వద్ద బ్యాంకు కాంట్రాక్టు సిబ్బంది విధులు నిర్వహించేవారన్నారు.

## ఆపన్న హృదయం పథకానికి విరాళాల సేకరణ

**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం విద్య,వైద్య రంగాల్లోనూ అందిస్తున్న సేవలకు ధీటుగా తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో నిరుపేద పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. ఇందుకోసం అయ్యే ఖర్చును టిటిడి దాతల నుండి సేకరించే దిశగా ఆలోచన చేసింది.గుండె శస్త్రచికిత్సల కోసం దేశవ్యాప్తం నుండి కూడా తిరుపతిలోని టిటిడి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయలకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే దాదాపు 2వేలకుపైగా ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చేసింది. ఇప్పటికే పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అమలవుతున్న శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం పథకం క్రింద ఒకలక్ష రూపాయలు(1లక్ష)దాత విరాళం అందిస్తే , నిరాదరణకు గురైన నిరుపేద వర్గాలకు చెందిన ఒక పిల్లవాడికి ఉచితంగా అవసరమైన ఆపరేషన్ చేసే సదుపాయం ఉంది. నూతనంగా చిన్నపిల్లల వైద్యసేవల కోసం ప్రత్యేక ట్రస్టు ఏర్పాటుకు సంబంధించి కూడా టిటిడి ఆలోచన చేస్తోంది. చిన్నపిల్లలను దైవసమానులుగా భావించి, ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే చిన్నారులకు చక్కటి వైద్యసేవలు మెరుగు పరిచేందుకు ఈ పథకం దోహదపడుతుంది. చిన్నపిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో బాటు చిన్నపిల్లల గుండె సర్జరీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్యపరికరాలు, మౌళిక సదుపాయాలు, అత్యవసర మందులు ఏర్పాట్లుకు దాతలు విరాళాలందించేలా టిటిడి ప్రోత్సాహిస్తోంది. దక్షిణభారతదేశంలోనే చిన్నపిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చికిత్సలందించేందుకు గతంలోని వైసిపి ప్రభుత్వం తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంను నెలకొల్పింది.

## విజయవాడలో పాలస్తీనాకు మద్దతుగా సాంస్కృతిక కార్యక్రమాలు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో పాలస్తీనాకు మద్దతుగా సాంస్కృతిక సాయంత్రం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాలస్తీనా ప్రజల విమోచనా పోరాటానికి మద్దతుగా, గాజాపై గత రెండేళ్లుగా ఇజ్రాయెల్ చేస్తున్న జినోసైడ్ కు నిరసనగా పాటలు, కవితలు, నినాదాలతో విజయవాడ లెనిన్ సెంటంలో స్వరాలు దిక్కులు పిక్కటిల్లేలా ధ్వనించాయి. ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా దేశవ్యాప్తంగా చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా విజయవాడలో ఈ సాంస్కృతిక సాయంత్రం కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో కార్యకర్తలు, విద్యార్థులు, యువత, ప్రొఫెషనల్స్ హాజరై పాటలు, కవితలు, నినాదాలు, పోస్టర్లు, సందేశాలు, ప్రసంగాల ద్వారా పాలస్తీనాకు సంఘీభావం తెలియజేశారు.ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా కార్యకర్త అమూల్య మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఇజ్రాయిల్ గాజాపై చేస్తున్న మారణకాండలో 60 వేల మందికి పైగా ప్రజలు మరణించారని, అందులో 20 వేల మంది చిన్నారులేనని అన్నారు. ఈరోజు మనమంతా మనుష లుగా ఉండడం అంటే ప్రాణాలు కోల్పోతున్న గాజా పిల్లలు పక్షాన నిలబడడమేనన్నారు. ఈ అమానవీయ హత్యాకాండకు సాయ పడుతూ, ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల లాభపడుతున్న కంపెనీలను బాయ్‌కాట్ చేయాలనే పిలుపునిస్తూ ప్రపంచవ్యాప్తంగా బిడిఎస్ ఉద్యమం జరుగుతుందనీ, ఇందులో అందరూ భాగం అవ్వాలని పిలుపునిచ్చారు. ఆర్. రఘు మాట్లాడుతూపిల్లలను, స్త్రీలను చంపడంభావితరం లేకుండా చేస్తున్నారన్నారు.



# తిరుమల సమాచారం

## 20న దీపావళి ఆస్థానం - ఆర్జితసేవలు రద్దు



**తిరుమల, అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం ఈనెల 20వతేదీ సోమవారం నిర్వహిస్తున్నారు. దీపావళిపండుగ సందర్భంగా ఈ వైదిక కార్యక్రమం చేపడతారు. దీపావళిరోజు 20వతేదీ సోమవారం ఉదయం బంగారువాకిలిలో ఘంటా మండపంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆస్థానంలో భాగంగా మలయప్పస్వామి శ్రీదేవిభూదేవులతో కలసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపుచేస్తారు. సేనాధిపతి విశ్వక్సేనులు స్వామివారి ఎడమపక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపుచేస్తారు. ఆ తరువాత స్వామికి ప్రత్యేక పూజ,హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది.

సాయంత్రం ఉత్సవర్లు సహస్ర దీపాలంకారసేవలో పాల్గొని ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. కాగా సోమవారం దీపావళి ఆస్థానం సందర్భంగా ఆలయంలో జరిగే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలు రద్దయ్యాయి. సుప్రభాతం, అర్చన,తోమాల సేవలు ఏకాంతంగా జరుగుతాయి.

## నిండు పున్నమిన గరుడునిపై గోవిందుడు



**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఆశ్వయుజ మాసం పౌర్ణమివేళ మంగళవారం సాయంత్రం మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్న మలయప్ప అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు విశేషఅలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవలో టిటిడి ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా పదిరోజుల వ్యవధిలో మళ్ళీ మంగళవారం 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడసేవ భక్తులకు మోక్షం కలిగిస్తుంది.

## శాస్త్రోక్తంగా దత్తమందిరంలో చండీహోమం



**తిరుపతి,అక్టోబర్ 7ప్రభాత వార్తప్రతినిధి:** ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు మొగిలి చెర్ల దత్తాత్రేయమందిరంలో శాస్త్రోక్తంగా ఛండీహోమం జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు గణపతి హోమం, పుణ్యాహావచనం చేసిన తరువాత వేదమంత్రోచ్ఛరణల నడుమ గృహస్థ భక్తులతో హోమాన్ని జరిపించారు. భక్తులే స్వయంగా పాల్గొని ఛండీహోమం చేయడంతో భక్తితో ముక్తిని పొందారు. హోమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ ,ఇడి విష్ణుకౌశిక్‌లు ప్రసాదం అందించారు. అనంతరం దత్తాత్రేయస్వామి దర్శనం భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాద వితరణ జరిగింది.

## తిరుమలలో భారీ వర్షం



**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్ప పీడనం ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం ఉన్నఫళంగా రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీటితో నిండిపోయాయి. ఆలయం మాఢవీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాంభగీచా అతిధిగృహాలు, హెచ్‌టి కాంప్లెక్స్, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్,ఎస్ఎన్‌సి ప్రాంతాల్లో వాననీరు చేరింది. భారీ వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంటనుండి మూడుగంటల వరకు జోరువాన కురిసింది. ఆలయంలోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ స్వామివారి దర్శనానికి చేరుకోవాల్సి వచ్చింది. ఆలయం నుండి వెలుపలకు వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. గదులకు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్‌లో,తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో వాననీరు జోరుగా ప్రవహించింది. వాతావరణం పూర్తిగా మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి.

## స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో మెప్మాకు అరుదైన గౌరవం



సిఎం చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న మెప్మా అధికారులు,ఇతరులు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక అభివృద్ధిలో తమదైన ముద్ర వేస్తూ, పట్టణ పేదల సాధికారత కోసం కృషి చేస్తున్న మెప్మా సంస్థ, ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. ఒకే వేదికపై ఏకంగా నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకుని, ఆ సంస్థ నిబద్ధత, ఆధునికత కోసం చేసే కృషిని మరోసారి చాటి చెప్పింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.బెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌లో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలను, పేదలకు అందుబాటులో ఉన్న అవకాశాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మెప్మా ప్రదర్శించిన చురుకుదనం ప్రశంసలు అందుకుంది. మెప్మాకుబెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌అవార్డు లభించడం, డిజిటల్ యుగంలో ప్రభుత్వ సంస్థలు ప్రజలతో ఎలా అనుసంధానం కావాలనేదానికి ఒక ఆదర్శంగా నిలిచింది. మెప్మా మిషన్ డైరెక్టర్, ఎన్. తేజ్ భరత్, ముఖ్యమంత్రి నుండి ఈ అత్యుత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విజయం, క్షేత్రస్థాయి సిబ్బంది, సామాజిక కార్యకర్తల అంకితభావానికి, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకున్నందుకు నిదర్శనం. పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం, జీవనోపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా సంఘాల (స్లమ్ లెవెల్ ఫెడరేషన్ ఎస్ఎల్ఎఫ్) ప్రకాశం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల సమర్థ నిర్వహణకు గాను మరో మూడు ముఖ్యమైన అవార్డులను

## రాష్ట్ర ప్రభుత్వంతో అంతరిక్ష రంగ ఒప్పందానికి రష్యా సుముఖత

### - సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సిఇఓ వెంకటేశ్వర్లు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి :** ఏపీ ప్రభుత్వంతో సైన్స్,విద్య,అంతరిక్ష రంగాల్లో ఒప్పందం చేసుకునేందుకు రష్యన్ సైన్స్ అండ్ కల్చర్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారన్నారు.

EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD
OPERATION CIRCLE : VIZIANAGARAM
e-Tender Notice No. 08/2025-2026 of SE/O/VZM
e-tenders are invited from Registered Class-I Contractors of APEPDCL for "Carrying out continuous monthly spot billing work on work contract basis in the 2 Nos Operation Sub Divisions in Operation Circle, Vizianagaram from 01.11.2025 to 30.09.2027" vide Tender Specification No: 22 & 23/2025-26. For downloading detailed Tender Notice explore website www.apeprocurement.gov.in or contact Phone No. 9490610848. Last date & time for receipt of bids: 23.10.2025 upto 11:00 Hrs
Advt-100
Sd/- SUPERINTENDING ENGINEER

వార్త

శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడమంత మాధుర్యం మరొకటి లేదు.

-గోథే

# మానవత్వంలోనూ అత్యున్నతమే!

అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి గౌరవ ప్రతిష్టలను కాపాడడం ఈ దేశ సంస్కారం. భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలు కూడా అదే చెబుతున్నాయి. దేశ స్థాయిలోనే వారు అలంకరించిన స్థానం అత్యున్నతమైనది. అలాంటి భారత దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మీద ఓ సీనియర్ న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేసాడు. కోర్టులో తమకనుకూలమైన తీర్పులు రానివారు ఆ న్యాయమూర్తుల పట్ల కసితో రగిలిపోయిన సందర్భాలు చూశాం. కొన్ని ఉదంతాలు కూడా మనకు తెలుసు. కానీ ఏకంగా అత్యున్నత ధర్మాసనం అధిష్ఠించిన ప్రధాన న్యాయమూర్తిపై ఈ రకమైన దాడి ఇదే తొలిసారి. సభ్యసమాజం హర్షించలేనిది. 'ఈ దాడి భారతీయులందరినీ ఆగ్రహానికి గురి చేసింది. ఇలాంటి చర్యలకు మన సమాజంలో చోటు లేదు' ఈ మాటన్నది ఎవరో కాదు, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌ని ఫోన్‌లో పరామర్శించిన అనంతరం ప్రధాని నరేంద్రమోడీ అన్న మాటలివి. ఘటన జరిగిన సమయంలోనూ, అదే సందర్భంలోనూ ఆ తర్వాత ప్రశాంతతను కాపాడుతూ సిజెఐ స్పందించిన తీరును ప్రధాని అభినందించారు. ఉన్నత ధర్మాసనాన్ని ఎంతో హుందాగా నిర్వహించడంలో గవాయ్ ఎన్నోసార్లు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు. అనేక సంచలనాత్మక నిర్ణయాలను తమ తీర్పుల్లో ప్రవచించేవారు. అంతేకాదు కాల మాన పరిస్థితులకు అనుగుణంగా నేటి తీర్పులుండాలని పదేపదే తమ న్యాయమూర్తులకు బోధించేవారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల విచారణ కోసం ఎదురు చూసేవారు కాలాతీతమవుతోందని భావించే ఆందోళనే తప్ప సుప్రీం తీర్పులను విమర్శించేవారు బహు తక్కువ. న్యాయచట్టాల పరిధిలో తీర్పులు, అప్పీళ్లు, పునశ్చరణ, పునః ప్రస్తావన వంటి ఎన్నో ప్రక్రియలు న్యాయస్థానం గౌరవాన్ని పెంచేటట్లుగానే ఉంటాయి. తుది తీర్పుల్లో న్యాయం అందే తీరుతుందని భారతీయులంతా మెచ్చుకుంటూ న్యాయస్థానాలను, న్యాయాధిపతులను గౌరవిస్తూనే ఉన్నారు. కానీ విచిత్రంగా సోమవారం సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరుగబోయిన అఘాయిత్యాన్ని జాతి యావత్తూ ఖండిస్తోంది. ఈ దాష్టీకానికి ప్రయత్నించింది పరాయి దేశస్థుడో, జాతికుల మత ద్వేషాలున్నవారో కాదు. అతనూ భారతీయుల్లో ఒకరే. ఆయనెలా విమర్శించినా, ఎన్ని ఎత్తుగడలు గుప్పించినా అతని మీద ఎలాంటి కేసు నమోదు చేయవద్దని సిజెఐ ఆదేశించడం ఆయనలోని వ్యక్తిత్వమే చెబుతోంది. ఉన్నత ధర్మాసనాధిపతిగా తీసుకునే ప్రతి చర్యా ఆ స్థానంగౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసేవిగానే ఉంటాయి. సాధారణంగా తమ ముందుకొచ్చిన కేసుల్లోని వాస్తవాలను, లోతుపాతుల్ని వెలికితీసేందుకు న్యాయమూర్తులు బెంచి మీద నుంచి ప్రశ్నలు వేయడం ద్వారా కక్షిదారుల తరపు న్యాయవాదుల వాదనలు, వాటిలోని పసను రాబట్టుకునే ప్రయత్నం చేస్తుండడం సహజం న్యాయ ప్రక్రియలో అదీ ఒక భాగమే. అంతేకాదు కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యలు చేస్తుంటారు. అది సానుకూల వ్యాఖ్యలు కావొచ్చు. కాకపోవచ్చు.అవన్నీ న్యాయాన్వేషణలో భాగంగానే చూడాలి. 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించబోనంటూ' కోర్టు హాల్‌లోని సీనియర్ న్యాయవాది రాకేష్ సురేష్ ఒక్కసారిగా ప్రధాన న్యాయమూర్తి వైపు లంఘించబోగా వేదిక వద్దకు చేరకుండానే భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకొని వారించారు. ఆ సమయంలో కోర్టు నెం.1 బెంచి మీద జస్టిస్ గవాయ్, జస్టిస్ కె. వినోద చంద్రన్‌లు కేసులు నిర్వహిస్తున్నారు.సిజెఐ గవాయ్ మాత్రం ఇలాంటివ్యాఖ్యలు తనను ప్రభావితం చేయబోవని వ్యాఖ్యానించారు. ఇటీవల ఖజురాహోలో విష్ణుమూర్తి విగ్రహ పునఃస్థాపన విషయంలో కోర్టులో సిజెఐ వ్యాఖ్యలకు నిరసనగానే ఇలాంటి ప్రయత్నం జరిగినట్లు తెలిసింది. కేసును కొట్టేసి 'ఆ దేవుడినే ఏదైనా చేయమని అడగండి' అన్న వ్యాఖ్యలపై కొందరికి అసంతృప్తి కలిగిన మాట నిజమే. అది తీర్పులో భాగం కాదు. వ్యాఖ్యానప్రస్తావన మాత్రమే. ఈ అంశాలేవీ తీర్పును ప్రభావితం చేయవు. న్యాయప్రక్రియలో దీనికి పెద్ద దోషమేమీ అంటదు. నిజానికది పురావస్తు శాఖ స్థలం కనుక వారే అనుమతినివ్వాలని తాను చేయగలిగేదేమీ లేదని అన్నారు. ఆ తర్వాత ఒక సందర్భంలో సిజెఐ తాను అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు కూడా. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిందితుడు రాకేశ్ మీద ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించగానే పోలీసులు ఆయనను ప్రశ్నించి వదిలేశారు. ఇప్పుడాయన టీవీ ఛానల్స్‌కు తన చర్యలను సమర్థించుకుంటూ వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. 'ఆ బూటు విసిరించి నేను కాదు, దేవుడేనని' రాకేష్ చేస్తున్న వ్యాఖ్యలు హర్షించదగినవి కావు. సిజెఐ వ్యాఖ్యల నాటి నుంచి తనకు నిద్రపట్టడం లేదని, తనను 'గమ్మునుంటావెందుకని ఆ దేవుడు తట్టి లేపాడ'ని ఇలా అర్థం లేని వాగుడుతో 'ఏదో దైవికశక్తి నాతో ఆ పనిచేయించిందం' టూ తన తప్పు కప్పిపుచ్చుకోవాలని సంజాయిషీ చెప్పు న్నాడు. జైలుకైనా సిద్ధమట. బార్‌కౌన్సిల్ ఈ ఉదం తంపై స్పందిస్తూ రాకేశ్ దేశంలోని ఏ కోర్టులోనూ వాదిం చకుండా అతడి సభ్యత్వాన్ని తాత్కాలికంగా రద్దు చేసింది. ఈ ఘటన అన్ని రాజకీయ పక్షాల అగ్రనేతలూ ఖండించారు.ప్రధాన న్యాయమూర్తి తనపై దాడియత్నం మీద మానవత్వంతో స్పందించారన్న ప్రశంసలు అందుకున్నారు. తుచ్ఛమైన ప్రచారం కోసం ఓ వ్యక్తి ఇలాంటి చర్యకు పాల్పడ్డారని కొట్టిపారేశారు. ఈ సంఘటన దురదృష్టకరం. భారతీయ సమాజం ఖండిస్తున్న సంఘటన.



ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

సెయింట్ థెరిస్సా



దేశసేవ అంటే ఉపన్యాసాలు దంచడం కాదు. ఎవరి విధిని వారు సక్రమంగా నిర్వర్తించడమే.

మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### నిరంతర పర్యవేక్షణ అవసరం

ప్రభుత్వ బాలికల గురుకులంలో ఒకేసారి 120 మంది బాలికలు అనారోగ్యంపాలవడం ఆందోళనకరం. అందులో 80 మందికి పైగా స్థానిక,జిల్లా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా,30 మందిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. వీరంతా పచ్చ కామెర్లు బారిన పడ్డారు.ప్రాథమికంగా అది హెపటైటిస్ ఏ వైరస్ కారణంగా వచ్చిందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఆ వైరస్ కలుషిత మంచినీరు లేదా ఆహారం తీసుకోవడం వల్ల వస్తుంది. ఆ పాఠశాలలో రక్షిత మంచి నీరు ప్లాంట్ పనిచెయ్యడం లేదని,ఈ ఉదంతం బయట పడ్డాక కొత్త ప్లాంట్‌ని అధికార యంత్రాంగం సమకూర్చిందని వార్త. అదృష్టవశాత్తూ అస్వస్థతకు గురైన పిల్లలు వైద్యుల పర్యవేక్షణలో కోలుకొంటున్నారు. శుభ్రమైన వాతావరణం, రక్షిత మంచినీరు, పౌష్టికాహారం,దోమలు,కీటకాల నుండి రక్షణఅన్నవి అన్నిహాస్టళ్లకు ప్రాథమిక అవసరాలు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### అమెరికాపై ఆధారపడడం తగ్గించాలి

భారతఐటీరంగం ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బి వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం,రిమోట్ డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికసిత భారత్ సాధ్యమా?

పన్నెండవ పంచ వర్షప్రణాళికలో పేర్కొన్నట్టు వేగవంతం అయిన సమ్మిళిత ఆర్థిక వృద్ధేభారత్ లాంటి దేశాలకు శ్రీ రామ రక్షఎందుకని భారత్ ఇప్పటికి వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థతో,గ్రామీణ ఆర్థికవ్యవస్థతో ముడిపడి ఉంది. కాబట్టి గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలి. భారత్ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేపుతున్నట్టు వికసిత భారతం వైపు అడుగులు వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### కల్తీ నూనె విక్రయాల జోరు

వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కల్తీ నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు కల్తీనూనె విక్రయిస్తున్నారు. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి వెళ్తున్నారే తప్ప కల్తీ నూనె విక్రయాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, వివిధ ప్రాంతాల నుంచి డ్రమ్ములు, క్యాన్లలో నూనెను వివిధప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అలాగే లూజు నూనె పేరుతో విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు నకిలీ నూనెను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ ఇనస్పెక్టర్ అధికారు లు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కల్తీనూనె విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

- కామిడి సతీశ్ రెడ్డి,భూపాలపల్లి జిల్లా

### న్యాయస్థాన గౌరవానికి దెబ్బ

దేశ రాజధానిలోని సుప్రీంకోర్టులో జరిగిన ఘటన దేశాన్ని కలవరపరిచింది. ఢిల్లీకి చెందిన న్యాయవాది రాకేష్ కిశోర్ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారిపై కోర్టు మధ్యలో చెప్పు విసిరిన ఘటన తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. సనాతన ధర్మానికి అవమానం సహించను" అని నినదిస్తూ ఈ ఘటన జరగడంతో కోర్టు వాతావరణం క్షణాల్లో ఉద్రిక్తమైంది. వెంటనే భద్రతా సిబ్బంది ఆ న్యాయవాదిని అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఖండిస్తూ, ఆయన న్యాయవృత్తి అనుమతిని తాత్కాలికంగా రద్దు చేసింది. న్యాయ వ్యవస్థ పట్ల అసంతృప్తి లేదా విభిన్నాభిప్రాయాలు ఉన్నా, వాటిని చట్టపరమైన మార్గాల్లోనే వ్యక్తపరచాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్రతిభను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివి పైకిరావాలని ఆశించడం సహజమైనప్పటికీ వారికి ఏరంగంలో ఆసక్తిగలదో తెలుసుకోవాల్సి న అవసరంఉంది.అందుకు ఉపాధ్యాయులు విలువ గల విద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. చిన్న చిన్న తప్పులను క్షమించి మరోసారి పునరావృతం కాకూడదని గట్టిగా హెచ్చరించాలి. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'చేనేత'కు అక్కరకు రాని జిఎస్‌టి

***నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధార పడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమరుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి.***



డాక్టర్ రామకృష్ణ బండారు

మన దేశంలో చేనేత పరిశ్రమ అత్యంత పురాతనమైన వృత్తి. దీనిని దేశ వారసత్వ సంపదగా కూడా గుర్తిస్తారు. వ్యవసాయ రంగం తరు వాత దేశంలో ఎక్కువమంది గ్రామీణ ప్రజలు ఆధారపడ్డ రంగం చేనేత రంగం. ముఖ్యంగా, ఎక్కువ మంది మహిళలు ఆధారపడ్డ రంగం ఇది. గ్రామీణ మహిళా సాధికారతకు అండ గా నిలిచేది చేనేత రంగం మాత్రమే చేనేత పరిశ్రమ మీద ఆధారపడి దేశం లో కొన్ని లక్షల మంది జీవనం సాగిస్తున్నారు. 2019-20 జాతీయ హ్యాండ్లూమ్ సెన్సస్ ప్రకారం సుమారు 26,73, 891 మంది నేతకార్మికులు మన దేశంలో ఉన్నారు. వారిలో 88.7 శాతం గ్రామీణ ప్రాంతాలవారు కాగా 11.3 శాతం పట్టణ ప్రాంతానికి చెందినవారు. మొత్తం చేనేత కార్మికుల లో 71.6 శాతం మహిళలు, 28.4 శాతం పురుషులు.సుమారు 2,10,751 మంది పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలలో కూడా చేనేత కార్మికుల సంఖ్య ఎక్కువే. తెలంగాణలో సుమారు 27,916 కుటుం బాలు చేనేత పరిశ్రమ మీద ఆధారపడి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 19,417 కుటుంబాలు, పట్టణ ప్రాంతాలలో 8,499 కుటుంబాలు చేనేత వృత్తినే నమ్ముకున్నాయి. అలాగే,ఆంధ్రప్రదేశ్‌లో 1,22,644 కుటుంబాలు ఉండగా,గ్రామీణ ప్రాంతాలలో 77,065,పట్టణ ప్రాంతాలలో 45,579 చేనేత కుటుంబాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. పోచంపల్లి, గద్వాల్, ఉప్పాడ, వేంకటగిరి మంగళగిరి ధర్మవరం వంటి ప్రాంతాలు చేనేత వస్త్రాల తయారీకి పెట్టింది పేరు. అలాగే ఈ ప్రాంతాలలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ సైతం కలిగివున్నాయి. దేశ వ్యాప్తంగా చేనేత వస్త్రాలు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. కానీ ఇటీవల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులలో భాగంగా చేనేత,టెక్స్టైల్ రంగంపై ఏకంగా 18 శాతం జిఎస్‌టిని విధించడంతో ఆయా రంగాల పై పెనుభారం పడనుంది. ఇప్పటికే 5శాతం జిఎస్‌టి వలన చేనేత పరిశ్రమ భారీగా నష్టపోతోంది. జిఎస్‌టి 20 లో చేనేత దుస్తులను 18 శాతం స్లాబ్‌లో చేర్చడంపై పరిశ్రమ వర్గాలే కాకుండా ఇటు వినియోగదారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 1000 రూపాయల కంటే తక్కువ ధర ఉన్న చేనేత వస్త్రాలపై 12 శాతం జిఎస్‌టిని విధిస్తున్నారు. నూతన జిఎస్‌టి మార్పులలో భాగంగా, 2500 రూపాయల కంటే తక్కువ ధర ఉండే వస్త్రాలపై 5 శాతం,2500 రూపాయల కంటే ఎక్కువ ధర ఉండే చేనేత, ఇతర వస్త్రాలపైఉన్న 12 శాతం జిఎస్‌టిని 18 శాతంకు పెంచారు. ఈ నెల 22నుండి నూతన రేట్స్ అమలులోకి వచ్చాయి. వాస్తవానికి, జిఎస్‌టి మార్పులలో భాగంగా చేనేత వస్త్రాలపై పన్నును ఎత్తివేస్తారు అనిభావించిన పరిశ్రమ వర్గాలకు జిఎస్‌టిని 12 శాతం నుండి 18 శాతంకు పెంచడం ఆశ్చర్యానికి గురి చేసింది. జిఎస్‌టి పెంపుతో దేశవ్యాప్తంగా చేనేత వస్త్రాల ధరలుపెరుగుతాయి. ఫలితంగా డిమాండ్ తగ్గి చేనేత పరిశ్రమకు నష్టాలు వాటిల్లే అవకాశం ఉన్నది. మొదటి నుండి చేనేత రంగానికి జీఎస్టీ



భారంగా మారింది. 5శాతం పన్నుతో ఈ రంగం మనుగడ కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. దేశంలో కొన్ని రాష్ట్రాలు ముడి సరుకుపై సబ్సిడీని, చేనేత వస్త్రాలపై జిఎస్‌టి పన్ను భారాన్ని భరించడానికి ముందుకు వచ్చినప్పటికీ దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు, సంఘాలు, పరిశ్రమ పన్నుల భారంతో నష్టాలు ఎదుర్కుంటున్నారు. చేనేత కార్మికులు చేతితో తయారు చేసే వస్త్రాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబాలు. చేనేత వస్త్రాలను తయారు చేయడం అంత సులభమైన ప్రక్రియకాదు. ఒక్కో చీరను తయారు చేయడానికి సుమారు 4 నుండి 5 గంటల సమయం పడుతుంది. సహజ సిద్ధమైన దారాలు, రంగులు వంటి ఇతర ముడిసరుకులను ఉపయోగించి భారతీయత కనిపించేలా చేనేత వస్త్రాన్ని తయారు చేస్తారు. అయితే గత కొన్నేళ్లుగా, మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా వస్త్రాలధరలు పెంచడం ద్వారా 5 శాతం స్లాబ్ నుండి 12 శాతం స్లాబ్‌లోకి రావడంతో పన్నుభారం పెరిగి, ధరలు పెరిగి వస్త్రాలకు మార్కెట్‌లో డిమాండ్ లేకుండా పోతుంది.ఫలితంగా ఆదాయం లేక ఇప్పటికే చాలా కుటుంబాలు చేనేత వృత్తిని వదిలి ఇతర వృత్తులను ఎంచుకుంటున్నారు. ఇక ప్రస్తుత 12శాతం నుండి 18 శాతానికి జిఎస్‌టి పెంచడంతో రానున్న రోజుల్లో చేనేత పరిశ్రమ మరింత నష్టాలను ఎదుర్కోక తప్పదు. ఇప్పటికే, చేనేత వృత్తి లాభదాయకం కాకపోవడంతో యువత ఈ రంగాన్ని ఎంచుకోవడంలేదు. భవిష్యత్‌లో పన్నులు పెరగడంతో చేనేత వస్తువులకు ధరలు పెరిగి,మార్కెట్‌లో డిమాండ్ పడిపోయి మరింత నష్టాలు రావడం. తద్వారా చేనేత పరిశ్రమ కనుమరుగయ్యే అవకాశాలు లేకపోలేదు. కార్మికుడి శ్రమతో యంత్రాలు ఉపయోగించకుండా, చేతులతో తయారు చేసే చేనేత ఎంతో మన్నికైనవి. సహజ సిద్ధమైన ముడి సరుకుల ధర కూడా అధికం. ఎంతో కష్టంతో కూడుకుని ఉన్న చేనేత వస్త్రాలు 2500రూపాయల కంటే తక్కువ ధరతో మార్కెట్‌లో అమ్మడం సాధ్యమేనా? దేశంలో పేరొందిన పోచంపల్లి, కంచి, బెనారస్, ధర్మవరం, గద్వాల్ వంటి ఇతర చేనేత వస్త్రాలు కేవలం 2500 రూపాయలకు మార్కెట్‌లో దొరుకుతాయా? కొత్త జిఎస్‌టి ప్రకారం 2500 పైన ధర ఉండే వస్త్రాలపై 18 శాతం పన్ను విధింపపడతాయి. అంటే, భవిష్యత్‌లో ముడిసరుకు,ఇతర కారణాలతో చేనేత వస్త్రాల ధరలు పెరగక తప్పదు. ఫలితంగా, 5 శాతం పన్ను నుండి 18 శాతం పన్ను స్లాబ్‌లోకి రావడంతో ధరలు పెరిగి ఆ భారం వినియోగదారుని మీద పడుతుంది. అప్పుడు చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో కొనుగోలు తగ్గి వాటి మీద ఆధార పడ్డ చేనేత కార్మికులకు నష్టాలు వస్తాయి. గమనించదగ్గ విషయం ఏమిటంటే,చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని 18 శాతానికి పెంచిన కేంద్రం, ఎటువంటి శ్రమ లేకుండా కృత్రిమ దారాలతో, యంత్రాల సహాయంతో తయారు చేసే పాలిస్టర్ వంటి వస్త్రాలపై జిఎస్‌టిని 12 శాతం నుండి 5 శాతంకు తగ్గించింది. యంత్రాల సహాయంతో తయారు చేసిన వస్త్రాలు తక్కువ ధరలకు లభించడంతో వినియోగదారులు వాటిపై మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. ఫలితంగా చేనేత పరిశ్రమకు మరింత నష్టాలు తప్పవు. నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధార పడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమరుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి. ●

# ప్రపంచ దేశాల నెత్తిన ఆర్థిక అస్థిరత్వం

ఐ.ప్రసాదరావు

కోవిడ్ 19 సంభవించిన నాటి నుంచి నేటివరకు దాదాపు అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. నేటికీ చాలా దేశాల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ పారిశ్రామిక సేవారంగాలు పుంజుకోలేదు. ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించింది. ముఖ్యంగా మన దేశంలో పేద మధ్యతరగతి ప్రజలు కరోనా వైరస్ సృష్టించిన విలయతాండవం నుంచి నేటికీ తేరుకోలేదు. వలస వెళ్ళినవారు స్వస్థలాలకు చేరుకుని, తిరిగి వెళ్ళలేదు.దీంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయిరి. అల్ప ఉపాధితో కాలం గడుపుతున్నారు. దీనికి తోడు అధిక ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలతో బ్రతుకులు బహు భారంగా మారింది. నిన్నటి వరకూ జి.యస్.టి భారం. ఇదే సమయంలో విద్యా, వైద్య వైద్యం ప్రైవేటీకరణ జరుగుటచే,సంపాదించిన ఆదాయం కాస్త వీటిపై ఖర్చు చేయడం ద్వారా, దాదాపు డెబ్భై శాతం కుటుంబాలు అప్పులు ఊబిలో చిక్కుకుపోయాయి. గతంలో పారు ( మొండి) బకాయిలు ఎక్కువగా బడా పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక వేత్తల పేర్ల మీద ఉండేవి. వీటికితోడు, నేడు ఈ బకాయిలు ఎక్కువగా వ్యక్తిగత ఖాతాల్లో నమోదు అవుతున్నాయి.ఈ పరిణామాలు ఆందోళనకరమైనవి.దీనికి ప్రధాన కారణం ఉపాధి అవకాశాలు లేకపోవడం. నిరుద్యోగం పెరుగుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అన్నిటికీ మించి 'పొదుపు' కరువైంది. దీనికితోడు 'అనవసర వినియోగం' అనగా 'వినిమయ సంస్కృతి' పెరుగుతుంది. దీంతో మధ్య తరగతి ప్రజల్లో పొదుపు కరువైంది. అప్పులు కుప్పలుగా కుటుంబాలు నెలవు అవుతున్నాయి. ఇక పేద ప్రజల కష్టాలు వర్ణనాతీతం. దేశంలో నేటికీ ఎనభై శాతం మంది ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్, ఉచిత బియ్యం పథకం పై జీవనం సాగిస్తున్నారు. అయితే విచిత్రంగా దేశంలో మిలియనీర్లు, బిలియనీర్ల సంఖ్యపెరిగింది.. సంపద కేంద్రీకృతమైంది. ముఖ్యంగా జి.డి.పి పెరుగుతుంది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది. వాస్తవానికి ఈ జీ.డి.పికి, దేశంలో ఎనభై శాతం ఉన్న పేద మధ్యతరగతి ప్రజల ఆదాయానికి, జీవన ప్రమాణాలకు,ఆర్థిక పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా.ఇక్కడే పాలకులు, మేధావులు, వివిధ ఆర్థిక సర్వే సంస్థలు, ఆర్థికవేత్తలు బహు జాగ్రత్తగా పరిశీలించాలి. నేటికీ పేదరికం భారీస్థాయిలో ఉంది. చాలామంది వేతనాలు కనీసం మూడుపూటలా భోజనం చేయడానికి సరిపోవడం లేదు అనేది కఠోరవాస్తవం. బడా పారిశ్రామిక సంస్థలకు వ్యక్తుల కు కారుచౌకగా ప్రకృతి వనరులు ధారాదత్తం చేయరాదు. ఋణ మాఫీలు, రాయితీలు ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తోంది. ముఖ్యంగా పాలకులుఆర్థిక వ్యవస్థను బలోపే తం చేసేందుకు సన్నాహాలు చేయాలి. ప్రజలకు, యువతకు ఉద్యోగఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పరుచుకోవాలి. ఇక ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు ఆందోళనకరంగా మారడానికి కరోనా వైరస్ సృష్టించిన విలయతాం డవం ఒక కారణం అయితే, తదుపరి రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్, పాలస్తీనా గాజాపై యుద్ధం, ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న 'టారిఫ్ నిర్ణయాలు' మొత్తం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. సాక్షాత్తూ అమెరికాలో కూడా 'షట్ డౌన్' అవుతుంది. అమెరికా డాలర్ విలువ క్షీణిస్తుంది. అమెరికా ఆంక్షల వల్ల యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.చైనాలో పరిస్థితి గోప్యంగా ఉన్నా, కొంతమేరకు అక్కడ వస్తు ఎగుమతులు లేక పరిశ్రమలు మూతపడ్డాయి అని నిఘా వర్గాలు తెలుపుతున్నాయి.ఇక మన ఆసియా ఖండంలో ముఖ్యంగా మన ఇరుగు పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్,నేపాల్, పాకిస్థాన్, మయన్మార్ రాజకీయ అస్థిరత్వంతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. మరోవైపు భూకంపాలు,వరదలు వలనఎంతో నష్టం చవిచూస్తున్నాయి. రష్యా గత నాలుగు సంవత్సరాలుగా యుద్ధం చేయడంవల్ల, ఆర్థికపరిస్థితి దెబ్బతింటున్నది. వేళ్ళమీద లెక్కపెట్టే కొన్నిదేశాలు మినహా,దాదాపు ప్రపంచంలోని అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకోవాలి అంటే ముఖ్యంగా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, స్నేహసంబంధాలు మెరుగు పరుచుకోవాలి. ఆధిపత్యధోరణి తగ్గించుకోవాలి.గ్లోబలైజేషన్ వలన ప్రపంచం అంతా కుగ్రామంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని దేశాలు ఒకరికి ఒకరు సహకారించుకోవాలి. ఎగుమతి దిగుమతి సుంకాలు అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఉండాలి. వలస వ్యతి రేకత ఉండరాదు. ప్రతీకార సుంకాలతో పగలు పెంచుకోరాదు. ముఖ్యంగా యుద్ధాలు జోలికి పోకుండా, సమస్యలను చర్చల ద్వారా పరిష్కారించుకోవాలి.ఏ ఉద్దేశంతో అయితే 1945లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేయడం జరిగిందో, ఆ ఆశయాలు లక్ష్యాలు నెరవేర్చడానికి అన్ని దేశాలు ప్రయత్నాలు చేయాలి. ●

# జపాన్ ప్రధాని ముందున్న సవాళ్లు

డి జె మోహన రావు

జపాన్ రాజకీయం మరోసారి కల్లోలంలో పడింది. మధ్యలోనే ప్రధాని పదవి ముగియడం, పార్టీలో అంతర్గత గొడవలు, ఆర్థిక సంక్షోభం, ప్రజల నమ్మకం కోల్పోవడం వంటి కారణాలతో దేశం అస్థిరతలోకి జారుకుంది. అయితే, ఈ సంక్షోభం ఒక చారిత్రక పరిణామానికి నాంది పలికింది. సనే తకైచి జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రాజకీయ సంక్షోభంలో పదవిని కోల్పోయిన మాజీ ప్రధాని షిగేరు ఇషిబా. 2024 అక్టోబర్‌లో ప్రధాని అయిన ఆయన, కేవలం ఒక సంవత్సరంలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అవినీతి ఆరోపణలు, ఎన్నికల్లో ఘోర పరాజయాలు, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి)పై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఇందుకు ప్రధాన కారణాలు. దశాబ్దాల తర్వాత, ఎల్‌డిపి పార్లమెంట్‌లో తన మెజారిటీని కోల్పోయింది. యెన్ విలువ పడిపోవడం, నిత్యావసరాల ధరలు పెరగడం, జీతాలు పెరగకపోవడం వంటి ఆర్థిక సమస్యలు ప్రజల కోపానికి కారణమయ్యాయి. ఈ అంశాలతో పాటు, పార్టీలోని వారి ఒత్తిడి కారణంగా ఇషిబా రాజీనామా తప్పనిసరి అయ్యింది.ఇషిబా రాజీనామాతో ఎల్‌డిపిలో హోరాహోరీ పోటీ జరిగింది. ఈ పోటీలో సనే తకాయచి విజయం సాధించి, అక్టోబర్ మధ్య నాటికి పార్లమెంట్ ఆమోదంతో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆమె గెలుపు కేవలం జపాన్ తొలి మహిళా ప్రధాని కావడమే కాదు, కఠిన సంప్రదాయవాద భావజాలం కలిగిన నాయకురాలు అధికారంలోకి రావడం కూడా ఒక చారిత్రక ఘట్టం. ఆమె దివంగత ప్రధాని షింజో అబేకు అత్యంత సన్నిహితురాలు.అబే జాతీయవాద విధానాలను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యం ఆమెకు ఉంది. దేశం మార్పు కోరుకుంటున్న సమయంలో, ఆమె విజయం మరింత గంభీరమైన రాజకీయ మార్పుకు సంకేతం.నూతన ప్రధాని ముందు ఉన్న సవాళ్లు చిన్నవి కావు. దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం, ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోవడం, సామాజిక సమస్యలను పరిష్కరించడం ఆమెకు అత్యంత కీలకం. జపాన్ చరిత్రలో తరచుగా ప్రధానులు తక్కువ కాలంలోనే పదవీ విరమణ చేయడం సర్వసాధారణం. ఇప్పుడు అదే పరిస్థితి మళ్లీ ఎదురవుతుందేమోనని జపనీయులు ఆందోళన చెందుతున్నారు. తకాయచి ముందు ఉన్న అతిపెద్ద సవాలు ఇదే. ముఖ్యమైన చట్టాలు, బడ్జెట్ ఆమోదం పొందాలంటే ప్రతిపక్షం మద్దతు అనివార్యం.ప్రతిపక్షంతో కలిసి పనిచేస్తూ, ప్రభుత్వాన్ని స్థిరంగా నడిపించ



గలిగితేనే ఆమె నాయకత్వం నిలబడుతుంది. జపాన్ ఆర్థిక వ్యవస్థ దశాబ్దాలుగా స్తబ్దంగా ఉంది. యెన్ విలువ తగ్గిపోవడంతో జీవన వ్యయం పెరిగింది. అబే తరహాలోనే తకాయచి కూడా ప్రభుత్వవ్యయాన్ని పెంచేందుకు మొగ్గు చూపినా, ప్రజలు కోరుకునేది మాత్రం జీతాల పెంపు, మెరుగైన జీవన ప్రమాణాలు. ఈ దిశగా ఆమె తీసుకునే చర్యలుఆమె పాలనకు కీలకం కానున్నాయి. పెరిగిన వృద్ధ జనాభా వల్ల సామాజిక సంక్షేమ ఖర్చులు పెరుగుతూ, దేశంపై మరింత ఆర్థిక భారం పడుతోంది. ఎన్నికల ఓటములు పార్టీ నాయకత్వంపై నమ్మకాన్ని దెబ్బతీశాయి. 'జపాన్ ఫస్ట్' అనే నినాదంతో వలసలు, భద్రత, సైనిక బలోపేతంపై కఠిన వైఖరిని కోరుకునే వర్గాలు పార్టీలో బలంగా మారుతున్నాయి. తకాయచి కఠిన వైఖరి ఈ వర్గానికి అనుకూలంగా ఉన్నప్పటికీ, ప్రజల అసంతృప్తిని తగ్గించాలంటే ఆమె సమన్వయం సాధించాల్సి ఉంటుంది. దేశీయ సవాళ్ల మాదిరిగానే విదేశాంగ విధానం కూడా తకాయచికి కీలకం. ఆమె జపాన్ భద్రత కోసం బలమైన సైన్యం, అమెరికాతో పటిష్టమైన భాగస్వామ్యం, చైనాపై కఠిన వైఖరిని కోరుకుంటారు. అమెరికాతో సంబంధాలు బలంగానే కొనసాగే అవకాశం ఉన్నా,తిరిగి అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ వల్ల కొత్త చిక్కులు తలెత్తవచ్చు. జపాన్ రక్షణ ఖర్చులను జీడీపీలో 3.5శాతం వరకు పెంచాలని ట్రంప్ డిమాండ్ చేసే అవకాశంఉంది. ఈ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ, అమెరికా మద్దతును నిలుపుకోవడం తకాయచికి ఒక సవాలు.ఆసియా పొరుగు దేశాలైన చైనా, దక్షిణ కొరియా పట్ల ఆమె వైఖరి కఠినంగా ఉండవచ్చు. అబే జాతీయవాదానికి మద్దతు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 9 మార్పు సూచనలు, యాసుకుని మందిర సందర్శన వంటి అంశాలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచవచ్చు.అయినప్పటికీ, చైనా జపాన్‌కు ప్రధాన వ్యాపార భాగస్వామి కాబట్టి, తకాయచి తన మాటల్లో కొంత మృదుత్వాన్ని పాటించే అవకాశం ఉంది. ఆమె భారతదేశం, ఆస్ట్రేలియా వంటి దేశాలతో సంబంధాలు బలోపేతం చేసి,క్వాడ్ కూటమిలో జపాన్ పాత్రను మరింత పెంచాలనుకుంటున్నారు. సనే తకాయచి అధికారంలోకి రావడం రాజకీయంగా అనివార్యమైనప్పటికీ, ఇది పాత సంప్రదాయవాదానికి కొత్త చారిత్రక మలుపుగా మారింది. ఎల్‌డిపి తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేస్తూనే, ఒక మహిళా నాయకురాలిని ప్రోత్సహించడం జపాన్ రాజకీయ మార్పుకుసంకేతం. తకాయచికి ముందు ఉన్న పరీక్షలు కఠినమైనవి. ప్రతిపక్షంతో సయోధ్య, ఆర్థిక స్థిరత్వం, విదేశాంగ సమతుల్యత. ఈ పరీక్షల ఫలితమే ఆమెను జపాన్ 'ఐరన్ లేడీ'గా మారుస్తుందా లేదా మరో తాత్కాలిక ప్రధానిగా మిగిలిపోతుందా అన్నది నిర్ణయిస్తుంది. యుద్ధానంతర రాజకీయ స్థిరత్వం ముగిసిన తర్వాత, జపాన్‌లో ప్రారంభమైన ఈ కొత్త అధ్యా యం ఎంతవరకు కొనసాగుతుందో చూడాలి. ●

# భారత్ గౌరవ్ పర్యాటక ప్రత్యేక రైలు




## తెలుగు రాష్ట్రాల మీదుగా గుజరాత్‌కు రాకపోకలు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 7, ప్రభాత వార్త:** తీర్థయాత్రలలో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించాలనుకునే ఔత్సాహిక యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ సీమాంధ్ర మీదుగా గుజరాత్ కు భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 26న మధ్యాహ్నం 03:00 గంటలకు రేణిగుంట నుండి బయలు దేరే 'భారత్ గౌరవ్' ప్రత్యేక పర్యాటక రైలు భవ్య గుజరాత్ ప్యాకేజ్ (9 రాత్రులు / 10 రోజులు) కోసం బయలు దేరుతుంది. ఈ రైలు ఈనెల 27న, సికింద్రాబాద్ కు ఉదయం 08:00 గంటలకు, నిజామాబాద్, నాందేడ్, పూర్ణాల మీదుగా ద్వారకాలోని ద్వారకాధీశ్ ఆలయం, నాగేశ్వర ఆలయం, బేట్‌ద్వారకా, సోమనాథ్‌లోని సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం, మోడేరా లోని సూర్యదేవాలయం (మోడేరా), రాణి కి వావ్ (పటాన్), ఎకతా నగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీలను యాత్రీకులకు చూపుతుంది.

**ప్రయాణ మార్గం:** రేణిగుంట నుండి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట్, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్, పూర్ణా మీదుగా ప్రయాణిస్తుంది.

**ప్యాకేజీ ధరలు:** ఎకానమీ క్లాస్ (స్లీపర్) రూ.18, 400, స్టాండర్డ్ (3ఏసి) 30,200 వేలు, కంఫర్ట్ (2ఏసి) 39,900 వేల రూపాయలు.

**సౌకర్యాలు:** రోజుకు మూడు భోజనాలు, వసతి, రవాణా సదుపాయం, ప్రతి బోగీలో కూడా ఐఆర్‌సిటి సిబ్బంది అందుబాటులో ఉంటారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

**తిరుపతి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు**

ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ తిరుపతి-అనకాపల్లితిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి అనకాపల్లి వెళ్లే నెంబర్ 07481 ప్రత్యేక రైలు నవంబరు 02 నుంచి 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 0800 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 09 30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అనకాపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబరు 07482 ఎక్స్ ప్రెస్ ఈనెల 03 నుంచి డిసెంబర్ 01 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 0535 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 0740 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.



జాన్ క్లార్క్



మైఖేల్ హెచ్. డివోరెట్



జాన్ ఎం. మార్టినిస్

# ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

## క్వాంటం టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌పై పరిశోధన

**స్టాక్‌హోమ్, అక్టోబరు 7:** భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి 2025ని ప్రకటించారు. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అణువుల స్థాయిలో మాత్రమే సాధ్యమనుకున్న క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలను, కంటికి కనిపించేంత పెద్ద ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో విజయవంతంగా ప్రదర్శించినందుకుగాను వారికి ఈ గౌరవం దక్కింది. క్వాంటం మెకానిక్స్ ప్రకారం, ఒక కణం తనకు అడ్డుగా ఉన్న గోడను సైతం దాటుకుని వెళ్లగలదు. దీనినే టన్నెలింగ్ అంటారు. అయితే ఇలాంటి వింత ప్రవర్తనలు కేవలం సూక్ష్మ ప్రపంచానికే పరిమితమని ఇప్పటివరకు భావించేవారు. కానీ, ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 1984-85 మధ్యలో చేసిన ప్రయోగాలతో ఈ అభిప్రాయాన్ని మార్చేశారు. వారు సూపర్ కండక్టర్లతో, మధ్యలో ఒక విద్యుత్ నిరోధక పొర (జోసెఫ్ సన్ జంక్షన్) ఉండేలా ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ సర్క్యూట్‌ను రూపొందించారు. ఈ సర్క్యూట్‌లో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు, అందులోని కణాలన్నీ కలిసి ఒకే స్థూల కణంగా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. ఈ స్థూల కణం, ఎలాంటి అడ్డంకి లేకపోయినా క్వాంటం టన్నెలింగ్ ద్వారా సున్నా వోల్టేజ్ స్థితి నుంచి బయటపడటాన్ని వారు నిరూపించారు. అలాగే, ఈ వ్యవస్థ నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే శక్తిని గ్రహించడం లేదా విడుదల చేయడాన్ని కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ ఆవిష్కరణపై నోబెల్ కమిటీ ఛైర్ ఓల్ ఎరిక్సన్ స్పందిస్తూ, "శతాబ్దాల నాటి క్వాంటం మెకానిక్స్ నిరంతరం కొత్త ఆశ్చర్యాలను అందిస్తుండటం అద్భుతంగా ఉంది. అన్ని డిజిటల్ టెక్నాలజీలకు క్వాంటం మెకానిక్సే పునాది కాబట్టి ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పరిశోధనలు క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది.



# ప్రజాజీవితంలో పాతికేళ్లు!

## ప్రధానిమోడీ పునఃశ్చరణం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 యేళ్లు పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 యేళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తనపరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సిఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆనాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సిఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తుచేశారు. భారీభూకంపం, సూపర్‌సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లోపెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు.

# సిజెఐపై దాడిపై నాకెలాంటి పశ్చాత్తాపంలేదు

## ఆ దేవుడే ఇలా చేయించాడు: న్యాయవాది రాకేశ్ కిశోర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసినందుకు తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని న్యాయవాది రాకేశ్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఓ విష్ణు మూర్తి విగ్రహానికి సంబంధించిన పిటిషన్‌పై సిజెఐ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, అందుకే ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 16న మధ్యప్రదేశ్‌లోని జవారీలో ఉన్న ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహం పునరుద్ధరణపై సిజెఐ ముందు పిటిషన్ విచారణకు వచ్చిందని రాకేశ్ కిశోర్ గుర్తుచేశారు. ఆ సమయంలో "వెళ్లి మీ దేవుడినే ఏదైనా చేయమని అడగండి" అంటూ సిజెఐ వ్యాఖ్యానించడం తనను కలచివేసిందన్నారు. "న్యాయం చేయకపోయినా పర్వాలేదు కానీ, నమ్మకాలను ఎగతాళి చేయకూడదు. పిటిషన్‌ను తిరస్కరించడం అన్యాయం" అని ఆయన పేర్కొన్నారు. తాను హింసకు వ్యతిరేకినని, అయితే ఒక సాధారణ పౌరుడు ఎందుకిలా చేశాడో ఆలోచించాలని అన్నారు. "నేను ఏ మత్తులోనూ లేను. ఆయన చర్యకు ఇది నా ప్రతిస్పందన మాత్రమే. నాకు భయంలేదు, పశ్చాత్తాపం లేదు. క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు. ఈ పని దేవుడే చేయించాడు. నన్ను జైలుకు పంపినా, ఉరితీసినా అది ఆయన చిత్తమే'నని రాకేశ్ కిశోర్ వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం, గుర్తింపు ప్రమాదంలో ఉన్నాయని, ప్రజలు తమ హక్కుల కోసం ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. తనను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేయడంపైనా రాకేశ్ కిశోర్ స్పందించారు. న్యాయవాదుల చట్టంలోని సెక్షన్ 35 ప్రకారం, క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసి, నోటీసు ఇచ్చి, తన వాదన విన్న తర్వాతే చర్యలు తీసుకోవాలని, కానీ బార్ కౌన్సిల్ ఆ నిబంధనలను ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ఇక, సిజెఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మంగళవారం సుప్రీంకోర్టు ఎదుట నిరసన తెలిపింది. ఇది న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!

## రక్షించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు



**లక్నో, అక్టోబరు 7:** ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులు సాధారణంగా కరెంటు, నీళ్లు, రోడ్లు, రేషన్ కార్డుల వంటి సమస్యలపై ఉంటాయి. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు విని అధికారులు నివ్వెరపోయారు. తన భార్య రాత్రిపూట పాముగా మారి తనను కాటు వేయడానికి ప్రయత్నిస్తోందని ఓ భర్త చేసిన ఆరోపణ ఇప్పుడు సంచలనంగా మారింది. మహమూదాబాద్ పరిధిలోని లోధ్సా గ్రామానికి చెందిన మెరాజ్ అనే వ్యక్తి సమాధాన్ దివస్ (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిశాడు. "అయ్యా, నా భార్య నసీమున్ రాత్రి అయితే చాలు పాములా మారిపోతోంది. నన్ను కాటు వేయడానికి వెంట పడుతోందని ఫిర్యాదు చేశాడు. తన భార్య వల్ల తనకు ప్రాణహాని ఉందని, ఆమె తనను మానసికంగా తీవ్రంగా హింసిస్తోందని వాపోయాడు. ఇప్పటికే చాలాసార్లు తనను చంపడానికి ప్రయత్నించిందని, అయితే ప్రతీసారి తాను మెలకువతో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డానని మెరాజ్ తెలిపాడు. నిద్రలో ఉన్నప్పుడు ఏదో ఒక రాత్రి తనను చంపేయగలదని భయం వ్యక్తం చేశాడు. ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్‌కు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు సమర్పించాడు. ఈ వింత ఫిర్యాదుతో ఆశ్చర్యపోయిన జిల్లా కలెక్టర్, వెంటనే దీనిపై విచారణ చేపట్టాలని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డీఎం), పోలీసులను ఆదేశించారు. పోలీసులు దీన్ని మానసిక వేధింపుల కోణంలో దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో వేగంగా వైరల్ అయింది. నెటిజన్లు దీనిపై సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఇంకెంత మందిని కరుస్తోందో ఏమో అని ఒకరు వ్యాఖ్యానించగా, ఏమైనా నాగమణి దాచిపెట్టావా? అని మరొకరు చమత్కరించారు. నీ పెళ్లి జీవితంలో శ్రీదేవి దొరికింది, చాలా అదృష్టవంతుడివి అంటూ 1986 నాటి నాగిన్ సినిమాలో నటి శ్రీదేవి పోషించిన ఇచ్ఛాధారి పాము పాత్రను గుర్తుచేస్తూ మరో నెటిజన్ కామెంట్ చేశారు. ఈ విచిత్రమైన కేసులో అసలు నిజం ఏంటో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# యేడాది తర్వాత కేజ్రీవాల్‌కు అధికారిక నివాసం కేటాయింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు అధికారిక బంగ్లా లభించింది. సిఎం అధికారిక నివాసాన్ని విడిచిపెట్టిన దాదాపు ఏడాది తర్వాత ఆయనకు కేంద్రం అధికారిక బంగ్లాను కేటాయించింది. 95, లోధి ఎస్టేట్‌లోని టైప్ 7 బంగ్లాను కేటాయించింది. అయితే, బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన లోధి ఎస్టేట్ లోని బంగ్లాను కేజ్రీవాల్‌కు కేటాయించాలని ఆప్ కోరింది. కానీ ఆ బంగ్లాను జూన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించడంతో.. కేజ్రీకి వేరే బంగ్లా అలాట్ చేశారు. 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సిఎం పదవి నుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీ చేశారు. నాటి నుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీ సభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు. ఈ క్రమంలో తనకు అధికారిక బంగ్లా కేటాయించాలంటూ కేజ్రివాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా పదిరోజుల్లోగా ప్రభుత్వనివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి

## ఏడుగురికి తీవ్ర గాయాలు


**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** పాకిస్థాన్‌లో ప్రయాణికుల రైలుపై మరోసారి దాడి జరిగింది. క్వెట్టా వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన పేలుడులో కనీసం ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లోని షికార్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలుపై దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. షికార్‌పూర్ జిల్లాలోని సుల్తాన్ కోట్ రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉదయం 8:15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై దుండగులు అమర్చిన బాంబు పేలింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గం గుండా వెళుతున్నప్పుడు ఈపేలుడు సంభవించినట్లు షికార్‌పూర్ డిప్యూటీ కమిషనర్ షకీల్ అబ్రో ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురిలో నలుగురిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి, మిగిలిన ముగ్గురిని షికార్‌పూర్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పేలుడు తర్వాత ప్రయాణికులను సమీప స్టేషన్లకు తరలించి, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సుక్కూర్ డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మోహసిన్ అలీ సియాల్ వివరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు తరచూ దాడులకు గురవుతోంది. గత నెల సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో ఇదే రైలుపై జరిగిన బాంబు దాడిలో 12 మంది గాయపడ్డారు. అంతకు ముందు ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఉగ్రవాదులు ఇదేరైలును హైజాక్ చేసి, 400 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది.

# సింగర్ జుబీన్ బాడీగార్డ్ ఖాతాల్లో రూ. కోటి లావాదేవీలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ఓ కీలకవిషయం వెలుగులోకి వచ్చింది. గాయకుడి భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి లావాదేవీలు జరిగాయి. గార్గ్ మృతిపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అంత డబ్బు ఎలా వచ్చిందనే దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాయకుడి మృతి కేసును ఆర్థిక కోణంలో కూడా దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని సిఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. ఇటీవల జుబీన్ బ్యాండ్‌మేట్ శేఖర్‌జ్యోతి గోస్వామి తన వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడికి ఆయన మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ విషమిచ్చి దాన్నిప్రమాదకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారన్నారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏ మాత్రం కంగారు పడలేదన్నారు. వెంటనే చికిత్స అందించకుండా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## వలసలపై ట్రంప్ ఉక్కుపాదం

# యుఎస్ వెళ్లేందుకు భారతీయ విద్యార్థుల అనాసక్తత




**వాషింగ్టన్, అక్టోబర్ 7:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19 శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది. సాధారణంగా యుఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్రదేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు చైనా విద్యార్థులకు యుఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్యకంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. ఈ యేడాదిమేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా లేదా అనే దాన్ని అంచనావేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే సోషల్ మీడియా వెట్టింగ్ అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్1బి వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.

# ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలు

## ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్!



**న్యూయార్క్, అక్టోబరు 7:** మధ్య శ్రేణి, హెవీ డ్యూటీ ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. వచ్చే నెల 1 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపారు. ఈ ట్రక్కులను అమెరికాకు అధికంగా ఎగుమతి చేసే 5 దేశాల్లో మెక్సికో, కెనడా, జపాన్, జర్మనీ, ఫిన్లాండ్ ఉన్నాయి.

# 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

## మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఐదురాష్ట్రాలపరిధిలోని 18 జిల్లాలను కలుపుతూ నాలుగు ప్రాజెక్టుల రైల్వే నెట్‌వర్క్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ సమావేశంలో ఈ నాలుగు ప్రాజెక్టులకు సుమారు రూ.24, 634 కోట్ల వ్యయం కాగలదని అంచనావేసారు. వాటిలో మహారాష్ట్రలోని వార్ధా భూసావాల్‌ల మధ్య ఉన్న మూడు, నాలుగో లైన్లు 314 కిలోమీటర్లు, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌పరిధిలోని గోండియా, డోంగర్‌గఢ్ నాలుగోలైన్ 84 కిలోమీటర్లు, గుజరాత్, మధ్యప్రదేశ్ పరిధిలోని 259 కిలోమీటర్ల నిడివికలిగిన వడోదర, రత్లాం మూడు నాలుగు లైన్లను అభివృద్ధి చేస్తారు. ఇటార్సీ, భోపాల్, బీనాలమధ్య నాలుగోలైన్ 237 కిలోమీటర్ల నిడివికలిగింది కూడా ఈ రైల్వే నెట్‌వర్క్ పరిధిలోఉంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు వల్ల సుమారు 85.84 లక్షల జనాభా ఉన్న 3633 గ్రామాలకు, రెండు ప్రధాన స్ఫూర్తిదాయక జిల్లాలు విదిషా, రాజ్‌నంద్‌గావ్ లకు రవాణాసదుపాయం మరింతగా మెరుగు పడుతుందని కేబినెట్ అనంతరం సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. అంతే కాకుండా 18 జిల్లాల పరిధిలో సమగ్రాభివృద్ధితో పాటు స్వయం ఉపాధికూడా పెరుగుతుందని, ప్రజల్లో ఆత్మనిర్భరతను మరింత పెంచాలన్న ప్రధానిమోడీ లక్ష్యానికి అనుగుణంగా ఈప్రాజెక్టులు రూపుదిద్దుకుంటాయని తెలిపారు.

# సంక్షిప్తంగా..

## పికెతో చిరాగ్ చెట్టాపట్టాల్

**పాట్నా, అక్టోబరు 7:** బీహార్‌లో వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కొత్త పొత్తు కుదిరే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ కూటమి కట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ, జేడీయూతో సీట్ల షేరింగ్‌లో లెక్క కుదరడం లేదు. ఎన్డీఏ కూటమిలో షీట్ల షేరింగ్‌పై తాను బీజేపీతో మాత్రమే మాట్లాడుతానని, జేడీయూతో సంబంధం లేదని చిరాగ్‌అన్నారు. బిజెపి కూడా తన డిమాండ్‌ను ఒప్పుకోకపోతే ఏ క్షణంలోనైనా కూటమి నుంచి బయటికి వెళ్లే ఆప్షన్ తనకు ఉన్నదని అన్నారు.

## 'కమల్‌హాసన్ అంతరాత్మను అమ్ముకున్నారు'



**చెన్నై, అక్టోబరు7:** ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం చీఫ్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌పై బీజేపీ నేత అన్నామలై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడటంపై మండిపడ్డారు. కమల్ అధికార డిఎంకెకి అనుకూలంగా ఉన్నారని ఆరోపించారు. రాజ్యసభ సీటు కోసం తన ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరూర్ బాధితుల పరామర్శకు వెళ్లి తొక్కిసలాటలో ప్రభుత్వం తప్పు లేదని అంటే ఎవరైనా అంగీకరిస్తారా ఆయన మరీ ఇంత దిగజారాలా అసలు ఆయన మాటలను తమిళనాడు ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నామలై అన్నారు.

## అధైర్య పడకండి.. నేనొస్తా, ఆదుకుంటా!

**చెన్నై, అక్టోబరు 7:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చిన ఆయన త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం ఆ తర్వాత సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కరూర్‌లో ఘటనాస్థలిని ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమిళగ వెట్రి కళగం సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## బిజెపి నేతపై కాల్పులు.. దుర్మరణం

**బర్హంపూర్, అక్టోబరు 7:** ఒడిశాలోని బరంపురంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేత, సీనియర్ న్యాయవాది పీతాబాస్ పాండాను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కాల్చి చంపారు. గత రాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ కార్యక్రమాన్ని ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో బైకుంఠనగర్‌లోని తన నివాసానికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఇంటి సమీపంలోనే మాటువేసిన ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి పాండాను అడ్డగించారు. అత్యంత సమీపం నుంచి ఆయనపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో పాండా చాతీలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

## గ్రేస్ ఓమైలీకి బ్రిటన్ పౌర పురస్కారం

**లండన్, అక్టోబర్ 7:** రెండేళ్ల క్రితం నాటింగ్‌హాంలో స్నేహితురాలిని కాపాడే ప్రయత్నంలో కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన భారత సంతతి యువతి గ్రేస్ ఓమైలీ కుమార్ (19)కి మరణానంతరం బ్రిటిష్ ప్రభుత్వం ద్వితీయ అత్యున్నత పౌర పురస్కారం జార్జ్ మెడల్‌ను ప్రకటించింది. 2023 జూన్ 13న గ్రేస్ తన స్నేహితురాలు జానబీ వెబర్‌తో కలిసి ఇంటికి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు దాడి జరిగింది. వాల్డోకైలోకేన్ అనే వ్యక్తి వెబర్‌పై వెనకనుంచి కత్తితో దాడి చేయగా, గ్రేస్ ధైర్యంతో అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దాడిలో స్నేహితులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గ్రేస్ క్రీడాకారిణి కూడా. ఆమె ధైర్యం అసలైన శౌర్యానికి మంచి ఉదాహరణ అని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. గ్రేస్ కుటుంబ సభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఇలా మొత్తం 20 మందిని గౌరవిస్తారు.

# ఆశ వర్కర్లకు న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి

## - సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల నిరసన

**చాట్రాయి, అక్టోబర్ 7, ప్రభాతవార్త :**ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నందున వారి న్యాయమైన కోరికలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు చాట్రాయి మండల కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న పని భారంతో పాటు చాలీచాలని జీతాలతో ఆశ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లకు జీతాలు పెంచుతామని ఎన్నికల ముందు వాగ్దానములు చేశారని అధికారంలోనికి వచ్చి 17 మాసాలైనా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని,కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ లను ఆశలుగా మార్పు చేయాలని అప్పటి వరకు ఆశలతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు మరియు వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాలకు అనుగుణంగా ఆశలను అదనముగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశ వర్కర్లు పుల్లమ్మ , రత్నకుమారి,కె.లక్ష్మి, అరుణ, మరియమ్మ పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అధికారులు తక్షణమే స్పందించాలి

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్

**ఏలూరు/ బుట్టాయిగూడెం,ప్రభాతవార్త :**గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వెంటనే స్పందించాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ అధికారులను ఆదేశించారు. కోటరామచంద్రాపురంలోని ఐటిడిఏ సమావేశపు హాలులో మంగళవారం గిరిజనులు, గిరిజన సంఘాల ప్రతినిధుల నుండి అర్జీలను హుస్సేన్ స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసమే జాతీయ ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఇక్కడ తనకు అందిన అర్జీలలో ఎన్నో సంవత్సరాల నుండి అధికారులు చుట్టూ తిరిగినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎక్కువమంది గిరిజనులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ విషయంపై హుస్సేన్ స్పందిస్తూ గిరిజనులు తమ సమస్యలను అధికారులకు తెలియజేస్తే పరిష్కారన్న నమ్మకంతో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారని, వారి సమస్యలు పరిష్కరించకుండా పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదన్నారు. అర్హత కలిగి, నిబంధనల మేరకు పరిష్కరించే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అలాకాక గిరిజన సమస్యల పట్ల అలసత్వం వహించే అధికారులపై తగువిధంగా చర్యలు తీసుకుంటామని హుస్సేన్ హెచ్చరించారు. ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ కు అందిన అర్జీలలో ఎక్కువ శాతం పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు సంబందించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి సక్రమంగా అమలు కాలేదని, ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అమలు చేసేందుకు జూన్, 2017 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని అర్హులుగా గుర్తిస్తున్నారని, కానీ అల్లూరి మన్యం జిల్లాలో 10. 10.. 2022 నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండిన యువతను ఆర్ అండ్ ఆర్



ప్యాకేజి అమలుకు అర్హులుగా గుర్తిస్తున్నారని, ఏలూరు జిల్లాలో కూడా అదే విధానాన్ని అమలు చేయాలనీ కోరారు. గిరిజన గ్రామాలలో భూ సేకరణ సమస్యలు, గిరిజన, గిరిజనేతర భూ తగాదా సమస్యలపై ప్రజలు కమిషన్ సభ్యలకు అర్జీలు అందించారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు తగురీతిన న్యాయం చేసి, అర్హులందరికీ పూర్తిస్థాయిలో ఆర్ అండ్ ఆర్ అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను హుస్సేన్ ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు 2024 జులై లో వచ్చిన వరద ఉ ధృతికి పెదవాగు ప్రాజెక్ట్ కు గండి పడడంతో ఎన్నో కుటుంబాలు ఇళ్ళు, పాడిపశువుల ఆస్తులు కోల్పోయ్యారని,





వారికి నష్ట పరిహారం అందలేదని, దెబ్బతిన్న పెదవాగు ప్రాజెక్ట్ కు మరమ్మతులు చేయించాలని కోరగా, హుస్సేన్ స్పందిస్తూ పెదవాగు ప్రాజెక్ట్ కు సంబంధించి 80 శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్ లో ఉందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టారని, త్వరలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. వంకావారిగూడెంలో నేవి ఆయుధ డిపో ఏర్పాటుపై అభ్యంతరం తెలియజేస్తూ పెద్దఎత్తున గిరిజనులు, గిరిజన సంఘాలవారు సభ్యులు హుస్సేన్ కు అర్జీ అందించారు. నేవి ఆయుధ డిపోనకు గిరిజనుల భూములను కాక, ప్రభుత్వ భూములు, ప్రైవేట్ జిరాయితీ భూములు సేకరించాలని, తమ భూములు సేకరించకుండా న్యాయం చేయాలని కోరుతూ అర్జీలను సమర్పించారు. సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ రాములు నాయక్, జంగారెడ్డిగూడెం ఇంచార్జ్ ఆర్డీఓ ఎం. ముక్కంటి, ట్రాన్స్కో ఎస్ఈ సాల్మన్ రాజు, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, భూసేకరణ అధికారులు, గిరిజన ప్రాంతాలకు చెందిన తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం.

**ఏలూరు (ప్రభాతవార్త):** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మహర్షి వాల్మీకి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నేడు మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను మనం రాష్ట్ర పండుగగా రాష్ట్రం అంతా ఘనంగా జరుపు కుంటున్నారని, రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి అని అన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతారాములు సద్గుణాలను, గొప్పదనాన్ని చెప్పడంతో పాటు ఆదర్శవంతమైన జీవితం, కుటుంబవిలువలు నుంచి పాలనా సూత్రాలు వరకు నేటితరం నుండి రాబోయే అన్నితరాలు వారికి



ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను తెలియచేసిన వాల్మీకి మహర్షికి మనమందరం జన్మజన్మలు రుణపడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రామాయణం సామాజిక నీతిని బోధిస్తుందని, వాల్మీకి మహర్షి 24 వేల శ్లోకాలతో ఏడు కాండములుతో మానవాళికి అద్భుతమైన రామాయణం కావ్యాన్ని అందించారని అన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారని వాల్మీకి జీవిత చరిత్ర మనవందరికీ తెలియ చేస్తుందన్నారు.మహనీయులు వాల్మీకి జీవితాన్ని మనమంతా ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగు జాడల్లో నడిచి తమజీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దు కోవాలన్నారు. మొట్టమొదటి శ్లోకం మనకు అందించిన మహనీయుడు మనమహర్షి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దైనందిన జీవితంలో స్ఫూర్తితో జీవించాలని అన్నారు. వేల సంవత్సరాలు క్రితమే జ్ఞానం సంపాదించారని, జ్ఞానం ఒకరి సొత్తు కాదని అన్నారు. కృషి చేస్తే జ్ఞాన సముపార్జన ఎవరికైనా సాధ్యమే అని, అది బోయ వర్గానికి చెందిన మహర్షి వాల్మీకి విషయంలో నిరూపితమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర రావు, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, జిల్లా కలెక్టరేటు, బిసి కార్పొరేషన్, వివిధ శాఖలు ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

# కొల్లేరు ప్రాంతం అభివృద్ధి, ప్రజలు సమస్యలపై జిల్లా కలెక్టర్ సమీక్ష

**ఏలూరు,(ప్రభాతవార్త):**జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం కొల్లేరు ప్రాంతం అభివృద్ధి, ప్రజలు సమస్యలు పరిష్కారంపై జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, అటవీ, పర్యావరణం శాఖల ప్రత్యేక కార్యదర్శి శరవణనన్, ఏపి ఆప్కాబ్, ఉమ్మడి జిల్లాల డిసిసిబి చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కైకలూరు ఎమ్మెల్యేలు డా.కామినేని శ్రీనివాస్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా 2:40 గంటలు పాటు కొల్లేరు ప్రాంత మండలాలు వారీగా రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏలూరు అర్బన్, ఏలూరు రూరల్, భీమడోలు, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, ఉంగుటూరు, కైకలూరు, మండవల్లి, పశ్చిమగోదావరి జిల్లాలో ఆకివీడు మండలం కలిపి మొత్తం ఉమ్మడి జిల్లాలో పది మండలాలు కొల్లేరు ప్రాంతం ఉ ందని వివరించారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, తీసుకున్న చర్యలు, కొల్లేరు విస్తీర్ణం మ్యాపు ద్వారా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, అటవీ, పర్యావరణం శాఖల ప్రత్యేక కార్యదర్శి శరవణనన్ కు వివరించారు. గత వరదల సమయంలో బుడమేరు నుండి ఎక్కువ వరదనీరు కొల్లేరుకు చేరినా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి కొల్లేరు ప్రాంతంలో ఒక గ్రామాన్ని కూడా ముప్పుబారిన పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వానికి నివేదించి, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపి అప్కాబ్, ఉమ్మడి జిల్లాల చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పైగా అవుతుందని, కొల్లేరు ప్రాంత సమస్యలు తీరి అభివృద్ధికోసం కొల్లేరు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. జిల్లాలో కొల్లేరు, అటవీ భూములు సరిహద్దులకు సంబందించిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని అన్నారు, అటవీ, ఇరిగేషన్, రెవిన్యూ ,తదితర శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేసి కొల్లేరు సమస్యను పరిష్కరించాలన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ మాకు, అటవీశాఖ అధికార్లకు సమన్వయం కొరవడిందని, కనీసం మాకు సమాచారాన్ని కూడా ఇవ్వడం లేదన్నారు. కోమటిలంకకు చాలా సమస్యలు ఉన్నాయని, బ్రిడ్జి నిర్మాణంకు ఇంకా అనుమతులు రాలేదని చెప్పారు. కొల్లేరు సమస్యలు పోరాటం చేస్తే గత ప్రభుత్వం నామీద క్రిమినల్ కేసులు పెట్టారని, నాతో పాటు 35 మంది కోర్టులు చుట్టూ తిరుగుతున్నామని అన్నారు. కొల్లేరు ఆపరేషన్ లో 14 వేల ఏకరాలు భూములకు సంబంధించి నష్టపరిహారం అందించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ రైతులు, భూ యజమానులు ఆర్థిక పరిస్థితులను, వారి పిల్లలు భవిషత్తును దృష్టిలో పెట్టుకుని చర్యలు చేపట్టాలన్నారు. కొల్లేరు సమస్యలు పరిష్కారం చూపాలని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పైగా అవుతుందని కొల్లేరు ప్రాంతం ప్రజలు చిరకాల సమస్యలు పెద్ద మనసుతో స్వీకరించి పరిష్కారం చేయాలన్నారు. కైకలూరు శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత అభివృద్ధి చాలామటుకు చేసుకోగలిగామని, మిగిలిన పనులు కూడా పూర్తయ్యేలా చూడాలని కోరారు. బుడమేరు వరదతో కొల్లేరు ప్రాంతం ఒక గ్రామాన్ని కూడా ముప్పు బారిన పడకుండా జిల్లా యంత్రాంగం సహకారంతో చూడగలిగామన్నారు. అటవీశాఖ అనుమతులు త్వరగా రావటం లేదన్నది నిజం అని, అటవీ శాఖ అధికారులు నిబంధనలను గౌరవించవలసిన అవసరం ఉందని కొల్లేరు ప్రజలు అభివృద్ధికి మానవతా దృక్పథంతో అభివృద్ధికి సహకరించాలన్నారు. కొల్లేరు ప్రజలు సమస్యలు ఇంకా ఎక్కువ సమయం తీసుకోకుండా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటే కొల్లేరు ప్రజలు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారని అన్నారు.

# నరసాపురం ఆర్టీసీ డిపోకు స్వచ్ఛ బస్ స్టేషన్ పురస్కారం



పెనుమంట్ర-ప్రభాతవార్త :జిల్లాలోని ఉత్తమ స్వచ్ఛ బస్ స్టేషన్ గా నరసాపురం డిపో ప్రథమ స్థానం సాధించింది. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ బీమవరం శాసనసభ్యులు రాష్ట్ర పి.ఎ.సి చైర్మన్ శ్రీ పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి స్వచ్ఛ డిపో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ నరసాపురం బస్సు డిపోను ఉత్తమ బస్సు స్టేషన్ గా గుర్తిస్తూ అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# ఉల్లాస్ ను విజవంతం చేయాలి:కలెక్టర్ నాగరాణి

భీమవరం అక్టోబర్ 7ప్రభాతవార్త : జిల్లాలో అక్షరాంధ్ర ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.మంగళవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరం నందు వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో గత సంవత్సరం నిర్వహించినటువంటి ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం నందు ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేపట్టిన ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంలో డిఆర్డిఏ లో ఉన్నటువంటి నిరక్షరాశులయిన మహిళలకు చదువు నేర్పించి తర్వాత పరీక్ష రాయించి, ఉ త్తీర్ణులైనటువంటి లెర్నర్స్ కి ఆయా మండలాల ఏపిఎంలకు నేడు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మహిళలు చదువుకుంటేనే అన్ని రంగాల్లో రాణించగలరని, నిరక్షరాస్యులుగా ఉన్నవారు



ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న విద్యను అందిపుచ్చుకుని అక్షరాస్యులు కావాలని సూచించారు. జిల్లా వయోజన విద్యనోడల్ అధికారి కె వి వి సత్యనారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం పశ్చిమగోదావరి జిల్లాలో 3,930 మంది డ్వాక్రా గ్రూపులలో మహిళలకు అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించగా వారిలో 3,895 మంది చదువు నేర్చుకుని ఉ త్తీర్ణులై సర్టిఫికెట్లను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఎమ్మెస్ ఎస్ వేణుగోపాల్, డిపిఎంలు, ఏపిఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకలింగేశ్వరుడికి రూ 4 లక్షల విలువైన వెండి నాగాభరణం

**కైకలూరు అక్టోబర్ 7 (ప్రభాతవార్త):** నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలోని శ్రీ శ్యామలాంబ అమ్మవారి దివ్య క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ కనకలింగేశ్వర స్వామివారికి రూ 4లక్షల విలువ గల వెండి నాగభరణం దాతలు భుజబలపట్నం గ్రామస్థులు ముదునూరి కొండరాజు సహకారంతో కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ తన స్వహస్థాలతో దాతల కోరిక మేరకు స్వామివారికి మంగళవారం ఉదయం సమర్పించారు.అనంతరం ముదునూరి కొండరాజు దంపతులను ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ కనక లింగేశ్వర స్వామి వారికి రూ 4 లక్షల విలువైన వెండి నాగాభరణం దాతలు ముదునూరి కొండరాజు సమర్పించడం అభినందనీయమన్నారు. ముందుగా ఆలయ ఈవో విఎన్ కే శేఖర్ ఎమ్మెల్యేకు వేద పండితులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.



ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బూరుబోయిన శ్రీనివాసరావు,బలే యేసు రాజు,పూల రాజీ, కేకే బాబు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, దేవరపల్లి శర్మ,దేవస్థానం సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు


**మొగల్తూరు అక్టోబర్ 7 ( ప్రభాతవార్త):** 216 నేషనల్ హైవే ఆనుకుని ఉన్న ముత్యాలపల్లి వంతెన వద్దగల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నందు మంగళవారం ఆర్గనైజర్ ఉదయం నిప్పులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిపారు. రాము నలుమూలల నుండి భక్తులు సుమారుగా 500 మంది పాల్గొని స్వామివారి ప్రసాదమును స్వీకరించారు.



# జీఎస్టీ తగ్గింపుతో సొమ్ము ఆదా అవుతుంది

## - ఎంఈఓ బ్రహ్మాచారి

**చాట్రాయి, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులతో పాటు అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గించడం వల్ల పేద కుటుంబాలకు ఎంతగానో మేలు జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాచారి అన్నారు.సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంలో భాగంగా చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 వి ఎస్ వి బ్రహ్మాచారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్టి 2.0 లో భాగంగా వస్తు సేవల పన్ను తగ్గింపు ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని అన్నారు. జీఎస్టీ తగ్గింపును ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ప్రజలు తమ స్థితిగతులను పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని యాజమాన్యా ల లోని ఉన్నత పాఠశాలలో జిఎస్టి పై అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన, చిత్రాలేఖనము



పోటీలు నిర్వహించడం జరిగినదని అయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ.వో ఆర్.డి విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి కృష్ణయ్య చాట్రాయి సచివాలయం సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి పాలకమండలి సభ్యునికి సన్మానం

**చాట్రాయి, అక్టోబర్ 7, ప్రభాతవార్త** చింతలపూడి నియోజకవర్గ పోతునూరు గ్రామంలో నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన సందర్భంగా నూజివీడు నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు రాయవరపు సీతారాములు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్,చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మరియు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారావు ప్రత్యేకించి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.బీసీలకు వెన్నుదన్నుగా



ఉండటం తెలుగుదేశం పార్టీకే ఇది సాధ్యమని మరో సారి రుజువైందన్నారు.ఈ కార్యక్రమంలో కొప్పాక కొండ,నందిగామ సుబ్బారావు, కొప్పాక సురేష్, నందిగామ సత్యనారాయణ, కొక్కిరపాటి నాగరాజు మద్దారపు సుబ్బారావు, ఉ మామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తీసుకొనే ఆహారం ఇంద్రధనస్సులా ఉండాలి.



అత్తిలి- అక్టోబర్ 7 (ప్రభాతవార్త ): ప్రతిరోజు తీసుకునే ఆహారం ఇంద్రధనస్సు రంగులో ఉండేలా చూసుకోవాలని ఐసిడిఎస్ తిరుపతిపురం సెక్టర్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి అన్నారు.అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో పోషణ మాసోత్సవాలు సందర్భంగా ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు సమావేశాన్ని నిర్వహించారు. తల్లిపాలతో పాటు పిల్లలకు అనుబంధ ఆహారాన్ని ఇవ్వాలని కోరారు. అనుబంధ ఆహారం ఎలా తయారు చేయాలో కార్యకర్తలు వండి చూపించారు. తల్లి పాలు ఇచ్చే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని కోరారు. ఫోన్ చూపిస్తూ పిల్లలకు ఆహారం ఇవ్వరాదని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.అంగన్వాడీ కార్యకర్త బి. రాజకుమారి, పి చిట్టి మరియ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉరదాళ్లపాలెంలో వైసీపీలో చేరిక



అత్తిలి- అక్టోబర్ 7 (ప్రభాతవార్త): అత్తిలి మండలం ఉ రదాళ్ళపాలెం గ్రామంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి 50 కుటుంబాల వారు చేరారు.. ఈ కార్యక్రమంలో అత్తిలి మాజీ ఎఎంసి చైర్మన్ భరణి , వాణిజ్య విభాగం జోనల్ అధ్యక్షుడు కంకటాల సతీష్ , అత్తిలి మండల బీసీ సెల్ రంభ సూరిబాబు , గుండుమొగుల ఉమామహేశ్, కోపల్లి ధనరాజ్, కోపల్లి పుల్లారావు, కోపల్లి తాతయ్యా, గుండుమొగుల నాగరాజు, కోపల్లి శివప్రసాద్ పాల్గొన్నారు.

# 50 కేజీల కుంకుమతో బాలత్రిపుర సుందరికి అలంకరణ



భీమవరం అక్టోబర్ 7 (ప్రభాతవార్త : పౌర్ణమి సందర్భంగా భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి 50 కేజీల కుంకుమతో పూజ చేసి అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ చే అమ్మవారికి మద్దాల సత్యనారాయణ లక్ష్మి బ్రహ్మాజీ దంపతులచే పంచామృతాలతో అభిషేకాలు, పండ్ల రసాలతో అభిషేకాలు, తోటకూర కృష్ణ, ఫణి దంపతులచే అభిషేకాలు, 50 కేజీల కుంకుమతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు బాలత్రిపుర సుందరి మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# నరసాపురం: ఏరియా ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సమీక్ష



ప్రభాతవార్త నరసాపురం :నరసాపురం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ఏరియా ఆసుపత్రి కమిటీ రివ్యూ మీటింగ్‌లో

ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పేషంట్ల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలని, వారికిచ్చే సేవల పరంగా ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే, ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. హాస్పిటల్‌కి అవసరమైన వైద్య పరికరాలు, శుభ్రత, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్లు వంటి వసతులు మెరుగుపర్చే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి:కలెక్టర్ నాగరాణి





భీమవరం అక్టోబర్ 7ప్రభాతవార్త: ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలనిజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిఅన్నారు. మంగళవారం కలెక్టరేట్ పీజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిఆర్డిఏ, పశుసంవర్ధక శాఖల సమన్వయ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ సంవత్సరం యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ కింద జిల్లాకు 1,419 యూనిట్లు మంజూరు కావడం జరిగిందని, ఎస్ హెచ్ జి మహిళలు వీటి స్థాపన ద్వారా ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. పెరటి కోళ్లు, ఎద్దులు, దూడలు, పాడి గేదెలు, మేకలు పెంపకం యూనిట్లు, మినీ పౌల్ట్రీ ఫారం, గొర్రెల, పొట్టేళ్ల యూనిట్లు నెలకొల్పడం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని లబ్ధిదారులను కోరారు. వీటి కొనుగోలుకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పాల దిగుబడి తక్కువగా ఉందని, పాల దిగుబడి పెంచేందుకు మేలు జాతి ఆవులు, గేదెలు, కొనుగోలులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పక్క రాష్ట్రాల నుండి కాకుండా సమీప జిల్లాల నుండి, మన జిల్లా వాతావరణానికి అనువుగా ఉండే ఆవులు, గేదెలు, కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. వివిధ యూనిట్ల స్థాపన ద్వారా లబ్ధిదారులకు అదనపు ఆదాయం వచ్చే విధంగా అధికారులు వారికి ప్రత్యేక సూచనలు, సలహాలు అందించాలన్నారు. మన జిల్లా అభివృద్ధి రేటు తక్కువగా ఉందని, జిల్లాలో నూతన పరిశ్రమలు, వివిధ రంగాలలో నూతన యూనిట్లు స్థాపన ద్వారా వృద్ధిరేటు పెంచుకోవచ్చు అన్నారు. జిల్లాలో పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు పెంపకం ద్వారా లబ్ధిదారులకు అదనపు ఆదాయం లభిస్తుంది అన్నారు. ఈ దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగుకు ప్రోత్సహించాలని, రైతాంగానికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఎల్.కె.సుధాకర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జవ్వాది హుస్సేన్, డిపిఎంలు ఎస్.కృష్ణకుమారి, డి.వెంకటేశ్వరరావు, ఎం.బాలాజీ, జిల్లాలోని అన్ని మండలాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడేలా అధికారులు చర్యలు

ఏలూరు/ బుట్టాయిగూడెం,,(**ప్రభాతవార్త**):గిరిజన ప్రాంతాలలో పీఎం జన్ మన్ పథకం కింద విద్యా, వైద్యం, విద్యుత్, త్రాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ అధికారులను ఆదేశించారు. కోటరామచంద్రపురం ఐటిడిఏ సమావేశపుహాలులో మంగళవారం గిరిజన ప్రాంతాలలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి తో కలిసి అధికారులతో హుస్సేన్ సమీక్షించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ కొండా ప్రాంతాలలో నివసించే గిరిజన ప్రాంతాలలో విద్యుత్, రహదారులు , త్రాగునీరు అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటిస్తూనే మానవతా దృక్పథంతో అధికారులు వ్యవహరించాలన్నారు. కొండ ప్రాంతాలలో గిరిజనులు కదలికలపై ఆంక్షలు పెట్టవద్దని, కొంతమంది అధికారులు తమను కొండదిగవద్దు, అడవిలో సంచరించవద్దని ఆంక్షలు పెడుతున్నారని గిరిజనులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు గిరిజన గ్రామాలలో లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని, గిరిజన అటవీ ప్రాంతంలో గిరిజనులకు మంజూరు చేసి నిబంధనల పేరుతో నిలుపుదల చేసిన 26 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి నెల రోజులలోగా పూర్తిచేయాలన్నారు. తమ సమస్యలను తెలియజేసేందుకు వచ్చిన గిరిజనుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని, మన తల్లితండ్రులు వారి పనిమీద ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే వారు నిరాదరణకు గురైతే మనం ఏ విధంగా బాధపడతామో ఆలోచించి, మన కార్యాలయానికి వచ్చిన వారిని పట్ల మర్యాదగా ప్రవర్తించుదామన్నారు. లంకలపాకల ఆశ్రమ పాఠశాలలో వసతులు మెరుగుపరచాలని, మోదెలా, పరిసర గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన గ్రామాలన్నింటిలో కమ్యూనికేషన్ నెట్వర్క్ మెరుగుపడేలా చూడాలన్నారు. పెదవాగు ప్రాజెక్ట్ కు మరమ్మత్తు పనులు జరిగేలా తెలంగాణా రాష్ట్రంలో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కు భూములు అందించిన రైతులకు పునరావాస ప్యాకేజి త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా భూమికి భూమి పథకంలో సేకరించిన భూమిని వెంటనే సదరు రైతులకు అందించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో గిరిజన, గిరిజనేతరుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాలలోని ఆసుపత్రులలో మరింత మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాలలో శాంతి,భద్రతల సమస్యలు లేకుండా చూడాలన్నారు. గిరిజన ఆదివాసీ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరిగి పరిష్కారం కాక తన వద్దకు వచ్చారన్నారు. ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు జాతీయ ఎస్టీ కమిషన్ పనిచేస్తోందని, వాళ్ళ హక్కులకు భంగం కలిగినప్పుడు కమిషన్ జోక్యం చేసుకుని సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటుందన్నారు. ఏలూరు జిల్లాలో గిరిజనుల సమస్యల పట్ల కింద స్థాయి సిబ్బంది సక్రమంగా స్పందించడంలేదని, కింద స్థాయి సిబ్బంది సక్రమంగా పనిచేసి, గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే వారితో పాటు పై స్థాయి అధికారులకు చర్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. తాను మరో 6 నెలల్లో ఏలూరు జిల్లాకు వస్తానని, ఇప్పుడు గిరిజనులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కరించి, మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణా ఇరిగేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రాగానే చర్యలు చేపడతామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి జి. సతీష్, జలగం ప్రసాదరావు, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్, జంగారెడ్డిగూడెం ఇంచార్జ్ ఆర్డీఓ ఎం. ముక్కంటి, పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణల ప్రత్యేక కలెక్టర్ సరళా వందనం, ట్రాన్స్కో ఎస్ఈ సాల్మన్ రాజు, డిఎంహెచ్ఓ డా. పి .జె. అమృతం, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, భూసేకరణ అధికారులు, గిరిజన ప్రాంతాలకు చెందిన తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# న్యాయ దేవత విగ్రహానికి జలాభిషేకం

భీమవరం అక్టోబర్ 7 ప్రభాతవార్త :"భారత ప్రజల హక్కులను అంతిమంగా కాపాడేది న్యాయ వ్యవస్థేనని, ఈ వ్యవస్థలో అణగదొక్కాలనో లేదా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలనో ప్రయత్నించినప్పుడు మేమంతా సంఘటితమే అనే సందేశాన్ని సమాజానికి ఇవ్వాలనే ధృక్పదంతో న్యాయ దేవతను శుద్ధి చేసుకోవాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని" భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి గౌరవ శ్రీ డా. బి.లక్ష్మి నారాయణ అన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై సుప్రీం కోర్టులో జరిగిన దాడికి నిరసనగా మంగళవారం సాయంత్రం న్యాయమూర్తి లక్ష్మి నారాయణ అధ్యక్షతన స్థానిక న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి కోర్టుల ప్రాంగణం నుండి ర్యాలీగా బయలుదేరి పాత కోర్టుల ప్రాంగణంలో వున్న న్యాయదేవత విగ్రహం వద్దకు చేరుకుని న్యాయ దేవత విగ్రహానికి జలాభిషేకం చేసి శుద్ధి చేసారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)



ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీష, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్), ఎ పి పి ఉండవల్లి రమేష్ నాయుడు, ఎ జి పి ఉచ్చుల వరప్రసాద్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదిన్న మెగా రెటీనా టెస్ట్ శిబిరం.

అత్తిలి -అక్టోబర్ 7( ప్రభాత వార్త):అంతర్జాతీయ అంధత్వ నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9 న అత్తిలి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలోమంచిలి గ్రామంలో అయ్యప్ప కాలని నందు గల భగవాన్ పూతరేకుల ఫ్యాక్టరీ నందు ఉచిత మెగా రెటీనా టెస్ట్ ఆపరేషన్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు తెలిపారు. ఈ క్యాంపు ను లైన్స్ మాజీ గవర్నర్ గన్నం మాణిక్యాలరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ క్యాంప్ నందు అవసరమైన వారికి సుమారు 15 వేల నుండి 20, వేలు విలువైన ఇంజక్షన్లు ఉచితంగా ఇస్తారని, ఆపరేషన్ అవసరం ఉన్నవారికి 30వేలు ఉచితముగా తన సహకారంతో చేస్తారని తెలిపారు. వివరాలకు తనతో పాటు క్లబ్ కార్యదర్శి లయన్ చిట్టాల బాల మురళి కృష్ణ, కోశాధికారి పద్దినీడి వెంకట శివ,ఉలను భాస్కర రావు, సెల్:9989965624 కు సంప్రదించాలని కోరారు.

దస్తావేజు పోయినది.
నాకు యలమంచిలి గ్రామంలో ఉన్న 2-00ఎకరంకు సంబంధించి నేను డి. 4-7-2019 న [illegible] సం. 3720/2019 [illegible]
ది.7-10-2025 కొల్ల సాయి వెంకట రాజా సెల్. 9440883999, పాలంకి మాణిక్యం వీధి, నరసాపురం.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన పై శిక్షణ కార్యక్రమం



అత్తిలి/ ఇరగవరం -అక్టోబర్ 7 (ప్రభాతవార్త ): ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై అత్తిలి,ఇరగవరం మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరగవరం ఎంపీపీ కొప్పి శెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఏ శ్రీనివాస్ కో ర్స్ డైరెక్టర్ గా వ్యవహరించారు. పేదరికం లేని గ్రామం, పిల్లలకు అనుకూలమైన గ్రామం, తగిన నీరు అందుబాటు, సామాజిక న్యాయం, మంచి పరిపాలన అందించే గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ను ఇచ్చారు. పంచాయితీ కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి


## - ఎంఈఓ బ్రహ్మాచారి


**చాట్రాయి, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని మండల విద్యాశాఖ అధికారి వి బ్రహ్మాచారి అన్నారు. బూరుగుగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో పరిసరాల భద్రతను దృష్టిలో పెట్టుకొని తెలుగుదేశం పార్టీ నాయకులు తేల్లూరి శేఖర్,రాజబోయిన రామరాజు, కాలసాని సూరిబాబు,ఉయ్యాల దిలీప్ కుమార్ సీసీ కెమెరాలను బహుకరించటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.దాతలు బహుకరించిన సీసీ కెమెరాలను అమర్చుగా లాంచనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా చాట్రాయి మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కి దాతలు ఈ విధముగా ముందుకు వచ్చి తమ దాతృత్వం ను చాటుకోవటం చాలా అభినందనియమైన విషయం అని దాతల యొక్క దాతృత్వంను కొనియాడారు.ఈ కార్యక్రమంలో దాతలు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి.బక్కయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగిడి.చెన్నారావు మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# పర్వతాపురంలో వన సంరక్షణ సమితి నిధులు హాంఫట్

## - 40 లక్షలు నిధులు స్వాహా
## - విచారణ జరపాలంటూ సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు

ప్రభాతవార్త చాట్రాయి : చాట్రాయి మండలం పర్వతాపురం గ్రామానికి చెందిన వన సంరక్షణ సమితి నిధులు గోల్ మాల్ అయినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన రావణబ్రహ్మ నూజివీడు కలెక్టర్ ను కలిసి గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అటవీ శాఖ ద్వారా వన సంరక్షణ సమితి కి నిధులు రాగా వాటిని అటవీ ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే వన సంరక్షణ సమితి మార్చుకుని స్వాహా చేశారని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలంటూ ఆయన ఫిర్యాదు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వనసంరక్షణ సమితి





అధ్యక్షులుగా కొనసాగుతూ గుట్టు చప్పుడు కాకుండా మార్చుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వన సంరక్షణ సమితికి నిధులు కేటాయిస్తే గ్రామ సభ నిర్వహించి సభ్యుల అనుమతితో ఖర్చు చేయాల్సి ఉండగా ఎటువంటి గ్రామసభ నిర్వహించకుండానే సొమ్ము కైకేర్యం చేశారని ఆయన ఆరోపించారు.

**రేంజర్ వివరణ**

ఈ విషయం నూజివీడు రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ ను ప్రభాతవార్త వివరణ కోరగా రికార్డులు పరిశీలించి సొమ్ము స్వాహా అయితే రికవరీ చేస్తామని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

# దీపావళి టపాసుల పై జిల్లా కలెక్టర్, ఎస్పిల హెచ్చరికలు

భీమవరం అక్టోబర్ 7 ప్రభాతవార్త :నిబంధనలకు విరుద్ధంగా దీపావళి టపాసులు అమ్మకాలు నిర్వహించే షాపులపై చర్యలు తప్పవని,షాపులలో మందు గుండు సామాగ్రి అమ్మకానికి పిల్లలను, బాల కార్మికులను వినియోగిస్తే చర్యలు తీవ్రంమని,లైసెన్సు లేకుండా ఏ విధమైన టపాసులు తయారుచేసిన కఠిన చర్యలు తీసుకుంటామని, గతంలో లైసెన్సులు పొంది ప్రస్తుతం రెన్యువల్ కానీ ముందుగుండు సామాగ్రి షెడ్లను క్షేత్రస్థాయిలో పోలీస్, రెవిన్యూ శాఖలు విధిగా తనిఖీసి ధ్రువీకరించాలని,నిబంధనలు మీరిన మందు గుండు సామాగ్రి తయారీ, అమ్మకం షాపులపై చర్యలకు అలసత్వం వహించే అధికారులను ఉపేక్షించేది లేదని, ఏదైనా సంఘటన జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను హెచ్చరించారు.జిల్లాలో దీపావళి టపాసులు తయారీ, అమ్మకాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిబంధనల మేరకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు దీపావళి టపాసులు తయారీ, అమ్మకాలకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా వివిధ శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్



నయీం అస్మి మాట్లాడుతూ నిబంధనల మేరకు దీపావళి టపాసుల షాపులను నిర్వహించాలని, తనిఖీలలో లోటుపాట్లు ఉంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీస్, రెవిన్యూ, అగ్నిమాపక శాఖలు ఉమ్మడి తనిఖీలు ఉంటాయని, చిన్నపిల్లలను టపాసులు విక్రయించే షాపులలో ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, దాసి రాజు, ఎస్.బి సిఐ వి వి ఎన్ సత్యనారాయణ, డిపిఓ రామనాథరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ జి స్వాతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎనలిస్ట్ సిహెచ్ తేజస్వి, భీమవరం సహాయం మున్సిపల్ కమిషనర్ రాంబాబు, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వై.వి జానకిరామ్, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ వి.వి.నాగరాజరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్, తదితరులు పాలొన్నారు.

# చాట్రాయి అంబులెన్స్ లేక మూడు మాసాలు

## - మర్మతులకు వెళ్లిందంటున్న అధికారులు
## - ఆపద సమయంలో ప్రజల అవస్థలు

చాట్రాయి,అక్టోబర్ 6, ప్రభాతవార్త : కాట్రాయ్ మండలానికి సంబంధించిన అంబులెన్స్ లేక మూడు మాసాలు పూర్తయింది. మర్మతులకు వెళ్లిందని అధికారులు చెప్తుండగా ప్రజలకు ఆపద సమయంలో అందుబాటులో అంబులెన్స్ లేక నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఉపయోగపడే అంబులెన్స్ మరమ్మతుల కోసం మూడు నెలలు పాటు లేకుండా ఉండటం పై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లాకు మారుమూల మండలమైన చాట్రాయి మండలంలో అంబులెన్స్ లేకపోతే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. గత మూడు మాసాల నుండి తీవ్ర అస్వస్థకు గురైన వారు 108కు ఫోన్ చేస్తే చాట్రాయ్ అంబులెన్స్ లేదని విసన్నపేట నుండి గాని చింతలపూడి నుండి గాని వస్తుందని సమాధానం చెబుతున్నారని అక్కడనుండి చాట్రాయికి వచ్చేసరికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇటీవల చెన్నంపేటలో పాముకాటుకు ఓ మహిళ గురికాగా అంబులెన్స్ లేకపోవడంతో చాట్రాయి ప్రభుత్వ





ఆసుపత్రికి వచ్చేసరికి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా మండలంలో అన్ని గ్రామాల ప్రజలు అంబులెన్స్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. ప్రాణాలు కాపాడే అంబులెన్స్ కు మరమ్మతులు చేయడం పై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ఉన్నతాధికారులు స్పందించి అంబులెన్స్ కు మర్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

# ఈనెల 13వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు,

పెనుమంట్ర ప్రభాతవార్త : మండలంలోని మార్టేరు (శివరాపేట) గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి సోమవారం (ఈనెల 06వ తేదీ) జరగవలసిన ఉండగా అనివార్య కారణాల వల్ల రద్దు అయినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తేతలి రాజారెడ్డి తెలిపారు. ఈ ఊరేగింపు మరల 13వ తేదీ సోమవారం నిర్వహించనున్నామని తెలిపారు. అదేవిధంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, దెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్ : 9704502377

# చెరుకుగడల అలంకరణలో శ్రీ అభయాంజనేయ స్వామి దర్శనం,





పెనుమంట్ర-ప్రభాతవార్త :మండలంలోని మార్టేరు జెడ్ వంతెన దగ్గర వేంచేసిన శ్రీ ఆంజనేయ స్వామిని ఎంతో ప్రీతిపాతికమైన మంగళవారం నాడు చెరుకు గడల తో ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అర్చకులు విజయ గోపాలచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యుల్లో ఒకరైన కర్రి అచ్చుత రామారెడ్డి మాట్లాడుతూ ప్రతి మంగళవారం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్నారని తెలిపారు. ఈ అలంకరణకు సహకరిస్తున్న భక్తులకు కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భక్తులు కు పతి మంగళవారం రుచికరమైన ప్రసాదం అందజేస్తున్నారు.

# గణపవరంలో ఆశాడే



అత్తిలి/ గణపవరం అక్టోబర్ 7( ప్రభాతవార్త):గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశాడే సమీక్ష సమావేశం ఆశా కార్యకర్తలకు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ లకు ,ఏ ఎన్ ఎం లకు నిర్వహించారు. భీమవరం డి పిఎం ఓ డాక్టర్.సి హెచ్. ధన లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలో ఉన్న గృహములను తప్పనిసరిగా సందర్శించి కీటక జనిత వ్యాధులపై అనగా మలేరియా డెంగు చిగునుగునియా వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే కొన్ని వ్యాధులు రాకుండా కాపాడుకోను వచ్చినని తెలియజేశారు. గర్భిణీ స్త్రీలు రక్తహీనత లేకుండా ఆకుపచ్చని ఆకుకూరలు తీసుకొనెల చూడాలన్నారు. ఎన్ సి డి సర్వే ప్రతిరోజు సచివాలయములలో చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు, ఆశ నోడల్ అధికారి సి వి. సత్య వతి, బాల మురళికృష్ణ, పద్మజ, ఆశా కార్యకర్తలుపాల్గొనినారు.

# జీఎస్టీ పన్ను విధానం వల్ల అటు దేశానికి, ఇటు సామాన్యులకు ఎంతో మేలు



భీమవరం అక్టోబర్ 7 ప్రభాతవార్త :కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ పన్ను విధానం వల్ల అటు దేశానికి, ఇటు సామాన్యులకు ఎంతో మేలు కలుగుతోందని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో కేజీఆర్ఎల్ కళాశాలలో మంగళవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ఐ శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ అనేక వస్తువులు సేవలపై పూర్తిగా పన్ను తొలగించి జీరో జీఎస్టి విధానాన్ని తీసుకువచ్చారని, లగ్జరీ, ఆరోగ్యానికి, కొన్ని వస్తువులు, వినోదాలపై ప్రత్యేక పన్ను విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తగ్గించిన శ్లాబ్లతో అటు వాణిజ్య వ్యాపార వర్గాలు, ఇటు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఆనందోత్సవాలు వెల్లడౌతున్నాయన్నారు. జీఎస్ట అమలు తరువాత ధరలు తగ్గుముఖం పట్టడం ప్రజల్లో ఆనందం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్లు మురళీ మోహన్, మెంటే అప్పారావు కే మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెర




## స్టార్ హీరో సరసన సమంత?

నేషనల్ అవార్డ్ విన్నర్ వెట్రిమారన్ దర్శకత్వంలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు ఓ సినిమా చేయనున్నారని గత కొంత కాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. నేషనల్ అవార్డ్ విన్నర్ వెట్రిమారన్ దర్శకత్వంలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు ఓ సినిమా చేయనున్నారని గత కొంత కాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడా వార్తలను నిజం చేస్తూ మేకర్స్ సినిమాను అనౌన్స్ చేస్తూ టైటిల్ ను రివీల్ చేశారు. వెట్రిమారన్ శింబు కలయికలో వస్తున్న ఈ సినిమాకు ఆరసన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు దర్శకనిర్మాతలు. శింబు49గా ఆరసన్ శింబు కెరీర్లో 49వ చిత్రంగా వస్తోన్న ఈ మూవీని ప్రముఖ నిర్మాత కళైపులి థాను నిర్మిస్తుండగా, సౌత్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో శింబు సరసన హీరోయిన్‌గా సౌత్ స్టార్ హీరోయిన్ సమంతను తీసుకోవాలని మేకర్స్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగా మేకర్స్ సమంతతో చర్చలు ప్రారంభించారని టాక్ వినిపిస్తోంది. శింబు సరసన సమంత? అయితే ఆ డిస్కషన్స్ ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయని, ఒకవేళ అన్నీ కుదరి, సినిమా కార్యరూపం దాల్చితే శింబు, సమంత కలిసి చేయబోయే మొదటి సినిమా ఇదే అవుతుంది. ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మయోసైటిస్ వ్యాధి వల్ల కొంతకాలం పాటూ సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు తిరిగి సినిమాలను చేస్తున్నారు. వడ చెన్నై యూనివర్స్ లో భాగంగా ఆరసన్ అయితే గతంలో లాగా ఎక్కువ సినిమాలు చేయడం లేదు సమంత. సినిమాల విషయంలో ఆచితూచి వ్యవహారిస్తున్న సమంత మళ్లీ చాలా కాలం తర్వాత తమిళంలో సినిమా చేయబోతుందన్న వార్త విని ఆమె అభిమానులు సంతోషిస్తున్నారు. కాగా ఆరసన్ మూవీని వెట్రిమారన్ వడ చెన్నై యూనివర్స్ లో భాగంగా రూపొందించనున్నట్టు ఇప్పటికే వెల్లడించారు. ఈ యూనివర్స్‌లో మరిన్ని సినిమాలు రానున్నాయని సమాచారం. వెట్రిమారన్, శింబు ఇద్దరూ మంచి టాలెంటెడ్ పర్సన్స్ కావడంతో వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమాపై మంచి అంచనాలున్నాయి.

## 'చాంపియన్' డిసెంబరు 25న వరల్డ్ వైడ్ రిలీజ్

రోషన్, ప్రదీప్ అద్వైతం, స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, జీస్టూడియోస్ ఛాంపియన్ యంగ్ హీరో రోషన్ తన లేటెస్ట్ ఫిల్మ్ ఛాంపియన్‌తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఛాంపియన్ ఫస్ట్ లుక్, ఆసక్తికరమైన టీజర్ గ్లింప్స్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సైమల్టేనియస్ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. "చాంపియన్" డిసెంబర్ 25న, క్రిస్మస్ సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. పండుగ సీజన్, న్యూఇయర్ హాలిడేలలో వస్తున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ బిగ్ బూస్ట్ ఇవ్వనుంది. రిలీజ్ పోస్టర్‌లో రోషన్ లాంగ్ డార్క్ ఓవర్‌కోట్, బెల్టెడ్ వెయిస్ట్‌తో క్లాసీ లుక్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ నుంచి బయటకు అడుగుపెడుతూ హీరోయిక్ ఎంట్రీ ఇవ్వడం అదిరిపోయింది. ఈ సినిమాలో రోషన్ ఇప్పటివరకు చేయని విభిన్న పాత్రలో కనిపించబోతున్నాడు.



పాత్రకు సరిపోయేలా ఆయన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ఆర్.మధీ, మిక్కీజే మేయర్ మ్యూజిక్, ఆర్ట్ డైరెక్షన్‌కి తోటతరణి వంటి పెద్ద టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. షూటింగ్ పూర్తి కాగానే సినిమా టీమ్ మ్యాసివ్ ప్రమోషన్లతో ప్రేక్షకుల్లో మరింత ఎక్సయిట్మెంట్ క్రియేట్ చేయడానికి రెడీ అవుతున్నారు.

తారాగణం: రోషన్, అనశ్వర రాజన్‌సాంకేతిక సిబ్బంది:ప్రొడక్షన్ బ్యానర్స్: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్: క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్:ప్రెజెంట్స్: జీ స్టూడియోస్: దర్శకత్వం: ప్రదీప్ అద్వైతం, డిఓపి : ఆర్ మదీ సంగీతం: మిక్కీ జె మేయర్

ఆర్ట్ డైరెక్టర్: తోటతరణిపిఆర్ఓ : వంశీశేఖర్.

## నా కెరీర్‌లో అక్టోబరు నెలను మరిచిపోలేను

**వరుణ్ సందేశ్**

దాదాపు పద్దెనిమిది ఏళ్ల క్రితం నేను నటించిన తొలి చిత్రం "హ్యాపీడేస్ 2007లో ఇదే నెలలో విడుదలై, ఘన విజయం సాధించి, నా కెరీర్ నే మలుపు తిప్పింది. అందుకే నాజీవితంలో అక్టోబర్‌మాసంగుర్తుండి పోయింది. ఇప్పుడు ఈచిత్రంకూడాఇదేనెలలో విడుదలవుతుండటం తో ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయి" అని హీరో వరుణ్ సందేశ్ అన్నారు. వరుణ్‌సందేశ్, మధులిక వారణాసి జంటగా జాగృతి మూవీమేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకుసిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని ప్రసాద్‌ల్యాబ్‌లోప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సమాజంలో జరుగుతున్న అంశాల ప్రేరణతో ఈ చిత్రాన్ని మలచడం జరిగింది. కమర్షియల్, ఎంటర్టైన్మెంట్, సందేశంవంటి అంశాలను మిళతం చేసి రూపొందించడం జరిగింది అని అన్నారు. నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ, ఈ చిత్రానికి సెన్సార్ యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఈ నెల 10న చిత్రాన్ని భారీగా విడుదల చేయబోతున్నాం. ఒక అమ్మాయికి అవమానం జరిగితే దాని పరిణామాలు ఎలా ఉంటాయి అన్న అంశాన్ని చూపించాం. అమ్మాయిలతో పాటు తల్లి తండ్రులు కూడా ఈ సినిమాను చూడాలి" అని అన్నారు. దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. మాట్లాడుతూ, ట్రైలర్, పాటలకు వచ్చిన స్పందన సినిమా పట్ల మా నమ్మకాన్ని పెంచింది. నిర్మాత కథను నమ్మి స్వేచ్ఛ ఇవ్వడం వల్లనే ఈ సినిమా తెరపైకి వచ్చింది" అని అన్నారు. ఈ వేడుకలో యువ హీరోలు అర్జున్, కార్తీక్ రాజు, విశ్వకార్తికేయ, ఇంకా సునామీ సుధాకర్, దువ్వాసి మోహన్, కెమెరామెన్ హాజరత్, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, సహ నిర్మాతలు నికిత జగదీష్, కుపేంద్ర పవర్, ఇతరయూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈచిత్రంలోని ఇతరముఖ్య పాత్రలలో దువ్వాసి మోహన్, సూర్య, రవివర్మ, మురళీధర్ గౌడ్, బలగం జగదీష్, ప్రభావతి, కల్పలత, నిత్యశ్రీ, శ్రీభవ్య తదితరులు తారాగణం. ఈచిత్రానికి కెమెరా; హాజరత్ షేక్ (వలి), సంగీతం: సుభాష్ ఆనంద్, ఎడిటింగ్: వర ప్రసాద్, బి.జి.ఎం.:గ్యాని, ఆర్ట్: వి.నాని, పండు, మాటలు:శ్రీనివాస్ తేజ, పాటలు: రామారావు, శ్రీనివాస్ తేజ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : మిట్టపల్లి జగ్గయ్య, సహనిర్మాత: బి నికిత జగదీష్, కుపేంద్ర పవర్, నిర్మాత; బలగం జగదీష్, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం; ఆర్యన్ సుభాన్ .ఎస్.కె.



## 'రీ ర్యాంప్' 18న విడుదల



సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం హెవీ ఎంటర్ టైనర్ "రేర్యాంప్" మూవీ నుంచి థర్డ్ సింగిల్ టిక్కల్ టిక్కల్.. రిలీజ్, ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న సినిమా.. సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "రేర్యాంప్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. "రీ ర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ ఖిటిక్కల్ టిక్కల్..ఖి విడుదల చేశారు. చేతన్ భరద్వాజ్ ఎనర్జిటిక్ ట్యూన్ తో కంపోజ్ చేసిన 'టిక్కల్ టిక్కల్.' పాటకు సురేంద్ర కృష్ణ లిరిక్స్ రాశారు. సాయి చరణ్ భాస్కరుని పాడారు. 'టిక్కల్ టిక్కల్ పాట ఎలా ఉందో చూస్తే. టిక్కల్ టిక్కల్, ధమాల్ ధమాల్' కలిసి వచ్చే కాలం ముందు నువ్వు సూపర్ రా.. టైమ్ కాస్త బ్యాడ్ అయితే కె ర్యాంప్ రా..ఫ్లవర్ లాంటి లవర్ ఉంటే లైఫ్ సూపర్ రా, ఫ్లవర్ కాస్త ఫైర్ అయితే కె ర్యాంప్ రా, ఒక్క పెగ్ కిక్కు ఇస్తే నువ్వు సూపర్ రా, ఫుల్ కొట్టినా పిచ్చి పడితే కె ర్యాంప్ రా. అంటూ లవర్, లైఫ్ మధ్య హీరో ఎలా నలిగిపోయాడో చూపిస్తూ ఆకట్టుకునేలా సాగుతుంది పాట. నటీనటులు కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు.

## 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక



ప్రముఖ నిర్మాత బన్నీవాస్ స్థాపించిన బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ పతాకాలపై అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి' . సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఈ వినోదభరిత చిత్రానికి నూతన దర్శకుడు విజయేందర్‌ఎస్‌దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వెండితెరపై నవ్వుల టపాసులు పేల్చడానికి, దీపావళి కానుకగా అక్టోబర్ 16న 'మిత్ర మండలి' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, మూడు పాటలు విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. ఇప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తూ ట్రైలర్ వచ్చింది.

హైదరాబాద్‌లోని ఏఏఏ సినిమాస్‌లో 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందం ఈ వేడుకలో పాల్గొని, ట్రైలర్ ఆవిష్కరణ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'మిత్ర మండలి' ట్రైలర్ నవ్వులతో నిండిన ప్రయాణాన్ని సూచిస్తుంది. విచిత్రమైన పాత్రలు, కడుపుబ్బా నవ్వించే హాస్యంతో తక్షణమే ఈ ట్రైలర్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రధాన పాత్రధారులు ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా వింతైన పరిస్థితుల్లో చిక్కుకున్న విచిత్రమైన వ్యక్తులుగా కనిపిస్తున్నారు. వారి మాటలు, చేష్టలు నవ్వుల జల్లు కురిపిస్తున్నాయి. అతిశయోక్తి పరిస్థితులు మొదలు, మీమ్స్‌కు తగిన క్షణాల నుండి తెలివైన మీమ్ రిఫరెన్స్‌ల వరకు, ట్రైలర్ గందరగోళం, హాస్యం మేళవింపుతో ఆద్యంతం వినోదభరితంగా సాగింది. ప్రియదర్శి మరోసారి ప్రేక్షకుల మెచ్చే పాత్రలో కనిపించగా, విష్ణు ఓఐ, ప్రసాద్ బెహరా తమదైన హాస్యంతో ఆకట్టుకున్నారు. ఒక విచిత్రమైన పోలీసు పాత్రలో వెన్నెల కిషోర్, ముఖ్యమైన పాత్ర సత్య, సరదాఅతిథిపాత్రలో అనుదీప్ కె.వి.కనిపిస్తున్నారు. ఈ తమదైన ప్రత్యేక శైలి హాస్యంతో వీరు వినోదాన్ని రెట్టింపు చేశారు. 'మిత్రమండలి'చిత్రం హాస్యం, యువత అల్లరి, రహస్యాన్ని సమానస్థాయిలో మిళితం చేసినట్లు కనిపిస్తుంది. అద్భుతమైనవిజువల్స్, ఆకర్షణీయమైన సంభాషణలు, అంతటా సరికొత్త వినోదాన్నిపంచుతూ, ఒకపరిపూర్ణ దీపావళిఎంటర్‌టైనర్‌గా 'మిత్ర మండలి'రూపుదిద్దు కుంటున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తుంది. 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో చిత్ర కథానాయకుడు ప్రియదర్శి మాట్లాడుతూ, "థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులు సంతోషంగా నవ్వుకొని బయటకు వెళ్ళాలనే ఉద్దేశంతో 'మిత్ర మండలి' సినిమా చేశాము. జాతిరత్నాలకు రెట్టింపు నవ్వులు పంచి, ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇవ్వబోతున్నాము. నలుగురు స్నేహితులు కూర్చొని, సరదాగా మాట్లాడుకుంటే ఎలాంటి ఆనందం కలుగుతుందో. అలాంటి ఆనందాన్ని ఈ సినిమా కలిగిస్తుంది' .

## జోరు పెంచిన 'మాస్‌జాతర'



మాస్ మహారాజా రవితేజ అభిమానులతోపాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం'మాస్‌జాతర'. రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్య దేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హాస్యం, భావోద్వేగాలు మాస్ అంశాలతో నిండిన వినోదభరితమైన కుటుంబ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న "మాస్ జాతర" సినిమా, భారీ అంచనాల నడుమ అక్టోబర్ 31న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలకు విశేష స్పందన లభించింది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఈ క్రమంలోనే తాజాగా సుమతో కలిసి ఒక ఉల్లాసమైన, వినోదాత్మక సంభాషణలో చిత్ర బృందం పాల్గొంది. మాస్ జాతర సినిమా ఎంత ప్రత్యేకమైనదో తెలిపేలావీరి సంభాషణ సాగింది. రవితేజ ఈ సినిమాలో తాను పోషించిన ఆర్‌పిఎఫ్(రైల్వే పోలీస్ ఫోర్స్) అధికారి పాత్ర గురించి మాట్లాడుతూ, ఇది తన సినీ ప్రయాణంలో సరికొత్త, ప్రత్యేకమైన పాత్ర అని అభివర్ణించారు. అలాగే చిత్ర దర్శకుడు భాను భోగవరపు, సంగీత దర్శకుడు భీమ్స్‌సిసిరోలియోపై ప్రశంసలు కురిపించారు. భానుప్రతిభావంతుడని, చిత్రీకరణ సమయంలో కూడా సన్నివేశాన్ని ఇంకా మెరుగ్గా మలచడానికి ప్రయత్నిస్తుంటాడని, చాలా వేగంగా మార్పులు చేయగలడని కొనియాడారు భీమ్స్ ఎంతో కృషి చేసి, ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించాడని అన్నారు. ఇక మాస్ జాతర సినిమా గురించి మాట్లాడుతూ, వినోదం, మాస్ అంశాలతో పాటు హృదయపూర్వక కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుందని తెలిపారు. రవితేజతో కలిసి నటించడం చాలా ఆనందకరమైన అనుభవమని శ్రీలీల అన్నారు. రవితేజతో కలిసి పనిచేయడం చాలా సులభంగా ఉంటుందని, అత్యంత ఆహ్లాదకరమైన సహనటులలో ఆయన ఒకరని శ్రీలీల తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'మాస్ జాతర'లో తాను సైన్స్ టీచర్‌గా, శ్రీకాకుళం యాసలో మాట్లాడే ఉల్లాసభరితమైన పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తానని ఆమె వెల్లడించారు. తన మునుపటి పాత్రలకు పూర్తి భిన్నంగా ఇది ఉంటుంది. స్క్రిప్ట్ చదివినప్పుడే తాను నవ్వుకున్నానని, ఇకసెట్‌లో దానిని ప్రదర్శించే సమయంలో ఆ నవ్వులు రెట్టింపు అయ్యాయని శ్రీలీల పేర్కొన్నారు.

## 'అరసన్' టైటిల్ పోస్టర్ రిలీజ్

హీరో సిలంబరసన్ టిఆర్ వెట్రిమారన్, లెజెండరీ నిర్మాత కలైపులి ఎస్. ధాను క్రేజీ కాంబినేషన్ లో రూపొందిస్తున్న చిత్రంకు 'అరసన్' అనే టైటిల్ అనౌన్స్ చేశారు. ఈ టైటిల్ పోస్టర్ రిలీజ్ తో అభిమానుల్లో సందడి నెలకొంది.

ఈ భారీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన పోస్టర్‌లో సిలంబరసన్ టిఆర్ పవర్ ఫుల్ గా కనిపించారు. దర్శకుడు వెట్రిమారన్, నిర్మాత కలైపులి ఎస్. ధాను లాంటి క్రేజీ కాంబినేషన్ లో రావడంతో సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. త్వరలోనే చిత్రంలోని ఇతర నటీనటులు, టెక్నికల్ టీం వివరాలు మేకర్స్ త్వరలో తెలిజేస్తారు.

పాన్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకున్న సిలంబరసన్ టిఆర్, ఇప్పుడు 'అరసన్'గా వెండితెరపై అలరించడాన్నికి సిద్ధమవ్రతున్నారు. ఈ సినిమా ఆయన కెరీర్ లో మరో మైల్ స్టోన్ మూవీగా నిలవనుంది.



## 'తెలుసు కదా' హానెస్ట్ ఎమోషన్స్ ఉన్న సినిమా




మిరాయ్ లాంటి పాన్‌ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా. స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తెలుసు కదా అక్టోబర్ 17న గ్రాండ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ నీరజ కోనవిలేకరుల సమావేశంలో సినిమావిశేషాలు పంచుకున్నారు.

**తెలుసు కదా ఎలా ఉండబోతుంది?**

ఇది ఒక లవ్ స్టోరీ. ఇద్దరు మధ్య ఉండే ప్రేమ కథ. ఒక ప్రేమ కథ తో పాటు ఒక కాంప్లెక్స్ సిటీ కూడా వుంది. ఇది క్యారెక్టర్ డ్రివెన్ స్టోరీ. ఇందులో మూడు క్యారెక్టర్స్ కూడా చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ప్రతి క్యారెక్టర్ హానెస్ట్ గా ఉంటుంది. ప్రతి క్యారెక్టర్ ఎమోషనల్ గా కనెక్ట్ అవుతుంది..

**మీరు ఎలా ఈ సినిమాని డీల్ చేశారు?**

ఒక కథ అమ్మాయి రాసిందా అబ్బాయి రాసిందా అనేదానికంటే బాగా రాశారు అన్నదే ఇంపార్టెంట్. నా దృష్టి కూడా కథని హానెస్ట్ గా చెప్పడం పైనే ఉంది. ఈ కథ ఎలాంటి బయోస్ లేకుండా రాసింది. ఈ సినిమాని అబ్బాయి తీసారా అమ్మాయి తీసారా అన్నదానికంటే ఒక గుడ్ ఫిలిం మేకర్ తీసిన సినిమా అని పేరు తెచ్చుకోవడం నాకు ఇష్టం.

**శ్రీనిధి, రాశి గురించి?**

శ్రీనిధి చేసిన రాగ చాలా కాంప్లెక్స్ క్యారెక్టర్. హిట్ 3 కి ముందే ఈ క్యారెక్టర్ చెప్పాను. తను కేజీఎఫ్, హిట్ 3 లాంటి సినిమాలు చేయడం మాకు చాలా హెల్ప్ అయ్యింది. అంజలి క్యారెక్టర్ లో రాశి చాలా అద్భుతంగా నటిచింది. తనది చాలా యూనిక్ క్యారెక్టర్.

**తమన్ మ్యూజిక్ గురించి?**

తమన్ ఫ్యామిలీ ఫ్రెండ్. సినిమాకి తన మ్యూజిక్ బ్యాక్ బోన్. పాటలన్నీ మంచి హిట్ అయ్యింది. రాబోతున్న పాటలు కూడా అద్భుతంగా వుంటాయి. గ్రేట్ ఆల్బమ్ ఇచ్చారు. స్కోర్ బ్యుటీఫుల్ గా వుంటుంది. ఆయన సపోర్ట్ ని మర్చిపోలేను.

**పీపుల్ మీడియా ఫాక్టరీ గురించి?**

విశ్వ ప్రసాద్ లేకపోతే ఈ సినిమా లేదు. కృతి ప్రసాద్ ఈ సినిమాతో చాలా క్లోజ్ అయ్యారు. వారి సపోర్ట్ ని మర్చిపోలేను. ఎక్కడ రాజీపడకుండా సినిమాని నిర్మించారు.

**మీ కొత్త ప్రాజెక్ట్స్ గురించి ?**

ఒక హార్డ్ హిట్టింగ్ లవ్ స్టోరీ చేయబోతున్నా. త్వరలోనే ఎనౌన్స్ చేయబోతున్నాం.

ఆల్ ది బెస్ట్

# పిజి చేసి అంబులెన్స్ డ్రైవర్‌గా..




పిజి చేసి ఉద్యోగం చేసుకోవచ్చు. అయినా జీతం తక్కువ, అమ్మాయిలు అరుదుగా కనిపించే కొలువును ఎంచుకుంది. 'అదే చేస్తా'నంటూ పట్టుబట్టి మరీ చేరింది.. విసువస మేరీ. అందరి ప్రశంసలూ అందుకుంటోంది. చిన్నప్పట్నుంచీ డ్రైవింగ్ అంటే పిచ్చి. దానికి తగ్గట్టే.. 'అమ్మాయిలు ఏది చేయాలనుకున్నా చేయాలి. అప్పుడే ధైర్యంగా జీవించడం అలవాటవు తుంది' అన్న నాన్న ప్రోత్సాహం ఎలాగూ ఉంది. ఇంకేం.. బైకు, కారు వాహనాలు నడపడం నేర్చుకుంది. తనది తమిళనాడులోని మేళపుతుక్కూడి. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పీజీ పూర్తిచేసింది. తన అంకుల్‌కి సాయపడటానికి ట్రక్ నేర్చుకోవడమే కాదు, హెవీ వెహికల్స్ లైసెన్స్ సంపాదించుకుంది. ఓసారి ఎక్కడికో వెళ్లొస్తున్న ఆమెని ఓ ప్రకటన ఆకర్షించింది. అది.... అంబులెన్సులు నడపడానికి డ్రైవర్లు కావాలి' అన్న అడ్వర్టైజ్మెంట్ వెంటనే చేరిపోవడానికి సిద్ధమైంది. దరఖాస్తు వెళితే అంతా ఆశ్చర్యంగా చూశారు. 108 వాహనానికే కాదు, నర్ల కోసమూ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. దీంతో 'నర్సు పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చావా' అనడిగారు. కాదు, అంబులెన్స్ డ్రైవర్‌గా చేరడానికి డ్రైవర్ వచ్చానగానే కొందరు నవ్వేశారు. నేను మాత్రం పట్టుదలగా నిల్చున్నా. అది చూసి కొందరు అధికారులు ప్రోత్సహించారు. అయితే రాతపరీక్షలో అర్హత సాధించాక ఓసారి అంబులెన్స్ నడపమన్నారు. అప్పుడు కాస్త భయమేసింది. ఎంతైనా సాధారణ ఉద్యోగం కాదు కదా.. ప్రాణాలు నలబెట్టేది మరి. కానీ నచ్చిన పని కావడంతో ధైర్యంగా పూర్తిచేశా అనే మేరీ చివరికి కొలువును సాధించేసింది. 'చిన్నమ్మాయివి. పైగా ప్రభుత్వ అంబులెన్స్ అంటే ఎక్కడ ప్రమాదాలు జరిగినా వెళ్లాలి, ఆ రక్తం, గాయాల తీవ్రత చూసి భయమేయదా?' 24 ఏళ్ల మేరీకి చాలామంది నుంచి ఈ ప్రశ్న ఎదురైంది. అయితే మేరీ తండ్రిది చికెన్ వ్యాపారం. చిన్నప్పట్నుంచీ నాన్నకు సాయం చేసేటప్పుడు రక్తాన్ని చాలాసార్లే చూసింది. అందుకే అది తనను భయపెట్టదంటుంది. నిజానికి వాళ్ల నాన్న ఎప్పుడూ 'ఇంకెప్పుడైనా భయపడొచ్చేమో కానీ... ఎవరైనా ప్రాణంకోసం పోరాడుతున్నప్పుడు మాత్రం ధైర్యంగా వాళ్లకి సాయపడ టానికే చూడు' అని చెప్పేవారట. అదే తనను అంబులెన్స్ డ్రైవర్ అయ్యేలా చేసింది అని చెబుతుంది మేరీ. పైగా ఇది ఉద్యోగం కాదు... మానవాళికి చేసే సేవ. కాబట్టే ఇంట్లోవాళ్లూ నా నిర్ణయాన్ని ప్రోత్సహిస్తున్నారని గర్వంగా చెబుతోంది. ఆమెను ఇప్పుడెంతోమంది అభినందిస్తున్నారు. నిజంగా ఆ అమ్మాయి కదూ! నిర్ణయాన్ని మెచ్చుకోవాల్సిందేకదూ! □

# బుజ్జి తల్లికి జాతీయ పురస్కారం



ఉత్తమ నటినటులుగా అవార్డులు అందుకొని మురిసిన వేదుక ఇది. ఈ వేదికపై ఓ ఆరేళ్ల చిన్నారి అందరి దృష్టిని ఆకర్షించింది. 'ఉత్తమ బాల నటి'గా అవార్డు అందుకొని 'టాక్ ఆఫ్ ది టౌన్'గా నిలిచింది. ఆ అమ్మాయి మరెవరో కాదు.. మరాఠీ బాలనటి త్రిష తోసర్. ఇంత చిన్న వయసులోనే తన అద్భుతమైన నటనతో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న త్రిష.. జాతీయ చలనచిత్ర పురస్కారాల చరిత్రలోనే ఈ అవార్డు అందుకున్న అతి పిన్న వయస్కు రాలిగా చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ బాల నటి గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం..

తాజాగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం వేడుకగా జరిగింది. ఈ వేదికపై బాలీవుడ్ నటీనటులు రాణి ముఖర్జీ, షారుఖ్ ఖాన్ అవార్డులు అందుకుంటూ సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఇంతలోనే త్రిష తోసర్ అనే పేరు వినిపించింది. ఎవరీమె అని అందరూ ఆసక్తిగా చూస్తుండగానే ఆరేళ్ల ఈ అమ్మాయి స్టేజి పైకి వెళ్లి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఖఉత్తమ బాల నటిఖగా అవార్డు అందుకుంది. ఖనాల్2ఖ సినిమాలో తన నటనకు గాను ఈ అత్యుత్తమ పురస్కారం త్రిషను వరించింది. దీంతో ఈ చిన్నారి పేరు ప్రస్తుతం దేశమంతా మార్మోగుతోంది.

**చీరకట్టుతో కట్టిపడేసి..!** సాధారణంగా జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం వంటి వేడుకలకు సంప్రదాయబద్ధమైన దుస్తుల్లోనే ఎంచుకుంటుంటారు చాలామంది తారలు. అందు లోనూ ప్రాధాన్యమిస్తారు. త్రిష కూడా ఇదే చేసింది. ఇంత చిన్న వయసులో షారీ అవార్డు అందుకోవాలనుకున్న ఆమె.. గోల్డ్ కలర్ ప్రిస్టిచ్డ్ శారీని ధరించింది. స్టైలిష్ హెయిర్లెల్లో, క్యూట్ స్మైల్‌తో ముద్దొచ్చేలా ముస్తాబైన త్రిష. రాష్ట్రపతి చేతుల మీదు అవార్డు అందుకొని ఎంతో మురిసిపోయింది. ఆపై అక్కడి కొచ్చిన నటినటులందరితో కలి ఫొటోలకు పోజులిస్తూ సందడి చేసింది. వీరంతా ఈ చిన్నారి ప్రతిభను, సక్సెస్‌ను కొనిందా ఇలా వీళ్లతో దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి.

**'చీవీ' పాత్రలో..!** నాలుగేళ్ల వయసులోనే సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన త్రిష. 'పెట్ పురాణంఖి, 'మాన్వత్ మ వంటి సీరియల్స్ గుర్తింపు తెచ్చుకుంది. ఆపై పున్హా శివాజీ రాజే భోసలే' అనే సినిమాలో కనిపించిన ఈ బాల నటి.. రెండేళ్ల క్రితం విడుదలైన 'నాల్' చిత్రంతో సక్సెస్‌ను అందుకుంది. ఇందులో 'చిమీ' అనే గ్రామీణ నేపథ్యంలో పుట్టిపెరిగిన అమ్మాయి పాత్రలో నటించింది త్రిష. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యం, తోబుట్టువులతో ఉండే సంబంధ బాంధవ్యాలె ఇతివృత్తంగా రూపొందించిన ఈ సినిమాలో తన అమాయ కత్వం, పరిణతితో కూడిన నట అందరినీ కట్టిపడేసింది. ఇలా తన అద్భుతమైన నటనతో జాతీయ పురస్కారం



అందుకున్న చిన్నారి.. ఇందులో భాగంగా 'గోల్డెన్ లోటస్ అవార్డు', సర్టిఫికెట్, నగదు బహుమతిని అందుకుంది.

**నాలుగేళ్లకే ఎంట్రీ!** నటనపై నాకున్న ఆసక్తితో ఇటువైపుగా అడుగులేశా. మా అమ్మానాన్నలూ ఈ వి నన్ను ప్రోత్సహించారు. చిన్న వయసులోనే జాతీయ పురస్కారం అందుకోవడం అనిపిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రపతి ప్రశంసించడం మర్చిపోలేను.. 70 ఏళ్ల జాతీయ పురస్కారాల చరిత్రలో ఈ అవార్డు అందుకున్న అతి పిన్న బాల నటిని నేనే అని నాతో చెప్పింది. ఇది విన్నాక చెప్పలేనంత సంతోషం కలిగింది. భవిష్యత్తులోనూ ఆ కొనసాగిస్తూనే, ఇటు సినిమాల్లో రాణిస్తా.. అంటూ తన ముద్దుముద్దు మాటలతో వారందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది త్రిష.

# పొగడ్తలోనూ స్వాంతన !

'ఫస్ట్ర్యాంకుకు రెండు మార్కులు తగ్గితే కోప్పడతావు. ఇన్ని మార్కులు తెచ్చుకున్నానని ప్రశంసించవు ప్రతి సారీ వంద శాతం వస్తేనే.. అంటారు కొంత మంది తల్లులు. పిల్లలను పొగిడితే చెప్పినమాట వినరు అనుకోకుండా సందర్భంబట్టి కాస్తంత పొగిడి చూడండి అంటున్నారు నిపుణులు. అది వారికి ప్రోత్సహించి లక్ష్యసాధనవైపు నడిపించేలా ఉండాలట. అలాగే పొగడ్తకూ ఒక లెక్క ఉందట.



పిల్లలు సంతోషిస్తారని లేదా పొగడ్త ఇవ్వకపోతే బాధపడతారని కాకుండా నిజాయితీగా ప్రశంసించాలి. అది కూడా నిర్దష్టంగా ఉండాలి. తను చేసిన పని వల్ల లేదా చదువులో ముందుండటంతో కలిగే ప్రయోజనాలను వివరించి పొగడాలి. భవిష్యత్తులో ఈ మార్గాన్నే అనుసరించాలనే సూచన పిల్లల మెదడుకు చేరాలి.

- ఇతరులపై తను చూపించే ప్రేమ, పక్కవారికి సాయం చేసే గుణం వంటివి ప్రదర్శించినప్పుడు మీ పొగత్తన తప్పనిసరి. మున్ముందు కూడా ఆ తత్వాన్ని అలవరుచుకోవడం ఎంత మంచి విషయమో చెప్పి మరీ ప్రశంసించాలి.
- పిల్లలు కష్టపడి ప్రయత్నిస్తు న్నప్పుడు ప్రశంస ప్రోత్సాహపూర్వకమైనదిగా ఉండాలి. ప్రశంసాపూర్వకమైన చిన్న సంజ్ఞ కూడా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.
- మంచి పని చేసినప్పుడే కాదు. వాళ్లల్లో ప్రతికూలమైన ప్రవర్తన కనిపించినప్పుడు కూడా సానుకూల శ్రద్ధ కనబరుస్తూ ప్రశంసలు కలపాలి. ఎలాగంటే, గతంలో నువ్వెంతో మంచిగా ఉన్నావు. ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తున్నావు అని విమర్శనాత్మకంగా లేదా గట్టిగా అరవకుండా, అదే పదాలను మృదువుగా చెప్పాలి. పిల్లలు ప్రతికూల అభిప్రాయాలకంటే, అందులోని ప్రశంసకే స్పందిస్తారు.
- అతిగా ప్రశంసించడం నివారించుకోవాలి. అతిశయోక్తి చేయకూడదు. ఎందుకంటే ఇది నిజమైన పొగడ్త ప్రాముఖ్యతను తగ్గిస్తుంది.
- మనకు నచ్చింది చేశారని కాకుండా, పిల్లల తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలు వారి లోఁ్యన్ని సాధింఒచగలరనే నమ్మకం కలిగినప్పుడు ప్రశంసించాలి. అది వాళ్లలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగే నైపుణ్యాలను పెంచుతుంది. □

# రూమ్‌మేట్‌తో గొడవలు రాకుండా ..

వృత్తి ఉద్యోగాలు, పైచదువుల రీత్యా పట్టణాలు, నగరాలకు వచ్చిన అమ్మాయిలు హాస్టళ్లలో లేదా ప్రత్యేకంగా గదులను అద్దెకు తీసుకుంటే మామూలే! అయితే ఇలా గదిని పంచుకున్న రూమ్‌మేట్‌తో ఎంత స్నేహపూర్వకంగా ఉన్నా.. అప్పుడప్పుడూ కొన్ని విషయాల్లో భేదాభిప్రాయాలు, చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అందుకే ఇద్దరి మధ్య దూరం పెరుగుతుంది. ఇది వ్యక్తిగతంగా కాకుండా, మానసిక ఆరోగ్యం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. మరి, అలా జరగకుండా రూమ్‌మెట్‌తో కలిసినప్పుడు కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం ..



**ప్రైవసీని హరించద్దు ! ..** స్నేహితురాలితో కలిసున్నా, కుటుంబ సభ్యుల మధ్య ఉన్నా.. ప్రతి ఒక్కరికీ ప్రైవసీ ముఖ్యం. ఈ కోసం తమకంటూ కొంత ప్రత్యేక సమయం కేటాయించు కుంటారు. ఇలాంటప్పుడు ఎదుటి వారికి భంగం కలిగించకుండా మంచిదంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. మీ రూమ్మేట్ ఫ్రెండ్/ కొలీగ్ మీ గదికి వచ్చారనుకోండి.. అనవసరంగా వాళ్ల మాటల్లో తలదూర్చడం, వాళ్ల చర్చకు అంతరాయాన్ని కలిగించడం సబబు కాదు. మీ రేమ్‌మేట్ మీపై ప్రతికూల భావన ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి వాళ్లను స్వేచ్ఛగా వదిలేసి మీ పని మీరు చేసుకోండి. అలాగే మీకు వీలైతే వచ్చిన భోజనానికి ఓ కప్పు కాఫీ/టి అందించినా తప్పు లేదు. ఈసారి మీరు ఇలా చేస్తే.. మీకు సంబంధించిన వాళ్లెవరైనా మీ గదికి వస్తే మీ రూమ్‌మేట్ కూడా మీకు సహాయపడుతుంది. తద్వారా ఇద్దరి మధ్య చెలిమి పెరుగుతుంది.



**కలిసి పంచుకోవాలి !** చాలామంది రూమ్ మేట్స్‌కి పేచీ వచ్చేది. ఇంటి పనుల దగ్గరే! ప్రత్యేకించి హాస్టల్ కాకుండా, విడిగా గది/ఫ్లాట్ అద్దెకు తీసుకునేవారి విషయంలో ఇది బాగా వర్తిస్తుంది. సమయం లేక వీలు పడకో.. ఒక్కోసారి ఒకరి పైనే పనుల భారం పడచ్చు.. దానివల్ల 'అన్నీ నేనే చేయాలా?' అన్న ఆలోచన అవతలి వారి మనసులో మొదలవుతుంది. ఇద్దరి మధ్య దూరం పెరగడానికి ఈ ఒక్క ఫీలింగ్ చాలు! అందుకే అన్ని పనులన్నీసమానంగా పంచుకోవాలి. ఇలా మిత్రులు ఇద్దరూ పనుల్ని సమన్వయం చేసుకోగలిగితే.. ఏ గొడవా ఉండదు.

**ఖర్చు.. సరిమానంగా!** ఆర్థిక విషయాల్లో కూడా కొంతమంది రూమ్‌మెంట్స్ గొడవలు పడుతుంటారు. నెలవారీ ఖర్చుల్లో హెచ్చుతగ్గులున్నాయని ఎడమొహం పెడమొహంగా ఉంటుంటారు. దీనివల్ల ప్రశాంతత కొరవడు తుంది.. ఇద్దరి మధ్య అను బంధమూ దెబ్బతింటుంది. అలా జరగకూడదంటే.. ఇద్దరికీ కలిపి నెలకయ్యే ఉమ్మడి ఖర్చును సగంసగం పంచుకుంటే సరి! వ్యక్తిగత అవసరాల కోసం. ఎవరికి వారే ఖర్చు పెట్టుకుంటారు కాబట్టి ఇబ్బంది ఉండదు. ఇబ్బంది పెట్టద్దు!.... ప్రతి ఒక్కరి అలవాట్లు, అభిరుచులు మీకు ఉంటాయి. ఈ విషయంలోనూ రూమ్‌మేట్స్ ఒకరినొకరు గౌరవించు కోకపోతే తిప్పలు తప్పవంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. మీకు కాస్త ఆలస్యంగా నిద్ర పోయే అలవాటుందనుకోండి.. అదే మీ రూమ్మేట్ ఉదయాన్నే ఆఫీస్కెళ్లాలని త్వరగా పడుకుంటుందనుకోండి. మీరు టీవీ చూస్తూ తన నిద్రకు భంగం కలిగించడం కరక్ట్ కాదు. ఈ ఒక్క విషయమనే కాదు.. బయటి నుంచి ఆర్డర్ చేసే ఫుడ్ విషయంలో కావచ్చు.. ఫోన్లు వాడే విషయంలో కావచ్చు.. ఎవరి సౌకర్యానికి వాళ్లను వదిలేయడం మంచిది. కాబట్టి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు తలెత్తకుండాజాగ్రత్తపడచ్చు.

ఒకవేళ గొడవైతే..! ఎంత స్నేహపూర్వకంగా ఉన్నా, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఎక్కడో ఒక చోట, ఏదో ఒక విషయంలో రూమ్‌తో మనస్పర్థలు రావచ్చు. అలాంటి సమయాల్లో పంతలకు పోకుడా సమస్యను సామరస్యంగా పరిష్కరించు కోవడం మంచిది. ఈ తప్పు ఎవరిదైనా ఎదుటివారికి క్షమాపణ చెప్పడం, అసలు మీరు ఆ సమయంలో ఎందుకలా ప్రవర్తించాల్సి ఉంటుంది వచ్చిందో విడమరిచి చెప్పడంలో తప్పు లేదు. ఇలా రియలైజ్ అవడం వల్ల ఇద్దరి మధ్య సద్దుమణగడమే కాదు.. అను బంధమూ దృఢమవు తుంది. □

# అందుకే 'గుడ్డు' కావాలట..!



ఇతర అల్పాహారాల్లో లభించని పోషకాలు కోడి గుడ్డులో ఉంటాయి. శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు, విటమిన్లు, ఖనిజాలు..ఇవన్నీ ఇందులో పుష్కలంగా లభిస్తాయి. దీనివల్ల గలిగే ప్రయోజనాలు గురించి తెలుసుకుందాం..

- పిల్లలకు అందించే ఆహారంలో కోడిగుడ్డు తప్పనిసరిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో ఉండే విటమిన్ ఎ, ల్యూటిన్, జియాకానసంథిన్.. లాంటి యాంటీఆక్సిడెంట్లు కంటి సంబంధిత సమస్యలు రాకుండా కాపాడడంతో పాటు రేచీకటి నుంచి విముక్తి కలిగిస్తాయి.
- జీవక్రియలు, సక్రమంగా సాగడంతోపాటు ఆరోగ్యంగా ఉండడానికి కోడిగుడ్డులోని ప్రొటీన్లు తోడ్పడతాయి.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ ప్రొటీన్లు, ఖనిజాలు ఉండేకోడిగుడ్డు.. ఎముకలు, కండరాలు.. దృఢంగా తయారు కావడానికి తోడ్పడుతుంది. ఎత్తు పెరిగేందుకు సహాయపడుతుంది.
- శరీరం, గుండె ఆరోగ్యానికి అవసరమైన ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు గుడ్డులో అధిక మొత్తంలో ఉంటాయి.
- ఉదయం పూట ఇతర అల్పాహారానికి బదులు గుడ్డు తీసుకునే వారు బరువు తగ్గుతారని ఓ అధ్యయనంలో వెల్లడైంది.
- శరీరానికి ఎండ తగలకపోవటం, సరైన పోషకాహారం తీసుకోకపోవటం వల్ల ప్రస్తుతం చాలామంది విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. దీంతో అనేక సమస్యలు పొంచి ఉంటున్నాయి. అందువల్ల విటమిన్ డి ఎక్కువగా ఉండే గుడ్డును ఆహారంలో చేర్చుకోవటం మంచిది
- ప్రొటీన్లతో నిండిన గుడ్డులో మనకు అవసరమైన అన్నిరకాల అమైనో ఆమ్లాలు ఉంటాయి. శారీరక శ్రమ అధికంగా చేసినప్పుడు తిరిగి శక్తిని పుంజుకోవటానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. □

# వృద్ధాప్య ఛాయలు రాకుండా..

చాలా మందికి 30 దాటగానే చర్మం ముడతలు పడడం, గీతలు ఏర్పడడం.. వంటి వృద్ధాప్య ఛాయలు కనిపిస్తుంటాయి. ఇక వీటిని కవర్ చేసుకోవడానికి మేకప్‌ను ఆశ్రయించే వారే ఎక్కువ. ఫలితంగా సహజ సౌందర్యం దెబ్బతింటుంది. కానీ తైవాన్ మహిళలకు వయసును దాచుకునే పనే లేదు. మేకప్ అవసరం అంతకన్నా లేదు. ఎందుకంటే అక్కడ అరవై ఏళ్ల అమ్మమ్మలు కూడా అందమైన అమ్మాయిల్లా కనిపిస్తుంటారు. ఈ వయసు లోనూ వారి చర్మం అంత కోమలంగా, ప్రకాశవంతంగా ఉంటుంది మరి! ఇంతకీ, వయసు పెరుగుతున్నా వన్నె తరగని అందంతో ప్రపంచాన్ని ఆకట్టుకుంటోన్న ఈ ముద్దుగుమ్మల సౌందర్య రహస్యాలేంటో తెలుసుకుందాం ..



**సహజసిద్ధమైన పదార్థాలతో...** అత్యవసర నూనెలు, షియా, బటర్, వెదురు, హెర్బల్ టీలు.. వంటి పూర్తిగా సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన సౌందర్య ఉత్పత్తుల్ని వాడడం. ఇంట్లో దొరకే పదార్థాలతోనే తమ అందాన్ని సంరక్షించుకోవడం.. ఈ చిట్కాలే తైవాన్ మహిళల్ని నవయవ్వనంగా ఉంచుతున్నాయట.

**గువా షాతో.. ఇన్‌స్టంట్ అందం....** గువా షా.. క్వార్జ్ లేదా జేడ్ రాయితో తయారుచేసిన ఈ సహజసిద్ధమైన సాధనాన్ని ప్రస్తుతం ప్రపంచమంతా వినియోగిస్తోంది. అయితే నిజానికి ఇది పుట్టింది చైనాలోనే. ప్రాచీన కాలం నుంచే అక్కడ మహిళలు దీన్ని ఉపయోగిస్తున్నారు. తైవాన్ మహిళల సౌందర్య రహస్యమూ ఇదే! కోమలంగా, సున్నితంగా ఉండే ఈ రాయితో ముఖం, మెడపై మర్దన చేసుకోవడం వల్ల.. ఆయా భాగాల్లో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. తద్వారా చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. అలాగే గువా షాతో మర్దన చేసుకోవడం వల్ల మనం ఉపయోగించే సౌందర్య ఉత్పత్తుల్ని చర్మం సులభంగా గ్రహించగలుగు తుందట! తద్వారా ఇన్‌స్టంట్ అందాన్ని సొంతం చేసుకోవచ్చం టున్నారు తైవాన్ ముద్దుగుమ్మలు.



**ఆహారం, వ్యాయామం!** ప్రొటీన్‌లో ఉండే అమైనో ఆమ్లాలు చర్మంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. తద్వారా చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ ప్రయోజనాల్ని పొందడానికే తైవాన్ మహిళలు ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని తమ మెనూలో చేర్చుకుంటారు. ముఖ్యంగా పుట్టగొడుగులు, బ్లాక్‌రైస్, సముద్రపు నాచు, నల్ల నువ్వులు, మచా టీ, గోజీ బెర్రీస్, ఎరుపు రంగు డేట్స్. వంటివి వారి రోజువారీ ఆహారంలో తప్పకుండా ఉంటాయట! అంతే కాదు, నరకమం తప్పకుండా వ్యాయామాలు చేయడం కూడా తమ సౌందర్య రహస్యంలో భాగమే అంటున్నారు తైవాన్ భామలు.

**జుట్టుకు పోషణ :** వివిధ రకాల జుట్టు సమస్యల్ని తగ్గించుకోవడానికి హెయిర్ స్ప్రేలు, షాంపూలు వాడడం మనలో చాలామందికి అలవాటు! కానీ ఎలాంటి జుట్టు సమస్యనైనా సహజసిద్ధమైన పదార్థాలతోనే తగ్గించుకుంటామంటున్నారు తైవాన్ మహిళలు. అల్లంతో ప్రత్యేక పద్ధతుల్లో తయారుచేసిన షాంపూ, పెర్ల్ పౌడర్-రోజ్ వాటర్ కలిపి తయారుచేసిన హెయిర్ మాస్క్. □


ఆధ్యాత్మికం

# శివ రక్ష రుద్రాక్ష

దేవీ భాగవతం, రుద్రా క్షోపనిషత్తు, రుద్ర జాబాలి ఉపనిషత్తు, లింగ, శివ, పద్మ, స్కాంద పురాణాల్లో రుద్రాక్ష గురించి విస్తారమైన వివరణ ఉంది. ఆ కథనాల ప్రకారం త్రిపురాసురుణ్ణి సంహరించడానికి అవసరమైన శక్తి కోసం శివుడు కళ్ల తెరిచి తపస్సు చేశాడు. దీక్ష పూర్తయ్యాక ఒక్క క్షణం కళ్ల మూయగానే ఆ నయనాల్లోంచి కన్నీటి చుక్కలు జారిపడి మొక్కలు మొలిచాయి. అవే రుద్రాక్ష మొక్కలు. రుద్రుని కన్నీటి నుంచి ఉద్భవించినందువల్ల రుద్ర, అక్ష రుద్రాక్ష అనే పేరొచ్చింది. ఇవి శివుడికి ప్రీతికరమైనవి. పరమశివుణ్ణి ఆరాధించేవారు రుద్రాక్షను ధరిస్తారు. వీటిని, స్పృశించిన సత్ఫలితాలు కలుగుతాయని విశ్వసిస్తారు. తమ కోరికలు సాకారం కావాలని ఆశించేవారు, అనారోగ్యంతో బాధపడేవారు, మోక్షం పొందాలనుకునేవారు ఇలా వివిధ ప్రయోజనాల కోసం రుద్రాక్షను ధరిస్తారు. 'బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస.. ఇలా ఏ ఆశ్రమం లోనైనా, స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా ఎవరైనా రుద్రాక్షను ధరించవచ్చు. ఓంకా రాన్ని పఠిస్తూ ధరించడం ఉత్తమం అని శివపురాణం పేర్కొంది. రుద్రాక్షను సాక్షాత్తు శివుడి స్వరూపంగా భావిస్తు న్నారు. ఇదొక అపురూప గింజ ఇది ఉద్వేగా లను నియంత్రించి అంతర్గత శాంతి, ఆనం దాలకు ఆలవాలమవుతుంది. తద్వారా ఆధ్యాతి ్మక చింతన పెంపొందు తుంది. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాలు చేకూం˘తాయి. అదృష్టాన్ని పండించి.. ఆరో గ్యం, ఐశ్వర్యం, సంతోషం, శ్రేయస్సులను అందిస్తుందని చెబుతారు. నుదుట విభూతి రేఖలు, కంఠంలో రుద్రాక్షలు, మనసులో శివనామ జపం ఈ మూడింటికీ అనుబంధం ఉంది. ఇవి శివుడికి ప్రీతికరమైనవి. అందుకే ఈ మూడు లక్షణాలూ ఉన్న వ్యక్తిని దర్శించుకుంటే త్రివేణి సంగమంలో స్నానం చేసినంత పుణ్యఫలం కలుగు తుంది అన్నది పౌరాణి చెబుతున్న మాట. రుద్రాక్షలు ధరించడానికి జాతి, లింగ, వయో భేదాలు లేవు. మానసిక, శారీ స్థితితో సంబంధం లేదు. పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరైనా ధరించవచ్చు. రుద్రాక్షలు మనదేశంలో కేరళ రాష్ట్రంలో, నేపాల్, ఇండోనేషియా దేశాలు, జావాద్వీపంలోనూ లభిస్తాయి. నేపాల్లో దొరికే రుద్రాక్షలను అత్యుత్తమ శ్రేణివిగా పరిగణిస్తారు. రుద్రాక్ష అనగానే ముఖాల గురించిన ఆలోచన మొదలవుతుంది. కాయ ల్లోంచి తీసిన గింజలకు అనుకూలంగా ఉం గీతలనే ముఖాలు అంటారు. ఎన్ని గీతలు కలిగుంటే అన్ని ముఖాల రుద్రాక్ష అంటారు. ఈ ముఖాలు సహజంగానే ఏర్పడతాయి. ఇవి ఒకటి నుంచి పద్నాలుగు వరకూ ఉంటాయి. వీటిలో దాదాపు మూడొం తులు ఐదు ముఖాల పంచముఖి రుద్రాక్షలే ఉంటాయి. రుద్రాక్ష ముఖాల సంఖ్యను బట్టి కనిపిస్తాయని పురాణేతి హాసాలు ఉన్నాయి. వీటిలో ఒకే ముఖం ఉంటే ఏకముఖి రుద్రాక్ష దొరకడం ఇంచుమించు అసాధ్యం. ఇండో నేషియా లో అరుదుగా లభించే ఏకముఖి అర్ధచంద్రాకారం లో ఉంటుంది. దీన్ని 'చంద్రాక్ష, చంద్రముఖి' అని కూడా అంటారు. ద్విముఖి రుద్రాక్షలు గుండ్రంగా, బద్దలా ఉంటాయి. ఇవి కూ అరుదైనవే. ఇష్ మోర్ల రుద్రాక్షలు మిరియపు గింజ పరిమాణం నుంచి, పెద్ద ఉసిరికాయ పరిమాణం వరకూ లభిస్తు న్నాయి. హిందువులు, బౌద్ధులు వీటిని పరమ పవిత్రంగా భావిస్తూ మెడలో మాలలుగా, చేతులకు కంకణాలుగా ధరిస్తారు. శివుణ్ణి ఆరాధించే వారే కాకుండా విష్ణు భక్తులుకూడా రుద్రాక్షలు ధరిస్తాం. □




# కారం బిస్కెట్లు



**కావలసినవి :** బియ్యప్పిండి: కప్పు, మైదాపిండి: పావు కప్పు, ఉప్పు: కొద్దిగా, అల్లంతురుము: చెంచా, కరివేపాకు రెబ్బలు : రెండు: కొత్తిమీర తరుగు: రెండు పెద్ద చెంచాలు, పిచ్చిమర్చి: రెండు, పెరుగు: రెండు పెద్ద చెంచాలు , నూనె: వేయించేందుకు సరిపడా.

**తయారు చేసే విధానం :** బియ్య ప్పిండి, మైదాపిండి, ఉప్పు, ఉల్లం తురుము, పచ్చిమర్చి తరుగు, కొత్తిమీరు, కరివేపాకు ఓ గిన్నెలోకి తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఇందులో పెరుగూ కలిపాక నీళ్లు పోస్తూ పూరీపిండిలా చేసుకోవాలి. స్టౌమీద బాణలి పెట్టి, వేయించేందుకు సరిపడా నూనె వేయాలి. బియ్యప్పిండిని చిన్నచిన్న చపాతీల్లో వత్తి బిస్కెట్లలా కోసుకుని కాగుతోన్న నూనెలో వేసి ఎర్రగా వేయించి తీసుకోవాలి. ఇవి రెండుమూడు రోజుల వరకూ నిల్వ ఉంటాయి. □

## ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్

# వాటర్ పోలోలో భారత్ వరుస ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, వాటర్ పోలోలో భారత పురుషులు వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడిపోయారు. వాటర్ పోలో, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ మూడవ రోజు వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కజకిస్తాన్ చేతిలో భారత పురుషుల వాటర్ పోలో జట్టు 6-20 తేడాతో ఓడిపోయింది. కజకిస్తాన్‌కు చెందిన కరీనా మాగ్రుపోవా, పురుషుల సోలో ఫ్రీలో వరుసగా అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. పురుషుల గ్రూప్ బి లో కజకిస్తాన్ 20-6 తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. బాల్తాబ్‌కులీ ఆదిల్, నెడోకొంట్సేవ్ 4 గోల్స్ సాధించగా, తోసోయ్ ఎడ్వర్డ్ మూడుసార్లు గోల్స్ చేయగా, లామాయేవ్ మాగ్జిమ్, షకెనోవ్



మురాత్, అకింబే అల్దియార్ తలా రెండు గోల్స్ సాధించారు. అలాగే అఖ్మెటోవ్ రుస్లాన్, మాడిమార్ అల్మాట్, బొబ్రోవ్స్కి మిస్టిస్లావ్ తలా 1 గోల్ చేశారు. భారత్ తరపున భాగేష్ కుథే 3 గోల్స్ చేయగా, ఉదయ్ ఉత్తేజ్, ప్రవీణ్ గోపీనాథన్ తలా ఒక గోల్ చేశారు. కాగా మహిళల గ్రూప్ ఎ లో జపాన్ 26-13 తేడాతో సింగపూర్‌ను ఓడించింది. కోబయాషి మహో 6 గోల్స్‌తో ఆధిక్యంలో ఉండగా, సోబాజిమా సాకురా (4), కెప్టెన్ ఫుకుడా షోకా, లోరే నినా, సొండా యుమెకా మరియు శిరోనోషిత కహో (3 చొప్పున) ఉన్నారు. షిబాట కనడే 2 గోల్స్ చేయగా, బాండో రికో, ఎగుచి సెయిరా తలా 1 గోల్స్ చేశారు. సింగపూర్ తరఫున యాప్ జింగ్జువాన్ 4, లిమ్ వాన్ జున్, లీ జువాన్ హై తలా 3 గోల్స్ సాధించగా, టియో జి సువాన్, కో టింగ్, యో యింగ్ తలా 1 గోల్స్ చేశారు.

## ఆస్ట్రేలియాతో రెండో టెస్టు తొలి రోజు

# భారత్ 9 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ అండర్19 జట్టు తొలిసారి బ్యాటింగ్‌లో తడబాటుకు లోనైంది. మెక్‌కే వేదికగా మొదలైన రెండో టస్ట్ తొలి రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి భారత్ 7 వికెట్లు నష్టానికి 144 పరుగులు చేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 20, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆశించిన రీతిలో ఆడలేక తేలిపోయాడు. ఈ మ్యాచ్ ఓపెనరల్‌గా ప్రమోష్ పొందిన విహాన్ మల్హోత్రా (11) నిరాశపరిచాడు. మరో ఓపెనర్, కెప్టెన్ ఆయుశ్ మాత్రే (4) వైఫల్యాల పరంపర కొనసాగించాడు. వేదాంత్ త్రివేది (25) నిలదొక్కుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. రాహుల్ కుమార్ (9), వికెట్ కీపర్ హర్వంశ్ పంగాలియా (1) సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. ఖిలన్ పటేల్ (26)



కాసేపు పోరాడినప్పటికీ ఆట ముగిసే సమయానికి కొద్ది ముందు ఔటయ్యాడు. హెనిల్ పటేల్ (22 నాటౌట్), దీపేశ్ దేవేంద్రన్ (6 నాటౌట్) సహకారంతో భారత్‌కు గౌరవ ప్రదమైన స్కోరు అందించేందుకు ప్రయత్నిస్తూ క్రీజులో ఉన్నారు. ఇకఆస్ట్రేలియా బౌలర్లలోకేజీ బార్టన్, విల్ బైరో మ్ టీమిండియా టాపార్డర్‌ను ఇబ్బంది పెట్టారు. కేజీ, బైరోమ్ తలో 2 వికెట్లు పడగొట్టగా, ఛార్లెస్‌లచ్‌మండ్, జూలియన్‌కు తలో వికెట్‌దక్కింది. అంతకు ముందు భారత్ బౌలర్లు చెలరేగ డంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది. హెనిల్ పటేల్(9-3-21-3), ఖిలన్ పటేల్ (12-5-23-3), ఉధవ్ మోహన్ (6-0-23-2), దీపేశ్ దేవేంద్రన్ ( 7.3-2-22-1 కలిసికట్టుగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ఆసిస్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ లీ యంగ్ (66) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు.



## జూడో వరల్డ్ ఛాంపియన్‌షిప్:

# లింతోయ్ విక్టరీతో భారత్‌కు తొలి పతకం

**న్యూఢిల్లీ:** జూనియర్ జూడో ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో లింతోయ్ చనంబం భారతదేశానికి తొలి పతకం అందించింది. పెరూలోని లిమాలో మంగళవారం జరిగిన జూడో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున తొలి పతకాన్ని గెలుచుకున్న లింతోయ్ చనంబమ్ చరిత్ర సృష్టించింది. మహిళల 63 కిలోల విభాగంలో 19 ఏళ్ల చనంబమ్ కాంస్య పతక పోరులో నెదర్లాండ్స్‌కు చెందిన జోనీ గీలెన్‌పై విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు, చనంబమ్ తన చివరి గ్రూప్ డి మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన సో మోరిచికా చేతిలో ఓడిపోయింది. మోరిచికా మహిళల 63 కిలోల ఫైనల్‌కు చేరుకున్న తర్వాత మణిపూర్‌కు చెందిన జూడోకా రెపిచేజ్ మార్గం ద్వారా పతక పోరులోకి ప్రవేశించింది. రెపిచేజ్ రౌండ్‌లో, చనంబమ్ మొదట స్లోవేకియాకు చెందిన ఇలారియా సుర్కాన్‌ను ఓడించి, గీలెన్‌తో కాంస్య పతక పోటీకి సిద్ధమైంది. ఇది చానంబంకు లభించిన రెండవ వయసు గ్రూప్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం. క్యాడెట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తొలి భారతీయ జూడోకాగా కూడా ఆమె గుర్తింపు పొందింది. ఆమె మూడు సంవత్సరాల క్రితం 2022లో ఆ ఘనతను సాధించింది. కాగా గత సంవత్సరం కాలంగా, చనంబం గాయాలతో ఇబ్బంది పడింది. తిదిలి గాయంతో ఆమె చాలా కాలం పాటు ఆటకు దూరంగా ఉండి, ఈ సంవత్సరం ప్రారంభంలోనే పోటీ జూడోకు తిరిగి వచ్చింది.

## ఆస్ట్రేలియా పర్యటనలో..

# భారత్ హిట్ ఇన్నింగ్స్

### టాప్5లో 2 సార్లు రోహిత్







**న్యూఢిల్లీ:** భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ ఈ నెల 19 నుండి ఆస్ట్రేలియా గడ్డపై జరుగుతుంది. ఆస్ట్రేలియాతో తలపడే టీమిండియాలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి చోటు కల్పించారు. అయితే ఇవ్వటి వరకూ ఆస్ట్రేలియాపై జరిగిన వన్డేల్లో అత్యధిక ఇన్నింగ్స్‌లు ఆడిన పలువురు బ్యాట్స్‌మెన్‌లు ఉన్నారు. టాప్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ శర్మ పేరు రెండు సార్లు రికార్డయింది. జనవరి 2016లో పెర్త్‌లో ఆస్ట్రేలియాపై రోహిత్ 171 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని వన్డే కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా ఉంది. ఆ సమయంలో పిచ్ వేగంగా మరియు బౌన్సీగా ఉండేది. పరుగులు చేయడం కష్టతరం చేసింది. అయితే, భారత ఇన్నింగ్స్‌ను స్థిరంగా ఉంచడానికి రోహిత్ అద్భుతమైన ఓర్పు మరియు సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. తర్వాత సౌరవ్ గంగూలీ 2000లో అడిలైడ్‌లో పాకిస్థాన్‌పై 141 పరుగుల చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ కార్ల్టన్ యునైటెడ్ సిరీస్‌లో భాగం. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గంగూలీ కెప్టెన్‌గా ఆడి జట్టును నడిపించాడు. అతని ఇన్నింగ్స్ అద్భుతమైన పోరాట స్ఫూర్తిని ప్రదర్శించింది. ఇక జనవరి 2004లో యువరాజ్ సింగ్ ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో 139 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ ఒత్తిడిలో కూడా ఆడగల అతని సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 5వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన యువరాజ్, భారత్ 80 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పుడు జట్టును స్థిరపరిచి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను స్వీకరించాడు. జనవరి 2015లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 138 పరుగులు చేసిన రోహిత్ రెండో సారి ఈ లిస్ట్‌లో స్థానం సంపాదించాడు. ప్రారంభ వికెట్లు కోల్పోయిన తర్వాత, రోహిత్ ఓపికగా ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అతను సింగిల్స్‌తో పరుగులు సాధించాడు. తన విలక్షణమైన శైలిలో ఫోర్లు, సిక్సర్లు కొట్టాడు.

2015 ప్రపంచ కప్‌లో మెల్‌బోర్న్‌లో దక్షిణాఫ్రికాపై శిఖర్ ధావన్ 137 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి. ఇన్నింగ్స్ ప్రారంభించిన ధావన్ దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నాడు.

# జ్వెరెవ్ సంచన ఓటమి

### అగ్రస్థానానికి రిండర్‌క్నెచ్



**న్యూఢిల్లీ:** షాంఘై మాస్టర్స్ 2025లో అలెగ్జాండర్ జ్వెరెవ్ సంచలన ఓటమి చెందాడు. ఫ్రాన్స్‌కు చెందిన రిండర్‌క్నెచ్ చేతిలో ఘోర పరాజయం పాలయ్యాడు. షాంఘై మాస్టర్స్ టోర్నమెంట్‌లో ప్రపంచ మూడో నంబర్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెచ్ 4-6, 6-3, 6-2 తేడాతో ఓడించి, టోర్నమెంట్‌లో అగ్రస్థానంలో చేరుకున్నాడు. క్లిష్ట పరిస్థితుల్లో, 54వ ర్యాంక్‌లో ఉన్న ఫ్రెంచ్ ఆటగాడు ఒక సెట్ నుండి తిరిగి వచ్చి, మరింతగా ఉక్కిరిబిక్కిరి అయిన జ్వెరెవ్‌ను గందరగోళానికి గురయ్యేలా చేశాడు. షాంఘైలో తన చివరి మ్యాచ్ ముగిసే సమయానికి జ్వెరెవ్ బొటనవేలికి గాయమైంది. కానీ అతను ఈ టోర్నీ మూడవ గేమ్‌లో ఫోర్‌హ్యాండ్‌తో రిండర్‌క్నెచ్‌ను బ్రేక్ చేయడంలో ఇబ్బందులు పడలేదు. రెండవ సెట్ ప్రారంభంలోనే అతను దాదాపు ముందుకు వెళ్ళాడు. అయితే రిండర్‌క్నెచ్ పుంజుకుని సరైన సమయంలో, తెలివిగా దాడి చేయడంతో జ్వెరెవ్ ఒకింత ఇబ్బందికి గురయ్యాడు. నాల్గవ గేమ్‌లో ఒత్తిడిని పెంచి చివరికి బ్రేక్ చేశాడు. అదే జోరును కొనసాగిస్తూ, మూడవ సెట్‌లో 30 ఏళ్ల అతను మూడవ గేమ్‌లో బ్రేక్ చేశాడు. ఏడో గేమ్‌లో డబుల్ ఫాల్ట్ రిండర్‌క్నెచ్‌ను మళ్ళీ బ్రేక్ చేయడానికి దారితీసేలా ప్రయత్నించాడు. కానీ రిండర్‌క్నెచ్ జ్వెఎవ్‌ను ఓడించడంతో ప్రపంచ నెంబర్ 3 టోర్నమెంట్ నుండి నిష్క్రమించక తప్పలేదు.

# రూ.2700 పెరిగిన బంగారం!

**ముంబయి, అక్టోబరు 7:** బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లేదు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. మంగళవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం



రూ.1, 23, 850కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1, 15, 500ను తాకింది. మరోవైపు కిలో వెండి ధర రూ.1, 54, 350కు చేరింది.పండగల సీజన్ కావడం, అంతర్జాతీయంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. వెండి కిలో రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని ఇటీవల మార్కెట్ పండితులు అంచనా వేసిన సంగతి తెలిసిందే.

# కనీస పించన్ రూ.2500..

### ఇపిఎఫ్ఒ ట్రస్టీ సమావేశంలో వెలువడనున్న నిర్ణయం

**ముంబయి, అక్టోబరు 7:** ప్రైవేట్ రంగంలోని ఉద్యోగులకు అదిరే శుభవార్త. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)కు చెందిన అత్యున్నత నిర్ణయాధికార కమిటీ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈనెల 10, 11 తేదీల్లో బెంగళూరులో సమావేశం కానుంది. ఈ సమావేశంలో కనీస పెన్షన్ పెంపుపై ప్రధానంగా చర్చ ఉండనుందని తెలుస్తోంది. కనీస పెన్షన్ రూ. 1000 నుంచి



రూ. 2500లకు పెంచే ప్రతిపాదనలపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అదే జరిగితే లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ పరిధిలో కనీస పెన్షన్ ప్రస్తుతం నెలకు రూ. 1000గా ఉంది. దీనిని 2014లో నిర్ణయించారు. అప్పటి నుంచి అదే పెన్షన్ కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ఉద్యోగుల సంఘాలు కనీస పెన్షన్ రూ. 1000 అనేది చాలా తక్కువగా ఉందని, ప్రస్తుత ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస పెన్షన్ రూ. 7500లకు పెంచాలని పలు ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్ల అసోసియేషన్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు కనీస పెన్షన్‌ను 7.5 రెట్లు పెంచేందుకు సుముఖంగా లేరు. అయితే, రూ.1000 నుంచి రూ.2500లకు పెంచేందుకు ఆమోదం తెలపవచ్చని తెలుస్తోంది. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) పరిధిలో పెన్షన్ లెక్కించేందుకు ఒక స్థిరమైన ఫార్ములా ఉంది. పెన్షన్ శాలరీ అంటే బేసిక్ శాలరీ ప్లస్ గత 60 నెలల డీఏ (గరిష్ఠంగా రూ. 15000)గా లెక్కలోకి తీసుకుంటారు. పెన్షనేబుల్ శాలరీ గరిష్ఠ పరిమితి రూ. 15000గా ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తి 35 సంవత్సరాలు సర్వీసులో ఉంటే అతనికి నెలకు రూ. 7500 వరకు పెన్షన్ లభిస్తుంది. 58 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగాల్సి ఉంటుంది. ముందే ఉద్యోగం వదిలేస్తే విత్‌డ్రాయల్ బెనిఫిట్స్‌తో పాటు తగ్గించిన పెన్షన్ లభిస్తుంది. అంటే చేతికి అందే పెన్షన్ భారీగా తగ్గిపోతుంది. పూర్తి సర్వీసులో ఉన్న వారికి గరిష్ఠ పెన్షన్ లభిస్తుంది.

# టాటా ఇన్వెస్ట్‌మెంట్ షేర్లలో భారీ పతనం!

**ముంబయి, అక్టోబరు 7:** టాటా గ్రూప్ నుంచి దాదాపు రెండేళ్ల తర్వాత మరో పెద్ద ఐపీఓ వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టాటా క్యాపిటల్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. అయితే ఈ ఐపీఓ బజ్‌తో ఇటీవల భారీగా పెరిగిన టాటా గ్రూప్‌కే చెందిన టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ షేర్ ధర మంగళవారం భారీగా పతనమై ఇన్వెస్టర్లకు తీరని నష్టాల్ని మిగిల్చింది. ఇంట్రాడేలో దాదాపు 7 శాతం వరకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక శాతానికిపైగా లాభంతోనే ప్రారంభమైంది. ఇంట్రాడేలో 2 శాతం వరకు పెరిగింది. అక్కడి నుంచి వరుసగా పతనమవుతూనే వచ్చింది. ఇంట్రాడేలో 8 శాతానికిపైగా పతనంతో రూ. 9,123 వద్ద కనిష్టాన్ని తాకింది. ఇక్కడ చూస్తే షేర్ ధర కిందటి క్లోజింగ్ నుంచి ఏకంగా రూ. 800కుపైగా పడిపోయింది. ఇంట్రాడే గరిష్టం నుంచి



చూస్తే రూ. 1000కిపైగా పడిపోవడం గమనార్హం. టాటా ఇన్వెస్ట్‌మెంట్ స్టాక్ ఇటీవల భారీగా పుంజుకుంది. కొన్ని నెలలుగా50 శాతానికిపైగా స్థిరంగా రిటర్న్స్ ఇస్తూ వచ్చింది. ఐదేళ్లలో చూస్తే ఏకంగా 900 శాతానికిపైగా రాబడి అందించింది. స్టాక్ స్ప్లిట్, ఐపీఓ వంటివి ఉన్నాయి. ఇన్వెస్టర్లను ఊరించేలా టాటా క్యాపిటల్ ఐపీఓపై ప్రకటన వచ్చింది. మరోవైపు టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ తొలిసారిగా స్టాక్ స్ప్లిట్ కూడా ప్రకటించింది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 11,847 కాగా కనిష్ట ధర రూ. 5,145 గా ఉంది. కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 47.61 వేల కోట్లుగా ఉంది. సెప్టెంబర్ నెలలో ఈ స్టాక్ ఏకంగా 50 శాతానికిపైగా పుంజుకుంది.



## రెండోరోజూ లాభాల్లోనే

# స్టాక్ మార్కెట్లు

**ముంబయి, అక్టోబరు 7:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం రెండో రోజు కూడా పాజిటివ్ ధోరణిలో కొనసాగాయి. ఈ క్రమంలో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 462.15 పాయింట్లు ఎగసి 82,252.27 స్థాయికి చేరుకుంది. అదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 124.55 పాయింట్లు పెరిగి 25,197.70 వద్ద నిలిచింది. ఈ నిఫ్టీ రికార్డ్ స్థాయికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున లాభపడ్డారు. సెన్సెక్స్‌లో టాప్ గెయినర్స్, లూజర్స్ ఈ క్రమంలో సెన్సెక్స్‌లోని కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ వంటి షేర్లు 1.9 శాతం వరకు లాభాలను అందుకోగా, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. వీటి పనితీరు మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలను చూపించింది. ఈ క్రమంలో మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్100, స్మాల్‌క్యాప్100 సూచీలు వరుసగా 0.42 శాతం, 0.34 శాతం లాభాలతో ట్రేడయ్యాయి. సెక్టోరల్ సూచీల్లో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్, నిఫ్టీ రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.8 శాతం వరకు పెరిగి అగ్రగామిగా నిలిచాయి. కానీ నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.3 శాతం వరకు తగ్గాయి. వొడాఫోన్ ఐడియా షేర్లు మంగళవారం అద్భుత జోష్‌తో దూసుకెళ్లాయి. బీఎస్ఈలో కంపెనీ షేరు 8 శాతం పెరిగి రూ. 9.2 వద్ద ఎనిమిది నెలల గరిష్ట స్థాయిని తాకింది. సెప్టెంబర్ నుంచి ఈ షేరు ధర ఏకంగా 42 శాతం పెరిగింది. బిఎస్ఇలో మిడ్‌ఖ్యాప్‌సూచీ 0.45శాతం లబ్దిపొందితే స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.15శాతం క్షీణించింది.

# డిబిటితో రూ.4.31 లక్షల కోట్లు ఆదా

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**ముంబై, అక్టోబర్ 7:** వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని కేంద్రం చెపుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వివరాలు స్వయంగా వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్రమంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్‌టైమ్ ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు. దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, యుపిఐ డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను కాపాడుతూ, ప్రతి పౌరుడిని ఉద్ధరించేలా, టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటి వరకూ భారత్‌లో ఉన్న బ్యాంకులు లేదా కంపెనీలు అమెరికా డాలర్లు, యూరోలు, యెన్ వంటి విదేశీ కరెన్సీల్లో లావాదేవీలు చేయాలంటే, అవి ఇప్పటివరకు హాంకాంగ్, టోక్యో లేదా లండన్ బ్యాంకుల ద్వారా సెటిల్ చేసేవి. ఈ ప్రక్రియకు 36 నుండి 54 గంటల సమయం పట్టేది. కానీ ఇప్పుడు,గిఫ్ట్ సిస్టమ్ ద్వారా భారత్‌లోనే ఈ లావాదేవీలను రియల్ టైమ్‌లో (తక్షణమే) పూర్తి చేయొచ్చు. గిఫ్ట్ ట్రాన్సాక్షన్స్ ద్వారా భారత్ ఇప్పుడు హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన నిలిచింది. విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్స్‌లో సమయం, ఖర్చు రెండూ తగ్గుతాయి. బ్యాంకులు, కంపెనీలు, ఇన్వెస్టర్లకు తక్కువ సమయంలో సులభమైన లావాదేవీలు జరిగే వీలు. భారత్ అంతర్జాతీయ ఫైనాన్షియల్ హాబ్‌గా ఎదగడంలో ఇది కీలకం.



## నేటి నుంచి యుపిఐ చెల్లింపుల్లో

# బయోమెట్రిక్ ఫీచర్

### ముఖ గుర్తింపు లేదా వేలిముద్రలతోనే చెల్లింపులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** డిజిటల్ చెల్లింపుల రంగంలో మరో అద్భుతమైన మార్పురాబోతోంది. రేపటి నుంచిబుధవారంనుంచి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) వినియోగదారులు పిన్ లేదా పాస్‌వర్డ్ నొక్కకుండానే చెల్లింపులు చేసుకోవచ్చు. మీ ముఖం లేదా వేలిముద్ర ద్వారా చేసుకునే ఛాన్సుంది. బయోమెట్రిక్ ఆధారిత గుర్తింపు విధానంతో యూపీఐ చెల్లింపులు ఇకపై మరింత సులభం కానున్నాయి. ఇప్పటివరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడానికి మనం నాలుగు లేదా ఆరు అంకెల పిన్‌ను ఎంటర్ చేయాల్సి వస్తుంది. కానీ ఇకపై ఆ పిన్ అవసరం లేదు. భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ ఆధారంగా నమోదైన మీ బయోమెట్రిక్ డేటా (ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర) ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ సాంకేతికత మీ గుర్తింపును త్వరగా ధృవీకరించి, సురక్షితంగా లావాదేవీలను పూర్తి చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల డిజిటల్ చెల్లింపులకోసం పిన్‌తో పాటు ఇతర గుర్తింపు పద్ధతులను అనుమతించింది. దీనిలో భాగంగా బయోమెట్రిక్ ఆధారిత ధృవీకరణ విధానం అమల్లోకి వస్తోంది. ఈ కొత్త ఫీచర్ యూపీఐ చెల్లింపులను మరింత వేగవంతం చేయడమే కాకుండా, వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. పిన్‌ను గుర్తుంచుకోవడం లేదా టైప్ చేయడం వంటి ఇబ్బందులు ఇక ఉండవు. మీరు యూపీఐ యాప్ ద్వారా చెల్లింపు చేయాలనుకున్నప్పుడు, పిన్ ఎంటర్ చేయడానికి బదులు మీ స్మార్ట్‌ఫోన్ కెమెరా ద్వారా ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర స్కానర్ ద్వారా ధృవీకరణ చేయాలి. ఈ డేటా ఆధార్ డేటాబేస్‌తో సరిపోల్చబడి, క్షణాల్లోనే మీ లావాదేవీ పూర్తవుతుంది. ఈ ప్రక్రియ వేగవంతం కావడమే కాదు, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ డేటా కారణంగా సురక్షితంగా ఉంటుంది. ఈబయోమెట్రిక్ ఫీచర్ ప్రతిఒక్కరికీ ఉపయోగపడుతుంది. ప్రధానంగా టెక్నాలజీ పెద్దగా పరిచయంలేనివారు, పిన్‌ను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడేవారికి ఇది సౌలభ్యంగా ఉంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.